# యుగపురుషుడు

## (మహాత్మా గాంధి)

" నాజీవితమే నాజీవిత సందేశము "

Acc 4256

రచయితలు S-386

బొడ్డుపల్లి పురుషోత్తము

ఉభయభాషా ప్రవీణ

శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ

వివేక పబ్లిషర్సు, నెల్లూరు.

కాపీరైటు] [రు. 1—0—0.

Approved by the Text Book Committee *Vide*
Madras Fort St. George Gazette
Part 1-B, Educational Dated 13-5-51 Page No 6.

1952

# మున్నుడి

మానవాభ్యుదయమునకు నిరంతరము మహత్తరమైన మార్పులు విశ్వమున జరుగుచుండును. ప్రేమామృతమూర్తి యగు భగవానుడు తన ప్రేమతత్త్వమును, తన సందేశాల హృదయములను తనకీర్తి మేళవించి మానవులకు ప్రత్యక్ష రూపములలో నవతరించి, ఆయా సమయముల తన చారిత్రలను చూపుచుండును. అట్టి మహాత్మ రత్నములనే మనము మహాత్ములుగా పరిగణించుచున్నాము. వారు సకల కాలములలో గాని భావిమానవజాతి పురోభివృద్ధికి గాను మార్గదర్శకులుగా నిలిచ్చెదరు. వారి జీవితములు ప్రజాబాహుళ్యమునకు ఆదర్శప్రాయములు. వారి దివ్యప్రబోధనములు దుష్టులహృదయములను, శిష్టులకు, అజ్ఞానులకు ధృతిని, రక్షణను, వెలుగును ప్రసాదించును.

మన కథానాయకుడగు గాంధీమహాత్ముడట్టి మహనీయుల యగ్రగణ్యుడు. ఈ మహానుభావుడు సత్యాహింసలనే తన యుచ్ఛ్వాసనిశ్వాసములుగ చేసికొని సర్వవిధముల పతనమైన భారతదేశమును సముద్ధరించెను.

దాదాపు రెండువందల సంవత్సరములు దాస్యాంధకారమున నిమగ్నమైన భారతజాతికి స్వాతంత్ర్యదివ్య తేజస్సులను ప్రసాదించిన భారతభాగ్యవిధాత యీతడే! ప్రపంచమున ప్రాబల్యమును సంపాదించిన జాత్యహంకారులు తోడి మానవ సంఘమును పశుప్రాయముగఁ జూచు సమయమున, అద్భుతమును, అమోఘమునగు నాత్మశక్తిని ప్రదర్శించి, భారతీయుల కంతర్జాతీయ గౌరవప్రతిష్ఠలను గూడ సమకూర్చినదీ మహోన్నత వ్యక్తియే!!

కులమత విద్వేషములతో క్రుళ్ళి కునుములుచున్న మానవులకు మానవత్వమును బోధించిన దీ పురుషోత్తముఁడే!!! భారత జాతి సముద్ధరణముతో పీడితప్రజాకోటి నంతను సముద్ధరించి, విశ్వమానవ కళ్యాణమును, సర్వమానవ సౌభ్రాతృత్వమును సాధింపవలయునని తహతహలాడిన దీ శాంతికాముఁడే!!

ఇట్టి మహత్తరవ్యక్తి తరము వారము మనము. కాన మనముకూడ నొకవిధముగ ధన్యులమని యుప్పొంగనగును.

అందులకై 'సత్యప్రయోగశాల' యగు నామహాత్ముని జీవితమును మనము సదా మననముచేయవలయును. ఆ మహాత్ముని దివ్యవాణి మనకు నిత్య వైతాళికము కావలయును. అప్పటికిగాని 'మనము మహాత్ముని సంతతివారమ'ని సగర్వముగ పల్కుటకు మనకు హక్కుగలుగదు. మనమే యననేల, సర్వప్రపంచము 'అసత్యమునుండి సత్యమునకు, తమస్సునుండి జ్యోతికి, మృత్యువునుండి యమృతత్వమునకు' నడువవలెనన్న, ఈ యుగపురుషుని జీవితము ప్రతివాని హృదయాంతరాళమున ప్రతిధ్వనింపవలెను.

అట్టి సందర్భమున, మా యీ ప్రయత్నము మహోన్నత హిమాలయములను చిన్నదర్పణమున చూపించుటవంటిది కాఁగల్గుచో కృతార్థులము.

—రచయితలు

# యుగపురుషుడు

(మహాత్మగాంధి)

## అవతారము — విద్యాభ్యాసము

౧

నల్లని వాలుఁగనులు; అమృతమయమైన చూపులు; బక్కపలచని శరీరము; బట్టతల; బోసినోరు; ఆజానుభులగు బాహువులు-ఇది యాతని యాకృతి.

తెల్లని ముతుక ఖద్దరు దోవతులు, కఱ్ఱయు, కిర్రు చెప్పులును ఆతని యలంకరణములు.

ఆతఁడు పసివారలలో పసివాఁడు; పెద్దలలో పెద్ద. అతఁడు శాకాహారి. ఆతని దేహపాటవ మద్భుతము.

అతఁడు కటిక నేలపై అవలీల పవ్వళింపఁగలఁడు. విశ్రాంతి యల్పము, వ్యవసాయ మధికము, నిశ్చలచిత్తుఁడు, నిర్వికారుఁడు, నిరాడంబరుఁడు. క్షమాప్రేమ లతనిలో రూపు గొన్నవి.

అతఁడు తన నిర్ణయమును బలవంతముగ నితరులపై పులుమఁడు. వ్యక్తిస్వాతంత్ర్యమును సర్వదా సంరక్షించును. మొనగాని మనోదార్ఢ్యము, ఉబ్బరమగు నిబ్బరము ఆతని సొమ్ములు.

విరోధులకును హృదయమిచ్చి వర్తించును. ఆత్మ విశ్వాసమునుండి యావంతయు తొలఁగఁడు. అందన్యుల ప్రాబల్యము నంగీకరింపఁడు. తన తప్పును గప్పిపుచ్చఁడు. తంత్ర మనునది యెఱుఁగఁడు. కేవల వాగ్ధాటితో ఫలితముల కాస పడఁడు, నిరాశా నిస్పృహ లెట్టివో యెఱుఁగఁడు. ప్రజల సంఖ్యాబలముపై నాధారపడఁడు. ఉద్రేకములతోఁ గూడిన యుద్యమముల నేవగించును.

అన్ని మతముల యందును ఆయనకు విశ్వాసము మెండు. మతోన్మాదమును గర్హించును. రాజకీయములలో అధ్యాత్మికమును మెలపి, దానిని పూతమొనర్చిన పుణ్య మూర్తి యతఁడు. ఆతని జీవితనౌక కాతని యంతర్వాణియే చుక్కాని.

బ్రిటిషుసామ్రాజ్యపుఁ బునాదులను కదిలించిన మహా వ్యక్తి; నలుబదికోట్లభారతీయులను విప్లవోన్ముఖులఁ గావించిన మానవోత్తముఁడు.

సర్వసాధారణముగా లోక మితనిని 'మహాత్మాజీ' 'బాపూజీ' 'భారతభాగ్యవిధాత' యను నామములతో గౌర వించును. వారి పూర్తినామధేయము మోహనదాసుకరంచంద్ గాంధి. కథియవాడ ప్రాంతమున 'పోరుబందరు' పురమున 1869 వ సంవత్సరము అక్టోబరు 2-న తేదీన వాసిగాంచిన వైశ్య

కులమున నతఁ డవతరించెను. వీరి పూర్వికులు ఉన్నతపదవుల నలంకరించిన దిట్టలు. వీరి పితామహుఁడగు 'ఓతాగాంధి' కథియవాడ సంస్థానమునకు దివానుగాఁ బనిచేసెను. ఆతఁడు తన ప్రభువులయెడ నెట్టి భక్తివిశ్వాసములు ప్రదర్శించెనో తెల్పుట కొక చిన్న కథ కలదు. ఓతాగాంధిని పోరుబందరు సంస్థానాధీశ్వరుఁడు ఏ కారణముచేతనో భర్తరఫ్ చేయఁగా ఆతఁడు సమీపమునఁ గల జునాగఢ్ సంస్థానమున దివానుగాఁ జేరెను. అచట నాతఁడు తన క్రొత్త యజమానునకు నెడమ చేతితో సలాము చేయసాగెను. నవాబు విస్మయముతో దీనిని గుర్తించి ప్రశ్నింపఁగా 'నాకుడిచేతిని పోరుబందరునకు అర్పణ గావించితిని'అని సవినయముగ ఓతాగాంధి బదులిడెను. అంతటి రాజభక్తిపరాయణుఁడు వీరి పితామహుఁడు!

ఇఁక మోహనదాసు తండ్రి 'కాబాగాంధి' రాజకోట దివానుగా బనిఁజేసెను. కాబాగాంధికి తన పూర్వులయం దకుంఠిత భక్తివిశ్వాసములు, గౌరవప్రపత్తులు గలవు. అతఁడు సత్యసంధుఁడు; ధీరోదారుఁడు; ప్రేమమయుఁడు; అనుభవ శీలుఁడు; తండ్రిని మించిన రాజభక్తి పరాయణుఁడు.

ఒకనాఁడొక యున్నతోద్యోగి తన సంస్థానాధీశ్వరునిఁ గూర్చి చులకనఁగా మాటలాడుట కాబాగాంధి విని సహింప లేక పోయెను. ఆతఁడాగ్రహావేశముల పట్టఁజాలక, అట్టి

దుర్భాషల కట్టిపెట్టుమని వానిని దీవ్రముగ మందలించెను. కాని యీ వాచాలుఁ డంతటికుంతే మిన్నకుండక యున్నతోద్యోగి యగు తన్ను, ఒక సామాన్యపు దివాను ధైర్యముతో ధిక్క-రించినందులకు కుపితుఁడై సమరాపణ కోరెనఁగాని వానిని వదల ననెను. కాని ధీరుఁడగు కాబాగాంధి యందుల కంగీకరించునా? అంత నా ధూర్తుఁడు కాబాగాంధిని చెఱనుంచెను. ఇట్టియుద్ధత యూఁపుల కీతఁడు చలింపలేదు. కడకు నాతఁడు చేయునది లేక కాబాగాంధిని విడిపించెను. ఇట్టి యసాధారణమైన యాత్మ గౌరవ ప్రవృత్తులు గలవాఁడు మహాత్ముని తండ్రి.

మోహనదాసు జనని పుత్తలీబాయి, ఉత్తమవంశ సంజాత. శివాజీని గన్న జీజీబాయికి, వివేకానందునిఁగన్న భువనేశ్వరికి ఈపూజ్యమాత యేమాత్రము తీసిపోదు. సనాతన ధర్మపరాయణురాలు. ఆమె నిత్యము దేవాలయమున కేఁగి దైవసన్నిధానమున పురాణశ్రవణము గావించెడిది. నిష్ఠురములగు చాతుర్మాస్య, చాంద్రాయణ వ్రతనియమములామెకు సుసాధ్యములు. సూర్యభగవానుని దర్శనము గానిది యామె భోజనము చేసెడిదికాదు. ఆకాశము పూర్తిగా మొయిళ్లుకప్పి కొంచెమైనను తెఱపయీయని దుర్దినములయందు మోహనుఁడు సూర్యదర్శనమును తల్లికిఁ దెల్పుటకై మెడ వాల్చక మిన్నువంక చూచెడివాఁడు. కొండొక సమయమున స

సూర్యదర్శనము కాఁగానే గంతులు వైచుచు బాల గాంధి తల్లి కా వార్త తెల్పెను. ఆమె బయటికి వచ్చి చూచునంతలో భగవానుఁ డదృశ్యుఁడాయెను. కాని యామహాసాధ్వి నిస్పృ తయు నిరాశఁ జెందక 'పోనిమ్ము నాయనా! నేనీనాఁడు భుజించుట భగవానుని కిష్టము లేదు' అని దరహాసితవదనయై పల్కెనట. ఆహా! యేమి యా వ్రతదీక్ష!!

ఇట్టి మహాజనని ప్రభావము పుత్రునిపై నెంతగా నుండునో ఎవ రూహింపలేరు? ఈ మహాసాధ్వి యుగ్గుఁబాలతో మహాత్ముల పుణ్యగాథలను తన యనుఁగుబిడ్డకు నూఱి పోసినది. మోహనునకుఁ దల్లియెడల నెంతటిప్రేమగౌరవములో పేర్కొనఁజాలము. అతఁ డేమైన ఘనతను సాధించిన నది యాచల్లని తల్లి యాశీఃప్రభావమే! ఈమె ఆధ్యాత్మిక చింతనముతో పాటు సంస్థానరాజకీయములను గూడ నవధరించెడిది. ఈమె యసాధారణ మేధాబలమును సంస్థాన పురంధ్రులు వేనోళ్లఁగొనియాడెడి వారు.

౨

రాజకోటలో మోహనుఁ డేడవ యేటనే బడికిఁ బంపఁబడెను. బాల్యమున నాతనికి మిక్కిలి బిడియముండెడిది. 'బిడియము నా నాలు' అని యతఁడు సగర్వముగఁ జెప్పుకొనెడి వాఁడు. తన సహచరులతోఁ గలసి మెలసి సంచరించెడివాఁడు

కాఁడు. గంట మ్రోఁగఁగనే బడికిఁజేరి, తిరిగి బడి వదలఁగనే యిల్లు చేరెడివాఁడు. పాఠశాల పెద్దలకు విధేయత చూపెడి వాఁడు. మిక్కిలి సాత్త్వికస్వభావము గలవాఁడు. పరిహాసమున కుఁ గూడ కల్లలాడెడివాఁడు కాఁడు.

అది పాఠశాల పరీక్షాదినము. పరీక్షాధికారి మోహనుఁ డున్న తరగతికే తెంచి, ఆంగ్లమున ఉక్తలేఖనమునకుఁ గాను కొన్ని మాటల నొసఁగెను. అందు 'కెటిల్' అను పదమొకటి. దీనిని మోహనుఁడు సరిగా వ్రాయలేక పోయెను. ఇది యుపాధ్యాయుఁడు గమనించెను. అతనిచే అన్నిమాటలు సక్రమముగ రచింపఁజేయు దురాశతో ప్రక్కవానిపుస్తకమును తొంగిచూడుమనిసంజ్ఞగావించెను. కానియందులకుమోహనుఁడు సమ్మతింపలేక మిన్నకుండెను. ఉపాధ్యాయుఁడు, బాలురు సక్ర మపద్ధతిలో రచించుచున్నారో లేదో గమనించుటకే యక్కడ నుండెనుగాని, చెడుమార్గముల ప్రోత్సహించుటకుఁగాదని మోహనుఁ డప్పటికే యభిప్రాయపడెను. ఈ సంఘటన జరిగి నను ఉపాధ్యాయులయెడ అతనికిఁగల గౌరవమర్యాదలు రవ్వం తయు సన్నగిలలేదు. పెద్దలు చేయు తప్పిదములను బుద్ధిమంతు లగు పిన్నలు పాటింప కూడదనుట వారి స్వభావవిశేషమేకదా?

చదువులలో మోహనుఁడు మిక్కిలి శ్రద్ధాభక్తులను ప్రదర్శించెను. ఇంటి కీయఁబడిన పనిని సక్రమముగ నొనర్చెడు

వాఁడు. తరగతి పుస్తకములను కూలంకషముగ పఠించుట తన విధ్యుక్తధర్మముగ భావించెను. ఉపాధ్యాయు లీతనియెడ గాఢానురక్తులు. ఈతని విద్యాభివృద్ధి పత్రము, నడవడిని గూర్చిన యోగ్యతా పత్రము తండ్రి కెంతయో సంతృప్తి గల్గించెడివి!

ఇట్లుండ నొకనాఁడు మోహనుఁడు తండ్రి తెచ్చిన 'శ్రావణు పితృభక్తి' యను నాటకపుస్తకమును జూచి చదువ నారంభించెను. "పూర్వము శ్రావణుఁడను ఋషి కుమారుఁడు కలఁడు. అతని తల్లిదండ్రులు మిక్కిలి వృద్ధులు. దానికి తోడు అంధులు. ఋషికుమారుఁ డిసుమంతయు స్వీయసుఖముల కాస పడక సర్వదా మాతాపితల సేవయందే నిమగ్నుఁడాయెను. తల్లిదండ్రుల పుణ్యప్రాప్తికై యాతఁడు వారినొక కావడిలో నుంచి, భుజములు గాయలుగట్టునట్లు మోసికొనుచు పుణ్యతీర్థ ముల సేవించుచుండెను. ఒకనాఁడాతఁడొక దుర్గమాటవినినడుచు చుండ జననీజనకులకు దాహమైనది. అడిగినదే తడవుగా నతఁడు వారల నొకచో నునిచి, పాత్రగైకొని, సమీపకాసారమున కరిగి తొట్రుపాటుతో చేతికడవ ముంచెను. అపుడు 'బుడబుడ' ధ్వనులు గల్గెను. ఆసమయముననే మృగయావినోదార్థ మేతెంచిన దశరథమహారాజా ధ్వని విని, మత్తకరి జలము గ్రోలుచున్న దని భ్రమించి, చెట్టుచాటున నొదిఁగి, నిశిత నారాచమును గుఱి

చూచి పడవెను. విఘాతపటిష్ఠబాణ నిహతికా సుకుమార గాత్రుఁడు దీనారావముతో నేలఁగూలెను. తాను గావించిన ఘోరాపరాధమునకు రాజేంద్రుఁడు క్రుంగిపోయిన హృదయముతో మునిపుత్రుని జేరి క్షమాభిక్ష నర్థించెను. మునిపుత్రుఁడు నాతని తన కట్టకడపటి కడకంటి చూపుల క్షమించి, దాహపీడితులగు తన వృద్ధ జననీజనకులకు జలముగైకొని పొమ్మని కోరి విగతజీవుఁ డాయెను.

ఇచ్చట నా ఋషిదంపతు లెంత తడవునకు మరలిరాని పుత్రుని రాకకై నిరీక్షించుచుండిరి. తమకుమారుఁ డింతగా నాలసించుటచే వారి మానసము పరి పరి విధముల పరిభ్రమించెను. అంతలో జలముగైకొని తప్పటడుగులు వేయుచు సమీపించు దశరథునే తమ పుత్రునిగా భావించి, 'నాయనా! యింత తడ వేల చేసితివి? నీ జీవిత సర్వస్వమును మాసేవకై ఒప్పించి ఖిన్నుఁడవైతివా? నీ ఋణమెట్లుతీర్పఁగలము? నీవు తప్ప మాకు దిక్కెవరు?' అని యావృద్ధ దంపతు లేకకంఠమున పరితపించిరి. దశరథుఁ డంత వారి దరికేఁగి, 'మునిదంపతులారా! నేను మీపుత్రుఁడనుగాను. మీపుత్రుని జీవముల నపహరించిన దశరథుఁ డను పేరిటి పాపకర్ముఁడ'నని గద్గదస్వరమునఁ బల్కెను. అంత వారు మొదలంటు నఱకిన భూజములవలె నేల కూలి పుత్రునిఁ గూర్చి కన్నీరు మున్నీరుగా నేడ్చి, ప్రాణములఁ బాసిరి.''

కఠినపాషాణములఁగూడ కరఁగింపఁగలయీయితివృత్తము మోహనుని లేఁత డెందమును మిక్కిలి కదిలించినది. తానుగూడ శ్రావణునివలె పితృభక్తిపరాయణుఁడు కావలయునని యతఁ డాశించెను. మునిదంపతుల పుత్రశోకము వానికి మఱపురాని మహితసంఘటనము.

ఈ సమయమున నిట్టిదే మఱియొక నిదర్శనము. అది హరిశ్చంద్రనాటకము. తండ్రి యనుమతిగొని మోహనదా సా నాటకమును దర్శించెను. చతురబ్ధిపరీతభూవలయము నేలు హరిశ్చంద్రచక్రవర్తి సత్యపదవీప్రమాణతత్పరుఁడై, తన సింహాసనమును, దన యర్ధాంగిని, కడకుఁ దన ముద్దుల పట్టినిఁ గూడ తృణప్రాయముగ పరిత్యజించు టాతనికి విస్మయ విభ్రాంతులు గల్గించెను. వెంటనే యతఁడు 'అందఱును హరిశ్చంద్రునివలె సత్యసంధు లేల కాఁగూడదు?' అని తనకుఁ దా ప్రశ్నించుకొనెను. ఇది యహరహము నాతనిని వేధించెను. ఆచిఱుతప్రాయముననే సత్యమార్గానుగామియై యెట్టికడగండ్లనైన ననుభవించుటకు వెనుదీయరాదని మోహనుఁడు నిశ్చయించుకొనెను. ఆతని దృష్టిలో శ్రావణ హరిశ్చంద్రులు కట్టు కథలలోని పాత్రలుగాక, వాస్తవప్రపంచమున సజీవ మూర్తులు. నాఁటనుండి యాతనికి 'సత్యమే' యధిష్ఠాన దైవ మాయెను.

మోహనదాసు పాఠశాలలో నుపాధ్యాయులమన్ననలఁ బడసెను. అప్పుడప్పుడతనికి బహుమానములుగూడ వచ్చినవి. అతనికి తనశక్తిసామర్థ్యములపై పెద్ద నమ్మికలేదు. ఆ కారణమున బహుమానములు తనకువచ్చుటలో తానే యచ్చెరువందెడివాఁడు. తానెట్టి యల్పమైన తప్పిదము చేసినను కన్నుల నీరు నింపెడివాఁడు.

మోహనునకుఁ జిన్నతనమునుండియు ఆటలయందాసక్తి సున్న. ఇందులకుఁ గారణ మాతని సాజమగు బిడియమే. విద్యాలయములలో మానసికశిక్షణ మెంత యవసరమో, శారీరకశిక్షణముగూడ అంతే యవసరమని తెలిసికొనినపుడు గాంధి తాను చిన్నతనమున మంచి యాటగాఁడు కాలేకపోయినందులకు పశ్చాత్తాప మొందెడివాఁడు. ఆటలలో ఆసక్తి లేకున్నను, మోహనునకు వాహ్యాళి వెడలుటయం దత్యంతాభిలాషము బాల్యమునుండియు నుండెడిది. నియమము తప్పక ఆనురణము నతఁడు దానిని బాటించెను.

వ్యాయామము విషయమున గాంధి చేసిన తప్పిదము నటుంచఁగా, ఆతఁడు గావించిన మఱింత తప్పిదము చదువునకు, దస్తూరికిని నెట్టి సంబంధము లేదని తలపోయుట. ఈ దురభిప్రాయ మాతనిలో ఆంగ్లదేశము వెడలు వఱకుండెడిది. ఇందలి

తప్పిదము గ్రహించి ఆయన తరువాత యువతీయువకులకు దస్తూరి విషయమై శ్రద్ధవహింపుఁడని పలుమారు హెచ్చరించెను.

మోహనదాసు నాలుగవ తరగతి నుండి, మాతృభాష తప్ప, అన్ని విషయములను ఆంగ్లముననే పఠించెను. క్షేత్రగణిత మాతనికి మ్రింగుడు పడని పెద్దముద్ద. కాని యుపాధ్యాయుని సమర్థతచేత నది తరువాత ఆయనకు సుగ్రాహమే యయ్యెను.

సంస్కృతము మోహనునకుఁ గష్టతరమాయెను. ఇది కూడ నాలుగవ తరగతియందే ప్రారంభింపఁబడెను. ఆఱవ తరగతికి రాఁగానే, యాతఁడు సంస్కృతవిషయమున ధైర్యము కోల్పోయెను. ఆదినములలో సంస్కృత, పారసీక భాషాపండితులు పోటీలుపడెడివారు. పారసీక భాషోపాధ్యాయుఁడు మంచివాఁడని, అది సులువైన భాషయని విని, మోహనుఁడు ఆ తరగతిలో ప్రవేశించెను. ఇది సంస్కృతపండితునకుఁ గష్టము గల్గించెను. అంత నాతఁ డొకనాఁడు మోహనుని పిలిపించి 'మీ తండ్రి వైష్ణవ మతావలంబి. ఆమతసర్వస్వము సంస్కృతమునఁ గలదు. దీనిని నీ వభ్యసింపవలదా? అందు కాఠిన్యమున్న నావద్ద తెలిసికొనుము. తిరిగి సంస్కృతపుఁ దరగతిని ప్రవేశింపుము' అని బుజ్జగించెను. ఈమాటల కాతని మనసు కరఁగినది. మోహనుఁడు తిరిగి సంస్కృతపుఁ దరగతిని ప్రవేశించెను.

'ఆనాఁటి సంస్కృత పండితుఁడు నాకు మహోపకారము గల్గించెను. ఆ కొలఁది సంస్కృత పరిజ్ఞానమే లేకున్న హిందూమత పవిత్రగ్రంథములను చదువఁగల్గెడు వాఁడను కానేకాను' అని తరువాత గాంధి పెక్కుమార్లు వ్రాసెను.

ప్రతిభారతీయుఁడు పై తలగతులలో హిందీ, సంస్కృతమాదిగాఁగల భాషలు నేర్వవలయును. అన్నివిషయముల బోధన మాతృభాషయందే యుండవలయును. ఒక భాషలోఁ జక్కని ప్రవేశమును సంపాదించినవాఁడు తక్కిన భాషలను సులువుగా గ్రహింపఁగలఁడు. ఈ విషయములను గాంధి యనుభవ పూర్వకముగా గ్రహించెను.

3

మోహనదాసు పదమూఁడవ యేటనే కస్తూరిబాను వివాహమాడెను. అతఁ డప్పటికి నున్నపాఠశాలలో చదువుకొనుచునే యుండెను. తన నెచ్చెలులు తన పెండ్లిని గూర్చి ముచ్చటించుచుండ అతఁడు మిక్కిలి సిగ్గుచెందెడివాఁడు. వివాహమైన యనతికాలముననే అతఁడొక దుష్టసంసర్గమునఁ జిక్కుకొనెను.

ఆ దుష్టమిత్రుఁడు మోహనదాసు సోదరుని సహాధ్యాయి అతనిలోఁగల నీచగుణములు మోహనునకెఱుకయే. అయినను

వానిని విశ్వసనీయుఁడైన స్నేహితునిగా నతఁడు భావించెను. ఆదుష్టుని సహవాసము చేయవలదని తల్లి, సోదరుఁడే కాక భార్యయు మోహనుని హెచ్చరించిరి. తాను భర్తయై యుండి భార్యమాటలువినుట తన పదవీ ప్రతిష్ఠకే భంగమని యతఁడు తలంచెను. కాని తక్కిన వారి మాటల నతిక్రమించు సాహసము వానికిలేదు. తానా మిత్రునిలోఁగల గుణలోపముల గుర్తించితి ననియు, అతనిని సంస్కరించుటకే తాను వాని స్నేహము చేయుచుంటిననియు మోహనుఁడు సమర్థించెను. ఈ సమర్థనము వారెవ్వరికిని సంతృప్తి కల్గింపలేదు. కాని వారు తాత్కాలికముగ మిన్నకుండిరి. ఇచట మోహనుఁడు తప్పు దారిపట్టెను. స్నేహమనునది యిరువురు వ్యక్తుల హృదయ సమ్మేళనము. అట్టి నిజమైనస్నేహము జగతిని చాల అరుదుగ కన్పించును. బాహ్యస్నేహమువలన మేలుకంటె కీడే ఎక్కువగ సంభవించును. మోహనుని విషయమున నట్లే సంభవించి నది.

ఆ దుష్టస్నేహితుఁడు వానిని మాంసము భక్షింపుమని, మద్యపానము చేయుమని మిక్కిలి ప్రోత్సహించెను. ఉపాధ్యాయులు, నితరమిత్రులు నెందఱో మాంసభక్షణముగావించు చుండ నీక తాను జంకరాదని యాతఁడు వానికి ప్రబోధము గావించెను.

సమయము లభించినపు డెల్ల, ఆ మిత్రుఁడు గాంధితో పలల భక్షణము నిట్లు సమర్థించెడివాఁడు. 'మనము మాంసమును భక్షింపకయే బలహీనమైన జాతిగానుంటిమి. ఆంగ్లేయులు పిశితాశనముచే మిక్కిలి బలవంతులై మనల నేలుచున్నారు. చూడుము! నేనెంత బలవంతుఁడనో! నేనెట్లు పరుగిడఁగలనో పరికింపుము. ఇందులకు హేతువు నేను మాంసము స్వీకరించుటయే. ఎఱచి నురగినవారి కెట్టి వ్యాధులును రా జంతను. దీని ప్రయోజనముల గ్రహించియే మన యుపాధ్యాయులు గూడ నేఁడు దీని నలవాటు చేసికొనుచున్నారు. నీవుకూడ నిఁక ప్రారంభింపుము. ప్రయత్నింపుము. అది నీ కెట్లుపయోగపడునో యనుభవ పూర్వకముగ నీవే గ్రహింపఁగలవు.'

ఈ శుభాషితములు క్రమక్రమముగ మోహనదాసునందు పరివర్తనమును గల్గించినవి. అతఁడు దుర్బలశరీరుఁడు. ఆ మిత్రుఁడో దృఢకాయుఁడు. ఆటలలో అందెవేసినచేయి. అతఁడెంతదూరమైన నలసటలేకయే పరుగిడఁగలఁడు. చాలదినములు నిరాహారియై మనఁగలఁడు. చాల ఎత్తు దుముకఁగలఁడు. పేముబెత్తము దెబ్బల నెన్నియైన శ్రమపడక భరించును. అతఁడు తనలోఁగల విద్యలన్నిటిని మోహనునియెదుట ప్రదర్శించెడివాఁడు. తమకడ లేని విద్య లొరులవద్ద చూచినపుడు

ప్రతివానికి విస్మయ విభ్రాంతులు కలుగక మానవు. తనమిత్రుని గారడులు మోహనుని మంత్రముగ్ధునిఁ గావించెను. తాను నంతటి శక్తిని సముపార్జింపవలెనను గాఢమగు కుతూహల మాతనిలో జనించెను.

మోహనదాసునకు దుర్బల శరీరమునకుఁదోడు భయము కూడ మిక్కుటముగ నుండెను. దొంగలు, దయ్యములు, పాములు వానికి మిక్కిలి భీతావహములు. చీఁకటిలో నిద్రింప లేఁడు. ఈతనికంటె ఈతనిభార్యయే ధైర్యసాహసములు గల్గి రాత్రిసమయముల భర్తకుఁ దోడ్పడెడిది. ఇది యాతనికి మిక్కిలి తలవంపులుగ నుండెడిది. ఈతనిలోఁగల యీ దుర్బలత్వమును చెలికాఁడు గుర్తించెను. అతఁడు వానికి ధైర్యసాహసములఁ గల్గింతుననియు, సజీవములగు గాలిమేపరులను చేతఁ బట్టింతుననియు, దయ్యములను దరిజేర్పనీయననియు, ఇట్టి మహత్తర శక్తులన్నియు నంజుడు మూలముననే లభించుననియు ప్రబోధించెడివాఁడు.

మోహనదాసాతని ప్రబోధమునకుఁ బరవశుఁడాయెను. మాంస భక్షణము మర్త్యుని అమర్త్యుని జేయునను విశ్వాస మతనిలోగాఢముగ నాటుకొనెను. భారతీయులందఱు మాంసము తినిన తెల్లవారిని తెల్లవారలోపల వెడలఁగొట్టనగునని కూడ మోహనుఁడు వెఱ్ఱి మొఱ్ఱిగఁ దలపోసెను.

తల్లిదండ్రులు వైష్ణవులు, పూర్వాచారపరాయణులు. వారియం దపూర్వ భక్తిప్రపత్తులు గలవాడు మోహనుఁడు. తాను మాంసము చవిచూచినట్లు వారలెఱిఁగిన వారిహృదయము లెంతగాఁ దల్లడపడునో! వారిని మోసగించుట సత్యాన్వేషకులకు కూడని పని. అయినను తాను గావించుపని వారికిఁ దెలియపఱుపకుండుట ధర్మసమ్మతమనియే అతఁడు భ్రాంతి పడెను. అప్పటికాతనికి 'స్వరాజ్య' మన నేమియో తెలియకున్నను, వ్యక్తి స్వాతంత్ర్యమును కొంచెముగ గుర్తించెను. దీనిని పురస్కరించుకొని యతఁడు తన మిత్రునితో నొక రహస్యప్రదేశమునఁ జేరి మేకమాంసము చవిచూచెను. కాని వెంటనే మోహనునకు దానియం దేవగింపు కలిగినది. తోడనే దానిని త్యజించి యతఁ డిల్లుచేరెను.

ఆరాత్రియంతయు మోహనుఁడు నిదురపోలేకపోయెను. కునుకు పట్టినదే తడవుగా జీవముగల మేక యాతని కడుపున నడయాడుచున్నట్లు బాధపడెను. అతఁడు భయముతో నులికిపడి పడకనుండి లేచెను. ఆలోచనమున నిమగ్నుఁడాయెను. కాని యతఁడంతమాత్రముననే తన సంకల్పమును త్యజింప నెంచలేదు. నంజుడు తినుట పరమ కర్తవ్యముగ భావించెను. పట్టినగ్రహమో జలను మించినది. మఱునాఁటికి మిత్రుఁడు చవులూరు పాకముల నొక భోజనశాలలో రహస్యముగ

నేర్పుకుని మోహను(డు గొంపోయి తినిపించెను. ఇట్లు సంవత్సర కాలమున మోహను(డారు పర్యాయములు మాంసము తినెను. ఇంకెక్కుడు పర్యాయములకు మిత్రునివద్ద(గాని, తనవద్ద(గాని డబ్బు లేకపోయెను. ఆ కారణమున నిరువురకు క్రమక్రమముగ నం దాసక్తి సన్నగిలెను.

౪

మోహనదాసు మాంసము భక్షించిన దినము ఇంట భోజనము చేసెడివా(డు కా(డు. ఇందులకు( దల్లి తన సహజ ప్రేమతో నాతనిని బలవంతపెట్టెడిది. ఏదియో సాకు చెప్పి యత(డు తప్పుకొనెడివా(డు కాని వాని హృదయము ప్రేమ గల తల్లిని మోసగించుచున్నందులకు మిక్కిలి యారాటపడెడిది. యథార్థము తల్లిదండ్రులు గుర్తించిన యెంతగా కృంగిపోవుదురో యని యూహించుకొల(ది మోహనుని దుఃఖము పట్టరానిదయ్యెను. మనసు మరలినది. 'దేశ క్షేమము నిమిత్తము పలలభక్షణ మావశ్యకమే యగు(గాక! తల్లి దండ్రుల మోసగింపకుండుటకు నుండ నంతకన్న అత్యావశ్యకము. ఇప్పటికే సోదరు(డొక(డామిషమును మరగి వారికి తీఱని బాధ కల్గించెను. ఇ(క నేనుగూడ నట్లయగుచో వారి దురవస్థ యేమని పేర్కొ(ననగును? కాన వారు జీవించియుండుదనుక మాంసముఖము చూడను. వారి యనంతరము బహిరంగముగ

గనే భుజించెదను' అని మోహనుఁడు నిశ్చయించుకొనెను. తన నిర్ణయమును మఱునాఁ డతఁడు తనమిత్రున కెఱిఁగించెను. తల్లి దండ్రులతో బొంకుట మహాపాపమను పవిత్రభావమే యాతనిని మాంసభక్షణము నుండి మరలించెను. ఆహా! పుత్తలీబాయి కడుపు రతనాలపంట పండినది!!

కాని యీదుష్టస్నేహితుని సహవాసబల మీయొక్క దానితోనే సమాప్తిఁ జెందలేదు. అతఁడు మోహనునకు భార్య యం దసహనభావముల రేకెత్తించెను. మిత్రుని దుర్బోధనల విని యతఁడు భార్యను మిక్కుటముగ హింసించెను. తానామె యెడఁగావించిన హింసాకాండ తన్నెవ్వరు క్షమింపరానియంతటి ఘోరాపరాధముగా తరువాత నతఁడు గుర్తించి పేర్కొనెను.

హిందూగృహస్థధర్మములను పెద్దలవలన గ్రహించిన నాఁటనుండి భార్య భర్తకు బానిస కాదనియు, అతనికి సహకారిణి సహధర్మచారిణియనియు, ఆతని సుఖదుఃఖములయందు సహ భాగినియనియు, భర్తవలె సర్వస్వతంత్రురాలనియు మోహ నుఁడు గుర్తించెను. తాను తన యర్ధాంగి యెడఁ గావించిన హింస స్మరించినపుడెల్ల అతఁడు తన యవివేకమున కెంతయో రోఁత పడెను. ఆ దుష్టస్నేహితుని మైత్రికిఁ గడుంగడు విచారపడెను.

౫

మోహనదాసు చిన్నతనమునఁ గావించిన తప్పిదము లింకను కొన్ని ముచ్చటించుకొందము. ఇచట విద్యార్థులు జాగరూకతతో మహాత్ముని జన్మరహస్యమునుగూర్చి యోచింప వలయును. సాధారణముగ ప్రపంచమున పాపసంహారణము కొఱకును, ధర్మాభ్యుత్థానము కొఱకును అవతరణకార్యము జరుగుచుండును. హేతువాదములకును, తర్కసిద్ధాంతము లకును ఆలవాలమైన ఈకాలమున జనులలో మూఢ విశ్వాసముల మూలముగా ధర్మమును స్థాపింపఁబూనుట అసం భవము; అసమంజసము. కావుననే మహాత్ముని జీవితగాథ కేవలము రామాయణాది పురాణకథలవలె మానవాతీతుల మాహాత్మ్యముల సంపుటికాక జీవితపథమున సామాన్య మానవులకును ప్రాపణీయమగు నున్నతస్థానమును సులభ తరమును జేయు సాధనమార్గముగమాత్రమే సిద్ధపరుపఁబడినది. ఆకారణముచే ఆతని బాల్యమునందలి ధర్మాతిక్రమ ఘటనా యుక్త మగు చరిత్ర నన్యథా స్వీకరింపక విద్యార్థులు సక్రమమార్గమున నన్వయించుకొని యవశ్యంభావియగు తమకర్తవ్యమును నిర్ణ యించుకొందురుగాక!

మోహనుఁడొకానొక సమయమున తనబంధు వొక నితో కలిసి పొగపీల్చవలయునని కుతూహలపడెను, ఇది సిగ

రెట్లవాసనకు భ్రమించి కాదు. కేవలము వినోదార్థమే. నోటి నుండి పొగను మొయిళ్ళవలె బయటికిఁ బంపుట వారిరువురకు వింతగాఁ దోఁచెను. వారికి సిగరెట్లు గొనుటకు చిల్లిగవ్వ లేదు. అందుచే ఎంగిలిపీఁకెల ప్రోగుచేసి వారు పీల్చ మొదలిడిరి. ఈ యెంగిలితునకలుగూడ కొన్నాళ్ళకుఁ గఱవాయెను. ఇఁక మార్గము కనిపింప లేదు. ఇరువురును దొంగతనమునకుఁ బాల్ప డిరి. తమ నౌకరుల జేబులనుండి కానులుదొంగిలించి యిరువురు కొన్నాళ్లు పొగ ద్రాగిరి. నౌకరుల జేబులలో కాను లెప్పుడు దొరకవు కదా? అప్పుడు వారు చెట్టుకాడలకు నిప్పునంటించి వానిరంధ్రముల వచ్చు పొగతో కోర్కె తీర్చుకొనిరి.

లేని బ్రతుకు వారి కసహ్యముగ తోఁచెను. ప్రతి చిన్న పనికిని పెద్దల యనుమతిఁ బడయుట వారికి తలనొప్పి కల్గించెను. బానిసలుగా జీవించుటకంటె ప్రాణపరిత్యాగమే వారికి మేలని తోఁచినది. వెంటనే వారు సమీపారణ్యమున కేఁగి గన్నేరుకాయల ప్రోగుచేసి దేవళమునకు వచ్చిరి. అచట వారు స్వామికిఁ గడసారి నమస్కరించి, కాయలలోని గింజలను తినఁ బ్రయత్నించిరి. కాని సమయమునకు ధైర్యము చాలలేదు. వారి డెందములు జంకినవి. ధైర్యము తెచ్చుకొని యిరువురును రెండుమూఁడు విత్తనములఁ దినిరి. గుండెలు చల్లఁబడెనే కాని ప్రాణముల కెట్టిముప్పును గల్గ లేదు. "ఆత్మహత్య తలపోసినంత

తేలిక గా''దని మోహనుఁడు తలంచెను. ప్రాణములమాట యటుండ, ఆ సాహస మతనిని తిరిగి పోగ త్రాగనీయలేదు సరిగదా దానిపై ఏవగింపుకూడ కల్గించెను.

మరియొక సంఘటనము. మోహనుఁడు పదిపంధ్రెండేండ్ల ప్రాయమున నింట డబ్బును దొంగిలింపసాగెను. క్రమక్రమముగ నిది తోఁటకూర దొంగతనమునుండి దొడ్డ దొంగతనము వఱకును ప్రాఁకినట్లు, అన్నగారి భుజకీర్తుల దొంగిలించు సాహసమునుగూడ కల్గించు విపరీతస్థితికిఁ గొంపోయెను. ఆపని చేసెనే కాని వాని హృదయమునఁగల దుర్భర వేదనము సమసిపోలేదు. ఈ విషయము తండ్రి కెఱింగించి క్షమాభిక్ష వేఁడవలయునని యాతఁడు నిశ్చయించుకొనెను. తండ్రితో ముఖాముఖి మాటలాడుటకుఁగూడ నిచ్చగింపక, అతఁడు తన తప్పిదముల నుల్లేఖించి, తగుశిక్ష విధింపుఁడని ప్రార్థించెను. తండ్రి అస్వస్థతచేఁ బరుండి బిడ్డ కమ్మ చూచుకొని దొన దొన బాష్పముల నురల్చెను. అయోమయస్థితిలో అతఁడు కొలఁదిసేపు లేచి కూర్చుండెను. నాతికొంతసేపు పరుండి తిరిగి తిరిగి పుత్రుని లేఖ తిలకించి నిట్టూర్పులు విడిచెను. దీనినంతయు చూచి మోహనుఁ డొకట—విస్మయసహిత విభ్రాంతుఁడై తండ్రివర్తనము నందలి యథార్థమును గ్రహించి పులకితుఁడాయెను. అప్రయత్నముగ మోహనుని కన్నులు అవిరళబాష్పధారల కురిసెను.

జనకుని బాష్పాంబుధారలు పుత్త్రుని హృదయకాలుష్య మును మార్జనమొనర్చెను. అంతియే కాక ఈ సంఘటనముచే మోహనుని హృదయరంగమునఁ దొలిసారిగా హింసావైరిను సిద్ధాంతములకు నాందీప్రస్తావనము జరిగెను. అట్టి పేరిను భావ ననుభవైక వేద్యమే కాని వర్ణింప నలవికానిది. జనకుఁడు తన్ను కోపించుననియు, దుర్భాషలాడుననియు భావించి భయ పడిన మోహనున కట్టి పురస్కారము జరిగినది!! ఈ పురస్కారమే గదా భారతీయులకు సత్యాగ్రహసమరమున క్రమశిక్షణ నీయఁ గలిగిన సామర్థ్యమును బ్రసాదించినది. అందఱి తల్లిదండ్రు లిట్టి ప్రేమస్వరూపులేయైనచో భారతదేశ భవితవ్యము నేఁడొక తీరున నుండెడిదికదా? ఆనాఁడే పశ్చాత్తాపముతో మోహనుఁ డిట్టి దొసఁగులను తన వర్తనమున పొసఁగనీయకుండుటకై దృఢ ముగ నిశ్చయించుకొనెను. ఆ నియమ మామరణ మతనిచేఁ బాలింపఁబడినది. పశ్చాత్తాపమున నిట్టిదేకదా! మోహనుని యీ యాత్మవిమర్శనము జనకుని కాతనియెడఁగల వాత్సల్యము నినుమడింపఁ జేసెను.

అట్టి వాత్సల్యరసమూర్తియగు తండ్రిని మోహనుఁడు పదునాఱేండ్ల ప్రాయమునఁ గోల్పోయెను. నాఁటనుండి యతని యగ్రజుఁడే యతని కేడుగడ యాయెను.

౬

మోహనుని జనకుఁడు రాజకోటలో నొక ప్రముఖ వ్యక్తి యని పేర్గాంచబడెను. ఆ కారణమున ఆతని చెంతకు హిందువులు, జైనులు, సిక్కులు, పారసీకులే కాక ముస్లిములుకూడ తఱచుగా నేతెంచెడివారు. జైనబుధులు కొందఱు తమ యాచారమునకు వ్యతిరేకమైనను, కాబాగాంధి యింట విందారగించెడివారు. వివిధమతానలంబులగు మిత్రులు వానితోఁ దమతమ మత విశ్వాసములఁగూర్చి ముచ్చటించుచుండెడివారు. ఈ ప్రసంగముల నన్నింటిని మోహనుఁ డాసక్తితో వినెడివాఁడు. కాఁగా చిన్న తనముననే ఆతని హృదయమున హిందూమతములోని యితర శాఖల పట్లను, ఇతర మతములయెడలను అపూర్వసహనసద్భా వములు నెలకొనెను.

ఈ సమయముననే మోహనుఁడు తనతండ్రి సముఖ మున తులసీదాసు రామాయణమును పఠించెను. భక్తిరసా మృత వాహినియగు నీ రామాయణ మాతని జీవితమునకు మెఱుఁగులు తీర్చిదిద్దెను. భాగవతమునుగూడ నాతఁ డాసమయముననే కదాచిత్తుగాఁ జదివెను.

అప్పటికి మోహనునకు భగవానునిపై పూర్ణవిశ్వాస మేర్పడినదని చెప్పఁజాలము కాని, సర్వమతములకును, సర్వ మానవజీవితసౌధములకును పునాది నైతికబలమనియు, ఆ

నైతికబలమునకు జీవము సత్యమనియు, ఆసత్యమే తన యేకైక జీవితలక్ష్యమనియు నతఁడు తెలిసికొనెను. అతఁడు తన జీవిత దృక్పథముతో సత్యనిర్వచనమునుగూడ విస్తరింపఁజేసెను.

“అపకారికి నుపకారమే ప్రతిక్రియ” అను మహోత్కృష్ట సిద్ధాంతముకూడ ఆతని కీకాలముననే గోచరించినది. మోహనదాసు భావిలోకోత్తరత్వమున కిదియునొకప్రాతిపదికము.

౨

మోహనదాసు ‘మెట్రిక్యులేషన్’ పరీక్షయం దుత్తీర్ణుఁడాయెను. కుటుంబమునందలి పెద్దలాతని నున్నత విద్యకై సమీపమునఁగల భావనగరముకళాశాలలో ప్రవేశపెట్టిరి. కళాశాలాప్రవేశము మోహనునకు నడిగంగలో మునిఁగినట్లాయెను. ఆచార్యులొసఁగెడి యుపన్యాసములు అతని కందని మ్రానిపండ్లు!! ఇఁక నిది ప్రయోజనకారి కాదని తెలిసికొని నాల్గు మాసములలోనే యాతఁడు దానికి స్వస్తిచెప్పి యిల్లుసేరెను.

ఇంతలో కుటుంబమిత్రుఁడగు ‘మావ్‌జీదేవ్’ అను బ్రాహ్మణపండితుఁడు దేవుని వలె వచ్చి మోహనదాసు నింగ్లాండుదేశమున కంపి, ‘బారిష్టరు’ కావించుట శ్రేయోదాయకమని వానితల్లికి నచ్చఁబల్కెను. ఈసలహా మోహనున కమితోత్సాహ మొసంగెను. కాని యీతలంపు అతని జన

నికి, సోదరునకు నాందోళనము కల్గించెను. ఆంగ్ల దేశమున సర్వ సాధారణముగ మద్యమాంసము లుపయోగింపఁబడు ననియు, అచటి యువకులు స్వేచ్ఛాజీవులై సంచరింతు రనియు ఆమెవిని, తల్లడ మందినది. ఆమె తన యనుమానముల నన్నిటిని అనుఁగు బిడ్డకెఱిఁగించి, 'పరిస్థితు లిట్లుండ నిన్నా దేశముల కంపుటెట్లు?' అని ప్రశ్నించెను. 'తల్లీ! నాయందు నీకు నమ్మకముచాలదా? నేను నీతో బొంకుదునా? నీవుసందేహించువాని జోలికే నేఁగను. అంతటి విపరీత విపత్కర విషయములే యటనున్న, బ్రాహ్మణోత్తములు నన్నేఁగుమందురా?' యని మోహనుఁడు నమ్మఁబల్కెను. కాని యీమాటలామెకు ఆతనియెడ విశ్వాసము కల్గింపలేదు. 'నిన్ను నీ సహజపరిసరములలోనే నమ్మఁగలను గాని, ఆ దూర దేశములలో నీమనుగడ ఎట్లుండునో ఎవరికెఱుక? నా కయోమయముగనున్నది. అయినను బెంచార్జీస్వామి నడిగి కనుగొందు'నని యామె పుత్రు నూరడించెను. బెంచార్జీ స్వామి యొక జైనముని, అతఁడు కూడ మావ్ జీ దేవునిబోలె మోహనుని కుటుంబమిత్రుఁడు. అతఁడీసమయమున మోహనున కండయై నిల్చెను. అతఁడు పుత్తలీబాయి సమక్షమున మోహనునిచే మూఁడు ప్రమాణములఁ గావింపజేసి, లండను పంపుట కనుమతి నిప్పించెను. మద్యమును, మాంసమును, మదవతిని ముట్టననుటయే ఆమూఁడు ప్రమాణములు. ఆనాఁడేమని తల్లికి

ప్రమాణముగావించెనో మోహనుఁ డతిదుష్కరపరిస్థితులందును అక్షరముల వానిని పాటించి జనని కాత్మశాంతిని గావించెను. తన కమోఘమగు ఆత్మనిగ్రహమును సమకూర్చుకొనెను. ఇట్టి నియమపాలన మిప్పట్టున మన మెందఱిలోఁ గాంచఁగలము?

రాజకోట యువకుఁ డాదినములలో ఆంగ్లదేశ మేఁగుట మిక్కిలి యబ్బురము. అందుచే ఉన్నత విద్యాలయ విద్యార్థులు, ఉపాధ్యాయులు మోహనునకు వీడ్కోలు విందు సలిపిరి. వారికిఁ గృతజ్ఞతాసూచకముగ నాతఁడు రెండుమాటలు వ్రాసికొని చదువనుంకించెనే కాని తడఁబడి, చదువకయె గద్దెదిగెను. ఆనాఁటి యీ మోహనుఁడే యేండ్లుగడచిన మీఁదట సర్వప్రపంచమును సమ్మోహపఱుచునంతటి మేటివక్తయాయెను! ఇది యట్లుండ, పూర్వాచారపరాయణులగు వైశ్యోత్తములు కొందఱు మోహనుఁడు సముద్రయానమొనర్చుట ధర్మవిరుద్ధమని వానిప్రయాణము నాఁప యత్నించి విఫలులైరి. దైవసంకల్పము నెవరు ప్రతిఘటింపఁగలరు? మోహనుఁడు న్యాయవాదియై, సర్వప్రపంచమునకు న్యాయమును బ్రసాదింపవలసి యున్నదను విషయ మానాఁటికి వారి కగమ్య గోచరము కదా!!

౨

మోహనుఁడు (1888 వ సంవత్సరము సెప్టెంబరు 4-వ తేదీన) బొంబాయిరేవునుండి ఆంగ్లదేశమునకుఁ బయనమాయెను. సముద్రయాన మతని కెట్టి ప్రత్యేకమగు నస్వస్థతను కలుగఁ జేయలేదు. పొగయోడలోని ప్రయాణికు లందఱు ముద్దులొల్క ఆంగ్లమును ముచ్చటింపఁగల నేర్పరులు. కాని మోహనున కది యలవాటు లేని పని. దానికితోడు సిగ్గరితన మొకటి యాతని వెన్నంటి యుండెను. ప్రయాణికుల సంభాషణ లాతని కగమ్యగోచరములు. ఒకవేళ అక్కడక్కడ బోధ పడినను సమాధానము చెప్పఁజాలెడివాఁడు కాఁడు. సమాధాన మవసరమైనచో, మనమున వాక్యములఁగూర్చుకొని, సరిచూచి మాటాడెడివాఁడు మోహనుఁడు. ఇది యట్లుండఁగా నోడలో లభించు ఆహార పదార్థముల స్వరూపము అతనికి తెలియదు. కాన నతఁడు వాని నంటుకొనక పాథోధియానమును తాను తెచ్చుకొనిన పాథేయముతోడనే నడపెను. ఎవరితోనైన ముచ్చటింపవలసివచ్చునను భయముతో మోహనుఁడు తన కొసంగఁబడిన గదిని, కారాగారనివాసియట్లు వీడివచ్చెడివాఁడు కాఁడు. ఇంతటి లజ్జాశీలుఁడే కడకు భారతస్వాతంత్ర్యసమర సంరంభమున నెంత నిర్భీకుఁడుగా వ్యవహరించెనో కాల మెఱుఁగును; సమస్తధారుణీతల మెఱుంగును.

ఇంతలో నొక యాంగ్లప్రయాణికుఁడు మోహనుని వాత్సల్యముతోఁ జేరి వాని యోగక్షేమముల నారసి, మాంస భక్షణకు ప్రేరించెను. కాని మోహనుఁ డేమాత్రము చలింపక మాంసభక్షణమే తప్పనిసరియైన ఆంగ్లదేశమున క్షణముకూడ నాఁగక వచ్చిన తెన్ను పట్టెదనని పేర్కొనెను. అలఁతిప్రమాఁకులే ప్రళయ మారుతమునకు చలింపవు కదా!

క్రమ క్రమమున ఓడ "సౌతాంప్టన్" రేవుచేరెను. ఓడ దిగుసమయమున కనుకూలమైన నల్లని సూటు, తెల్లని యున్ని మఫ్లరు ధరించి, మోహనుఁడు మోహనాకారమున ఓడ దిగెను. నలుగురు మిత్రులకుఁ బరిచయలేఖ లాతని వద్దఁ గలవు. డాక్టరు మెహతా యందొకఁడు. మోహనుఁడు నెచ్చెలి యగు మజుందారుతో సమీపమునఁగల విక్టోరియా వసతిగృహము ప్రవేశించి, మెహతాకుఁ దన్ను కలిసికొనవలసి నదిగాఁ దంతినంపెను. ఆతఁడు సాయంకాలమే తెంచి, మోహనునకు రుచిరాగతమొసఁగెను. అంత నిరువురు సంభాషించుకొనుచుండ, మోహనుఁడు మెహతా యున్నిటోపిని స్పృశించెను. ఇది యాంగ్లసభ్యతకు విరుద్ధము. వెంటనే మెహతా యొకింత కోపముచూపి, "ఎవరి వస్తువులను ముట్టకుము. మన దేశము నందువలె, నిచట, నేరిని, తగు పరిచయము కల్గునఱకు ప్రశ్నింపకుము. బిగ్గరగా మాటాడకుము. ఎవరిని 'అయ్యా!'

యని సంబోధింపకుము. ఇది బానిసతనమును సూచించును.'' అని మోహనునకుఁ బాశ్చాత్య సభ్యతయందు దోసమూల దిద్దించెను. ప్రపంచమునకే సభ్యతఁ గఱపవలసిన మోహనుఁ డానాఁడు పాశ్చాత్య సభ్యతలోని తొలిపాఠమును బఠించెను. ఇం దాశ్చర్య మేమున్నది? ఆనాఁడు గౌతముఁడు తన రథచోదకునికడ ప్రపంచ విజ్ఞానము నార్జింపలేదా? ''వసతిగృహములఁ జేరుటకంటె ప్రత్యేకసంసారమున సభ్యుఁడుగా నుండుట సర్వవిధముల మంచి''దని మెహతా మోహనునకు సలహాచెప్పెను. కానిమోహనుఁడీ సలహాతోఁ గొంతకాలము వఱకే కీభవింపఁజాలఁడాయెను.

మున్ముందు మోహనుఁడు తన మిత్రుఁడు ముజుందారుతో హోటలులోఁ బ్రవేశించెను. హోటలు భోజనమాతనికి రుచింపకున్నను, హోటలువానికి మూఁడుపౌను లచ్చుకొనవలసి వచ్చునేయని మోహనుఁడు విచారపడెడివాఁడు. తనకు వారిచ్చు పదార్థము రుచింపకున్నను, వేఱొకదానినిఁ గోరినచో రెండింటికిఁగూడ డబ్బు చెల్లింపవలసివచ్చుట ఆతనికి మఱింత బాధాకరమాయెను. అయినను తప్పినదికాదు!!

ఇంతకు ముందెన్నఁడు మోహనుఁడిల్లు విడిచి, హెచ్చుకాలము మసలి యెఱుఁగఁడు. అందును మాతృభూమితో నెట్టి సామ్యమును లేని సీమనుండుట కాతఁడు మిక్కిలి దిగులు

పడెను. జననీ జన్మభూములాతని మనోనేత్రముల పరిభ్రమింపఁ జేయఁజొచ్చెను. ప్రేమాస్పదయగుజననీ ప్రేమ ఆతనిని వెన్నంటియే యుండెను. అమ్మను సంస్మరించుచుఁ గన్నీరు కాల్వలుగట్టి నేడ్చెడివాఁడు. కాని తన పరితాపము నన్యుల కెఱిఁగింపలేదు. ఎఱిఁగించి యేమిప్రయోజనము? తానేతెంచినయా దేశప్రజలు, వారి యాచార సంప్రదాయములు తనకు విభిన్నములు; విలక్షణములు. దానికిఁ దోడు నిష్ఠురమగు శాకాహార వ్రతము!!! ఏమిచేయుట? వెనుక నుయ్యి! ముందుగొయ్యి!!!

"ఇంతదూరము వ్యయ ప్రయాసల కోర్చివచ్చితిని. వచ్చినపని పూర్తిగావింపనిది యింటికి వెడలుట పురుషలక్షణము కాదు" అని మోహనుఁడు నిశ్చయించుకొనెను. దృఢనిశ్చయ మెట్టి విజయమునైన సమకూర్చును. మానవుఁడు మహాత్ముఁడు కావలయునన్న నిట్టి యచంచలత సాధింపవలయును.

౯

కతిపయిదినములకు డాక్టరు మెహతా విక్టోరియా హోటలునందున్న మోహనునిఁజూడ నేతెంచెను. అతఁడుండు గదిని పరీక్షించి, యసంతృప్తితో, "ఇది సరియగుపద్ధతి కాదు. గ్రంథముల నంటిపెట్టుకొనుటకే మన మాంగ్లదేశమునకు రాలేదు. ఈ దేశప్రజల జీవితవిధానములను, ఆచారసంప్రదాయములను అనుభవపూర్వకముగ గ్రహింపవలయును.

అందులకై యెచటనో హోటలులో బసచేసి ప్రయోజనములేదు. ఒక కుటుంబసభ్యుఁడుగా ప్రవేశింపుము. అది నీకు సర్వప్రయోజనముల సమకూర్చును.'' అని యతఁడు తిరిగి సలహా నొసఁగెను.

ఈ సలహా మోహనున కానాఁటికి నచ్చినది. దాని నతఁడు కృతజ్ఞతతో స్వీకరించెను. వెంటనే యతఁడు తన బస నొక కుటుంబమునకు మార్చెను. ఏది యెట్లున్నను, మోహనుని యాహారసమస్య యపరిష్కృతముగనే యుండెను. అచటి గృహిణి యాతనికి సరిపడు భోజన మెట్టిదో తెలియకచిక్కుపడు చుండెడిది. ఉదయమున ఓటు జావమాత్రము మోహనుఁడు త్రాగెడివాఁడు. కాని మధ్యాహ్నమునను, రాత్రులయందును నించుమించుగా నిరాహారియే.

కుటుంబ యజమానుఁడు రేయింబవళ్లు మోహనునితో ఆమిషాహారమునుగూర్చి తీవ్రచర్చలు గావించెడివాఁడు. మోహనుఁ డాతని సంవాదమునకు విసిగి వేసారి, ''ఆర్యా! నన్ను క్షమింపుఁడు. పలలము తినుట ఈ దేశీయులకు సర్వ శ్రేయోదాయకమే యగుఁగాక! అది మాయాచారమునకు విరుద్ధము. నేను నాజననికిఁ గావించిన ప్రమాణమును తృణీకరింపఁ జాలను. నన్నొక తలబిరుసువానిగనే తలంపుఁడు. ఇఁక నాతో నా విషయమునుగూర్చి చర్చింపకుఁడు. మీకు నాయెడఁగల

యవ్యాజాను రాగమునకు కృతజ్ఞుఁడను." అని ఆ ప్రస్తాపనము నంతటితో సమయించెను. ఈ నిష్కల్మష వచస్సరణి గృహమేధిని నిర్విణ్ణుని చేసెను. ఆతఁ డావిషయము నిఁక మోహనునితో ముచ్చునకైన ముచ్చటింప సాహసింపలేదు. సంఘప్రాబల్యము మానవుని, కష్టమో, నిష్ఠురమో, యతనిదారి నతనిని నడువ నీయదు; ఎక్కడికక్కడ నడ్డుతగులుచుండును. కాని ప్రాజ్ఞులు దానినిఁ గడచి తమ సుస్థిర కర్తవ్యపథమును విడనాడక చరింతురు.

ఆహారవిషయముతక్క శేషాంశములయం దాంగ్లేయుల ననుకరింపవలయుననియే మోహనుని తలంపు. పాశ్చాత్యపద్ధతులలో దుస్తులను కుట్టించెను. బంగారపుగొలుసు గల చేతి గడియారము నలంకరించుకొనెను. మెడలను బిగించెను. కురులను సింగారించెను. దుస్తుల కనుకూలమగు టోపీల ధరించెను. కాని మోహనుని యంతస్సత్త్వముమాత్రి మితరులకు టోపీలఁబెట్టు బ్రిటిషు సభ్యతకు లోఁబడలేదు. వేషానుకృతితో మాత్రమే అఁతడుసంతృప్తుఁడుకాక, యూరపుఖండము నంతను పర్యటింపవలయునను నపేక్షతో ఫ్రెంచిభాష నభ్యసించెను. వక్తృత్వకళ నుపాసించెను. ప్రత్యేకముగ నృత్యము గఱపు తరగతులకు హాజరాయెను. కాని లయగా అడుగువేయు టాతనిచేత కాలేదు. పియానో, వాయులీనములఁ

గూడ మోహనుఁ డలవఱచుకొన నెంచెను. కాని యవి యాతని సొత్తులు కాక పోయెను. మానవహృదయతంత్రులను మేళవించు మహత్తరశక్తి నార్జింపవలసిన మోహనునకు నిర్జీవములగు తంత్రులను మేళవించు టెట్లు సాధ్యపడును?

ఇట్లుండ నకస్మాత్తుగా మోహనుని మనసు మాఱెను. "ఆంగ్ల దేశమున నేను శాశ్వతముగ నుండఁబోవుట లేదు. ఈ నృత్యగానములవలన నాకుఁగల్గు లాభ మేమి? ఇవి పెద్దలలోఁ దిరుగువాని కుండఁదగు లక్షణములు కావు. నేను విద్యార్థిని. విద్య నభ్యసించుటయే నా లక్ష్యము. న్యాయవాది కనువగు లక్షణములనే నే నిప్పు డలవఱచుకొనవలయును." అని మోహనుఁడు తలపోసెను. నాఁటనుండి సత్యదూరమగు నాదర్శములకు మోహనుఁడు స్వస్తిపల్కి, నిజమగువిద్యార్థిగా ముందంజ వేసెను.

౧౦

తా నా దేశమున చేయువ్యయములన్నింటికి మోహనుఁడు లెక్క వ్రాసెడివాఁడు. ఇట్లు లెక్కవ్రాయుట పరిపాటియగు కొలఁది తన వ్యయమునఁగల దుబారాను తొలఁగించుటకు శక్తుఁడు కాఁగల్గెను. అందులకై యాతఁ డొకరింట అతిథిగ నుంట మాని స్వతంత్రముగనుండుట కుద్యమించెను. తన కే

ప్రాంతమున పనిగలదో అచట నొకగది తీసికొని స్వయం పచనము మొదలిడెను. ఇందువలన ఆతనికి రెండుప్రయోజనములు చేకూరినవి. ఒకటి మితవ్యయము, రెండు లండను నగరమున బహు ప్రాంతీయుల నాగరకతా విశేషములను, ఆచార వ్యవహారములను గ్రహింపఁ గల్గుట. ఈ మితవ్యయమే సాధారణ కుటుంబీకుఁడగు మోహనునకుఁ బీడిత భారతప్రజానీకమునకు స్వాతంత్ర్యసమరమునకు సజ్జిత మొనర్చుటలోఁ గీలకము నా[illegible]గించెను.

ఇఁక విద్యావిషయము. 'లా' పరీక్షకై మోహనుఁడు అట్టె పాటుపడు నవసరము లేదు. కాని యాంగ్లమునఁ దగు పునాది లే దాతనికి. దానిని గట్టిపఱుపవలయును. 'లా' బిరుదముతో భాషలోఁగూడ పట్టుమునహింపవలెనను నాస అతనిలో సంకురించినది. ఇందులకు వలసిన వివరములను ఆతఁడు మిత్రుల మూలమున సేకరించెను. దానిని సాధింపవలెనన్న ధనము వ్యయమగును. కాని సూక్ష్మములో మోక్షము కల్గించునది 'మెట్రిక్యులేషను పరీక్ష' దీనికి లాటిను భాషాజ్ఞానమత్యవసరము. ఈ జ్ఞానము 'లా' పరీక్షకుఁగూడ మిక్కిలి యుపయోగము. ఈ కారణమున లాటిను నేర్చుటలో మోహనుని యాసక్తి ద్విగుణీకృత మాయెను. మెట్రిక్యులేషను పరీక్షకైదుమాసముల వ్యవధిమాత్రము కలదు. అంతట ఒక్క నిమిషము కూడ

౧.

వృథా సేయక అతఁడు శ్రమచేసి పరీక్షకు హాజరాయెను. కాని లాటినులో అతఁ డుత్తీర్ణుఁడు కాలేకపోయెను. మోహనుఁ డొక్క క్షణము విచారించెను, కాని యధైర్యపడలేదు. అపజయము భావి విజయమునకు రాచబాట! అపజయము కల్గినను లాటినులో మోహనునకు మంచి యభినివేశము కల్గినది. మఱి యొకమాఱు పరీక్షకుఁ గూర్చుండి అతఁడు విజయము సాధించెను.

మోహనుఁడు తన ప్రకృతజీవితవిధానముతో తృప్తిఁ జెందలేదు. ఇంటివద్ద సోదరుఁడు కడగండ్లకోర్చి, కోరినంతసొమ్ము తనకుఁ గొఱఁత కల్గకుండునట్లు పంపుచుండెనను విషయము స్మరించినపుడు తనవ్యయమునుగూర్చి మఱింత జాగ్రత్తవహింప నాతఁడు నిశ్చయించుకొనెను. కడు నిరాడంబరజీవితము గడపఁ దలపోసెను. తనకన్న బీదవిద్యార్థులు కనీసపు వ్యయముతో విద్య నభ్యసించు టాతనికి మార్గదర్శక మాయెను. పూర్వము వలె రెండు గదుల నద్దెకుఁగొనుట మాని యొక్కదానితో సరిపెట్టుకొనెను. 'స్టవు'తో నుదయపు భోజనము తయారుచేసి కొని మధ్యాహ్నభోజనము 'హోటలు'లోఁ జేసెడివాఁడు. సాయంకాలము పండ్లు రొట్టె మాత్రమే పుచ్చుకొనెడివాఁడు. ఈతీరున మోహనుఁడు దినమునకుఁ గనీసపుఖర్చుగ నొకషిల్లింగు రెండు పెన్నీలతోనే గడపుకొనఁగల్గెను. ఈకనీసపు వ్యయము వలన మోహనుఁ డతి నిరాడంబరజీవనము నలవఱుచుకొని

యమందానంద మనుభవించెను. ఆతని యీ నిరాడంబర
జీవనమే భోగలాలసులగు నీనాఁటి విద్యార్థుల కొజ్జబంతి
యగుచో భారత ప్రజాజీవితము సర్వసంపన్నమై యుండును
గదా!

నిష్ఠురమైనను, మోహనుఁడు, నీరసమగుజీవనము నెన్నఁడు
గడపి యెఱుఁగడు. బహుగ్రంథపఠనము తోడను, బహువిధ
కార్యకలాపములతోడను ఆతనిజీవితము లక్ష్యముతప్పక రస
మయమై యలరారినది.

౧౧

జీవన విధానమున వచ్చిన మార్పుల ఫలితముగ
మోహనుఁడు తన యాహారమునఁగూడ క్రమపరిణామములఁ
దెచ్చెను. శాకాహారతత్త్వమును గూర్చి యాతఁడు పెక్కు
గ్రంథములఁ బఠించెను. ఇంగ్లాండులోఁ గల శాకాహారసంఘ
మున సభ్యుఁడై, ఆ సంఘపత్రికకు వ్యాసములఁ గూడనంపు
చుండెను. మోహనుని లేఖనమునఁగల లాలిత్యము అప్పటికే
లోకమునకుఁ గొంత విశదమైనది. అది రాను రాను మఱింత
నిగ్గుతేరి, యాంగ్ల భాషను 'శ్రీ ఋషి ప్రోక్తము' గావించినది.
సుకుమారములు, సునిశితములైనభావములనూటిగను, సుందర
ముగను వ్రాయు టాతనిసొత్తు. త్వరలోనే యాతఁడు శాకాహార

కార్యనిర్వాహక సంఘమున సభ్యత్వమును బడసెను. రాను రాను మిఠాయిలను, కాఫీ, టీ లనుగూడ నాతఁడు విసర్జించి, రొట్టె, కోకో, ఉడికిన (దుంప) కూరలనుమాత్రము తినుచుండెను. ఈ యనుభవములవలన ఆతఁడు రుచి యనునది నాలుకలో లేక, మనసులోనే కలదని తెలిసికొనెను.

ఈకాలముననే యతనికి పెక్కు మతముల పరిచయమేర్పడెను. 'ఎడ్విన్‌ఆర్నాల్డు' అనువదించిన భగవద్గీతానువాదమును బ్రప్రథమమునఁ జదివెను. స్వీయమత గ్రంథమును మూలముననుగాక విదేశీయ భాషానువాదమున పఠింపవలసినందులకు మున్ముందు సిగ్గుచెందెను. కాని విషయ మేభాషయందున్నను, దాని యాచరణముకదా ప్రధానమని యాతఁడొకింత తృప్తిఁజెందెను గీతలోని రెండవ యధ్యాయమునందలి యింద్రియ నిగ్రహమును గూర్చిన ప్రశంస యాతనిహృదయమున గాఢముగ హత్తుకొనెను. హత్తుకొనుటయేకాదు, ఆతని యెదలో ఆజీవితము ప్రతిధ్వను లీనెను.

నాఁటినుండి మోహనునకు భగవద్గీత యొకయమూల్య గ్రంథమై, కడ కాతని జీవితమునకు చుక్కానియై వెలసెను. అందలి స్థితప్రజ్ఞత్వ మాతనిలో మూర్తీభవించెను. అందలి యనాసక్తియోగమే యాతనిజీవితయోగము. వేయేల!! అతఁడే గీత. గీతయే యాతఁడు.

ఒక్క భగవద్గీతతోడనే మోహనుఁడు సంతృప్తుఁడు గాక క్రైస్తవ మతగ్రంథమగు 'బైబిలు' నాసక్తితోఁ బఠించెను. 'ఒక చెంపఁగొట్టిన, వేఱొక చెంపను జూపు'మని పర్వతాగ్రమునుండి చేయఁబడిన యుద్బోధ ఆతనికి ధ్రువతారయైనది. మోహనుని యాసక్తి తెలిసికొని, కొందఱు క్రైస్తవమత ప్రచారకులు ఆతనిని తమమతమునఁ గలుపుకొన యత్నించి విఫలమనోరథులైరి. నిజమైనహిందూమతోద్ధారకుఁడై హిందూ మతమందలి కలుషమును బోఁదోలఁగలిగిన మహాసామర్థ్యము గల వ్యక్తిగా నటింపవలసిన గాంధి జీవితమున ప్రథమముననే హిందూమతబీజము లింత దృఢముగ నాఁటుకొనుట హైందవుల యదృష్టము, భాగ్యము కాక మఱేమి?

ఇంతియేగాక గాంధి శీలమునకు గీటురాయి అనఁదగు వేఱొక ముఖ్యఘట్టమునుగూర్చి ముచ్చటింపక యీ యూరపు యాత్రను ముగింపరాదు. పాశ్చాత్యులు బాహిరమగు శరీర సంతృప్తినే ప్రధానముగాఁగొని తమ నిత్యనైమిత్తిక కార్యకలాపముల దానిచుట్టు నల్లుకొందురు. వారికి శీలమును ఎప్పుడును పరిశుద్ధముగను, పవిత్రముగను కాపాడుకొనవలెనను ప్రత్యేక సాంఘికనియమములున్నట్లు కనఁబడదు. ఈదృష్టిని వారు త మ్మనుగమించు నితరదేశీయుల మతాభిప్రాయముల సహి

తము లెక్కగొనక భ్రమరకీటకన్యాయమున వారినిఁగూడ తమ పథమునకు త్రిప్పుకొనుట కేమాత్రము జంకరు.

గాంధి యూరపునందుండఁగా ఇట్టి పాశ్చాత్యసభ్యతకు లోఁబడినవాఁడై యొకానొక నృత్యప్రసక్తిని దవిలి స్త్రీవ్యామోహితుఁడై పతనోన్ముఖుఁ డాయెను. కాని విధివిలాసమెట్టిదో ఎవరికెఱుక? భగవద్గీతాపాఠకుఁడై భారతీయుల యాధ్యాత్మికాభ్యున్నతికి గురుదేవుఁడుగా వర్తింపవలసిన మహాత్ముని భగవానుఁ డిట్టి పాపపంకమున మునుంగ నిచ్చునా? ఆకాంతాకర్షణమున తన శీలసౌభాగ్యమును పూర్తిగాఁ గోల్పోవలసిన సందర్భమున మోహనుని నెక్కడలేని పిఱికితనము, సిగ్గు, భయమును నొక్కుమ్మడిగా నావరించి, యంతర్వాణి యాతనిని 'పాఱిపో!! పాఱిపో!!!' యని ప్రేరించెను. ఇంక నా యంగన సంగాతమున నొక్క నిమేషమును నిలువలేక గాంధి పలాయన సూత్రము పఠించి, తన శీలసంపదను సంరక్షించుకొనెను. సద్విధిచోదితునకుఁ బతనముండునా??

మోహనుఁడే కార్యకలాపములయందు పాల్గొనినను, వచ్చిన పని విస్మరింపలేదు. తొమ్మిది మాసముల నిరంతరకృషి ఫలితముగా నతఁడు 'బారిష్టర్' ఆయెను. (జూన్ 12-వ తేది 1891-వ సంవత్సరము). నాలుగేండ్ల యనంతర మతఁడు మాతృదేశమునకుఁ బ్రయాణమాయెను. తనవారినిఁ జూచు నాకాంక్ష అతని

కంటె ముందుగనే బయలుదేరినదని చెప్పనేల? గాంధి యానంద మునకు మేరలేదు. కాని యది కలకాల ముండలేదు. కారణము మాతృభూమిని మాతృదేవి యదృశ్యయగుటయే!!

మాతృదేశమున కాలిడఁగనే తన యగ్రజునివలన గాంధి మాతృశ్రీ విషాదమరణవార్త విని నిలువున నీరాయెను. అతఁడు సీమలో నుండఁగనే యా సాధ్వీమణి పరమపదించినది. కాని తన సహోదరుఁ డీవిషాదవార్త విని విచారసముద్రమున మునిఁగి విద్యావ్యాసంగముల కెట్టి విపత్తు తెచ్చుకొనునోయని భయపడి యగ్రజుఁడు దానిని తెలియఁబఱుపలేదు. ఆ నాఁడు ప్రయాణవేళ జైనఋషి సమ్ముఖమునఁ గావించిన ప్రమాణ ముల నక్షరములఁ బాటించి, తన శీలసౌభాగ్యమును సురక్షితముగఁ గాపాడుకొని, విజయలక్ష్మీసమేతుఁడై వేంచేయు పుత్రుని పరిష్వంగము గావించుకొను మహాభాగ్యమునకు దూరమైతివా తల్లీ!! అయిన నేమి! నీ చల్లని యాశీఃప్రచయము నందుకొని మోహనుఁడు మహాత్ముఁడై, భారత భాగ్యవిధాతయై కడకు యుగపురుషుఁడుకూడ కాఁగలఁడు లెమ్ము!!!

విశాల ప్రపంచమున నిరాధారుఁడైనట్లు గాంధి మున్నీటి యలలవలె ముందు కుఱుకు కన్నీటి నదిమికొని, క్రుంగిపోయిన గుండియలతోఁ గొంపఁ జేరెను. కాని యాతనికష్టము లంతట పోలేదు. అవి యొంటరిగా రాక, యొండొంటిని పెనవేసికొని

మానవునిఁ జెందాదును. ఇంత తెక్కలాడినఁ గాని డొక్క లాడవు. సోదరుఁ డెంతకాల మెటునుండి డబ్బు త్రిప్పఁగొని రాఁగలఁడు? తండ్రి మిగిల్చిన యాస్తియా బండిసున్న. అట్లు మిగిల్చిన తన కొమరులు నిష్ప్రయోజకు లగుదురని యంతని యాశయము. కాన వెంటనే గాంధి రాజకోటలో వృత్తి నవలంబింపక తప్పినది కాదు. గోడకు చెక్క వ్రేలాడుచుండెనే గాని, ఇంట పోకచెక్కకుఁగూడ తావులేదు. చదివిన శాస్త్రమునకు, నిత్యకృత్యమున కావలసిన యనుభవమునకు హస్తిమశకాంతరము కలదు. ఇంతలోఁ గొందఱు మిత్రు లాతనిని బొంబాయి యున్నత న్యాయస్థానమునకు రావలసినదిగా ప్రోత్సహించిరి. వారి యుత్సాహము నూఁతగాఁగొని అతఁ డట్లే బొంబాయిచేరెను. చిల్లిగవ్వ సంపాదించుటాతని కిసుకనుండి తైలము తీసినట్లాయెను. గాంధి తిరిగి రాజకోటఁ జేరెను. కాని యీ కడగండ్లు కలకాలము లేవు. చిన్న చిన్న న్యాయస్థానముల రాణింపకున్న నేమి? అతఁ డనతికాలముననే సమస్త భారతమునకును, కాదు కాదు, సర్వ పీడిత ప్రజాహితైక న్యాయవాది కాఁబోవు తరుణ మాసన్నమైనది!!

---

## ఆఫ్రికాపయనము - నైతిక విజయము

దాదా అబ్దుల్లా కంపెనీలోని యొక భాగస్వామి గాంధిని ఒక వ్యాజ్యము నడుపుటకై దక్షిణాఫ్రికాకుఁ బోవలసినదిగాఁ

గోరెను. ఆ కంపెనీవారు ఆతనికగు ఖర్చులు భరించి 105 పౌనుల రొక్కముకుండ నిత్తురు. ఒక సంవత్సర మతం డచ్చోట నుండవలయును. గాంధి యందుల కంగీకరించి ఆఫ్రికాకుం బయనమాయెను.

ఆఫ్రికాలోని నేటాల్ దేశపు రేవు పట్నమగు 'డర్బన్' వద్ద గాంధి యోడదిగెను. కంపెనీ యజమానుండగు అబ్దుల్లా సేటు అతనికి స్వాగత మొసంగెను. రేవులో ప్రవేశించిన దే తడవుగా గాంధి తెల్లజాతులు భారతీయులను అతినీచముగాం జూచుచున్నారని తెలిసికొనెను. సేటుననుచరులు అతనియెడ నుంచి గౌరవమర్యాదలు ప్రదర్శించిరి. అతండు ధరించిన కోటు, తలగుడ్డ యితర భారతీయులనుండి విలక్షితు నొనర్చె నవి. అతనికి ప్రత్యేకవసతి యేర్పఱుపంబడెను. అబ్దుల్లా గాంధు లొండొరులు అపరిచితులు. ఆతనిద్వారా పంపంబడిన వ్యాజ్యము సంబంధమగు కాగితములు అబ్దుల్లా పర్యాలోకనము గావించి బేజారుపడెను. గాంధి రాక వ్యర్థమని యాతండు తల పోసెను. వ్యాజ్యము ట్రాన్స్వాలులో జరుగుచున్నది. ఇంకను అది పాకమునకు రాలేదు. వచ్చినను గాంధి సమర్థత యెట్టిదో ఆతనికిం దెలియదు. తెలిసినను ఆతని నెట్లు వినియోగించుకొన వలెనో అగమ్యముగనున్నది. అబ్దుల్లా నిరక్షరాస్యుండైనను, మిక్కిలి యనుభవజ్ఞానము కలవాండు. సునిశితుండైన మేధావి.

ఆంగ్లమున చతురతతో సంభాషింపఁగలఁడు. ఆఫ్రికా-భారతీయుల కాతనియెడ మిక్కిలిగౌరవప్రపత్తులు కలవు. ఆఫ్రికా కంతటికి ఆతని కర్మాగారము కడు పెద్దది.

రెండుమూఁడుదినములు కడచినపిమ్మట అబ్దుల్లా గాంధిని డర్బను కచేరీనిఁ జూపుటకుఁ గొంపోయెను. అచటి పెద్దలకందఱకు నాతఁడు గాంధిని బరిచయముగావించి, తనప్రక్కనే కూర్చుండఁబెట్టుకొనెను. అంతలోన్యాయాధికారి ప్రవేశించెను. అతఁడు గాంధిని వింతగా ఆపాదమస్తకము చూచి తలగుడ్డ తీయవలసినదిగా కబురంపెను. ఆత్మగౌరవాభిమానియగు గాంధి యిందులకిష్టపడునా? వెంటనే అతఁడు కచేరీవదలివచ్చెను. ప్రారంభమైనది.ఆఫ్రికాలో గాంధికావింపనున్న నైతికసంగ్రామమునకు నాందీప్రస్తావనము. ఈ విషయమై గాంధి వెంటనే పత్రికలకు వ్రాసెను. దీనిపై తర్జనభర్జనలు జరిగినవి. కొన్ని పత్రికలు గాంధిని 'పిలువనిపెద్ద'గా వెక్కిరించినవి. కొన్ని యిట్టి నిరసనము సహింపరాదని విమర్శించినవి.ఏదియెట్లున్నను గాంధి పేరు క్షణకాలములో బాగుగ ప్రచారమాయెను.

తరువాత గాంధి ప్రిటోరియా వెళ్ళవలసి వచ్చినది. మొదటి తరగతిలో ఆతనికి స్థలము ప్రత్యేకింపఁబడెను. రైలు డర్బనునుండి నేటాలు ముఖ్యపట్టణమగు 'మారిట్జిబర్గ'ను రాత్రి 9 గంటలకుఁ జేరెను. అంతలో నొక ప్రయాణికుఁడు గాంధిని

ఎగాదిగఁ జూచి పోయి, రైలు అధికారులను వెంటఁబెట్టుకొని వచ్చెను. అందొక యధికారి గాంధితో ధీమాగా నిట్లనెను. “లెమ్ము! నీవు సాధారణ తరగతికి వెడలిపొమ్ము!”

గాంధి:-నాకు మొదటితరగతి టిక్కెట్టుకలదు.

అధికారి:-ఉండుఁగాక! నీవిందు పయనింప వీలుపడదు. లేచి పొమ్ము.

గాంధి:-నేనిందు ప్రయాణము చేయుటకు డర్బనులో అనుమతింపఁబడితిని. ఇప్పుడేల తగను? నేనిందే ప్రిటోరియా చేరవలెను.

అధికారి:-వీలులేదు. మర్యాదగా లెమ్ము. లేదేని పోలీసులఁ బిల్పించి ఆవలకు గెంటింతును.

గాంధి:-అట్లే కానిండు. నాయంతట నేను లేవను.

సంభాషణము ముగిసినది. పోలీసులువచ్చి గాంధి నావలకు గెంటిరి. సామానులు క్రిందకుఁబడఁద్రోసిరి. అంతలో రైలు కదలినది. గాంధి చేతిసంచిమాత్రము గొని విశ్రాంతి భవనమునకు వెడలెను. సామాను లచ్చోటనే పడియున్నవి. అధికారులు వానిని స్వాధీనపఱుచుకొనిరి.

అది శీతకాలము. చలి మిక్కుటముగ నుండెను. తన పెట్టెలోఁగల యున్నికోటునుగూడ అధికారమదాంధుల నడుగు

టకు గాంధి ఇచ్ఛగింపలేదు. అల్లే చలిచే వణఁకుచు, అంధ కార బంధురమగు నా నడిరాతిరి కర్తవ్యమునుగూర్చి గాంధి తలపోసెను. 'హక్కులకై పోరాడుటయా? లేక యవమానమును దిగమ్రింగుకొని ప్రిటోరియాచేరి పనిపూర్తిచేసికొనుటయా? పరాభవముతో మాతృదేశమేఁగుట యుద్ధరంగమున వెన్ని చ్చుట వంటిది. నేనీనాఁడు గుఱియైనయవమానము జాత్యహం కారులు సోదర మానవాళియెడఁ బ్రదర్శించుచున్న తీవ్ర నిరసన మునకు తార్కాణము. ఇది వ్యక్తిగత సమస్య కాదు; జాతీయ సమస్య. ఎన్ని యిక్కట్లనైన నెదుర్కొని దీనిని బరిష్కరింప వలయున'ని యా నిశీథసమయమున గాంధి సంకల్పించుకొనెను. స్వార్జ్యము వ్యాజమున వచ్చిన గాంధి నైతిక కురుక్షేత్రమున క్షుద్రమగు హృదయదౌర్బల్యమును బోనాడి, దేవదత్తమును బూరించిన పార్థునివలె నిలువఁబడియెను.

మఱునాఁడుదయమున నే గాంధి రైల్వేయున్నతోద్యో గికిఁ దనవృత్తాంతమును తంతిద్వారా ఎఱిఁగించెను. వెంటనే వచ్చిన సమాధానము 'నాయుద్యోగుల చర్య సమంజసము!' ''పంది బురదమెచ్చు పన్నీరు మెచ్చునా?'' మారిట్జిబర్గులోని భారతీయులు గాంధి నాదరించుట కేతెంచిరి. వారు తైనంది నము తామనుభవించు పరాభవముల పూసగ్రుచ్చినట్లు ఆతనికిఁ దెల్పిరి. రగులుకొనుచున్న యగ్నికి ఆజ్యముపోయుట!! గాంధి

మఱింత సంకటపడెను. కాని చేయునదిలేదు. అంతలో సాయం కాలమైనది. గాంధి కల్లోలితమనస్కుఁడై, డర్బనులో కొనని పడక టిక్కెట్టు నానాఁడుకొని ప్రిటోరియాచేరెను.

౨

ఏవ్యాజ్యము నిమిత్తమై గాంధి యాఫ్రికా కరుదెంచెనో యది సంతృప్తికరముగ నచిరకాలముననే పరిష్కారమైనది. ఇఁక మిగిలినది పెద్దవ్యాజ్యము. డర్బనులో అబ్దుల్లా కంపెనీ వారు గాంధికి ఘనమగు వీడ్కోలొసగిరి. కాని యావీడ్కోలు సభ నూతనోద్యమమునకుఁ బ్రారంభోత్సవమాయెను. నేటాలు ప్రభుత్వరథచోదకులగు రంగుజాతులవారు ఇతరజాతుల స్వత్వములను, హక్కులను గుఱితింపక పోవుటయే కాక వారిని సర్వవిధముల అణఁగఁద్రొక్కి, బానిసలుగా జేసి, వారి రక్త మాంసములపై తమసౌభాగ్యసౌధముల నిర్మింపఁదలఁచిరి. అట్టి సందర్భమున వారు తొలిసారిగా నేటాలు భారతీయ పౌరుల 'ఓటుహక్కు, తొలఁగించుట కుపక్రమించి తత్సంబంధమగు బిల్లును' శాసనసభలో ప్రవేశపెట్టుదురని, దీనితో తాము నోరులేని మూఁగజీవుల మగుచున్నామని అచటి భారతీయులు గాంధితో మొఱలిడిరి. ఈ యుదంతము వినిగాంధి చకితుఁ డాయెను. సోదరభారతీయు లనదలవలెనుండ, స్వార్థపరుఁడై గాంధి మరలిపో నెంచలేదు. తన ప్రయాణమునకు స్వస్తి

చెప్పెను—"తమ కార్యంబు పరిత్యజించియు పరార్థప్రాపకుల్ సజ్జనుల్." ఆనాఁటిరాత్రియే అతఁడొక పెద్దమహాజరు తయారు చేసెను. మఱునాఁటి యుదయము శాసనసభాకార్యకలాపమును వాయిదా వేయవలసినదిగాఁ దంతినం పెను, సేటుఅబ్దుల్లాయధ్యక్షత నొక సంఘము నేర్పఱిచి మహాజరును సంఘముద్వారా ప్రభుత్వమున కందఁజేసెను. ఆఫ్రికాలో భారతీయులు తొలిసారిగా తమ హక్కులకై సమర్పించుకొనిన మహాజరిది. కాన దీనికి చరిత్ర ప్రాధాన్యముకలదు. ఇది వారిలో నూతన చైతన్యము నొనగూర్చెను. నిత్యసమావేశముల వారు జరిపిరి. నిధిని వసూలుచేసిరి. స్వచ్ఛంద సేవకుల నేర్పఱిచిరి. ఒక్క నెలలో నన్నిహంగులు వారికి సమకూడినవి. పెద్ద వినతి పత్రము నొకదానిని గాంధీవలన శాఖాకార్యదర్శియగు రిప్పన్ ప్రభువునకు సమర్పించిరి. దానిపైఁ బది వేల భారతీయులు సంతకములు పెట్టిరి. ఇట్టి వినతి పత్రములకు, మహాజరులకు నిరంకుశ ప్రభువులు చలింతురా? అవి చిత్తుకాగితముల బుట్టల కెక్కినవి.

గాంధి తాత్కాలికముగఁ జేయవలసినదంతయుఁ జేసెను. తన సోదరులవద్ద పని వినవలయునని యతఁడు తలపోసెను. తమ కేడుగడయైన గాంధిని వారు పోనీయరైరి. అందఱు సమావేశమై యేక కంఠమున "నాయకాగ్రణీ! మాలో

నిద్రాణమైయున్న శక్తిని మీరు రగులుకొల్పితిరి. మాకొక త్రోవ చూపితిరి. కాని యది పూలబాట కాదని మీరెఱుంగుదురు. మనము వినతిపత్రమును సమర్పించిన మాత్రమున పని పూర్తి కాలేదు కదా! ఇల్లలుకంగనే పండుగగునా? మమ్మెఱుంగుదురు. ఎదిరి నెఱుంగుదురు. వాక్యముల పద్ధతి నెఱుంగుదురు మీకనుసన్న మెలంగెదము. మమ్మొక దరిం జేర్చి వెడలుండు" అని ప్రార్థించిరి. ప్రజానాయకుండు ప్రజాభిప్రాయమును దిరస్కరింపంగలండా? ప్రయాణ మబద్ధము, ప్రసాదము నిబద్ధము!!

ఈమారు గాంధి శాశ్వతమగు నేర్పాటుం గావింపనెంచెను. అదియే 'నేటాలు భారతీయ కాంగ్రెసు సంస్థ.' భావిపోరాటమంతయు దీనియాజమాన్యముననే జరిగెను. దీనిని సర్వాంగ సుందరముగ తీర్చి దిద్దిన మహాశిల్పి గాంధి. సంస్థకు మానవుండు ప్రాణము. మానవునకు సంస్థ పునాది. ఈ రెండింటి మేటి సమ్మేళనమే లోకకళ్యాణమునకు నాంది.

మూండేండ్లు ముగిసినవి. గాంధి హృదయ మొకింత దారాపుత్రుల కడకుం బరుగిడెను. సోదరులను సెలవుకోరెను. ఈ మారు సెలవు మంజూరైనది. కాని యొక నియమముకలదు. పిలుపు వినంబడంగనే పరుగిడి రావలయును. గాంధి మాతృ

దేశమునకుమరలెను. ఆఱునెలలకాల మరగడియవలెగతించినది. "గాంధిగారు రండి!" యను తంతివార్త యాఫ్రికానుండి వచ్చినది. మరుక్షణమే ఆలు బిడ్డలతో గాంధి ప్రయాణసన్నద్ధుఁడాయెను. అవును, "మాట తిరుగలేరు మానధనులు", దాదా అబ్దుల్లా క్రొత్తగాకొనిన పొగయోడపై ఆతఁడు సంసారముతో బయలుదేరెను. ఇందు సుమారెనిమిదినందలమంది యితర యాత్రికులుగూడ కలరు. వారు వివిధ కులమతములకుఁ జెందిన వారు. ఇఁక నాల్గుదినములకు ఓడ నేటాలు చేరుననఁగా ఒక గొప్పతుపాను చెలరేఁగెను. ప్రయాణికులు తల్లడ మందిరి. అరచేతులలో ప్రాణముల నిల్పికొని వారు తమతమ దేవతలకు మ్రొక్కుకొనిరి. సమష్టిప్రార్థనలు సల్పిరి. అందు గాంధియుఁగూడ పాల్గొనెను. ఇరువదినాల్గు గంటలు తుపాను ప్రబలముగ చెలరేఁగెను. మఱునాఁటికి ప్రశాంతత చేకూరెను. జగద్బంధువు తన యరుణకిరణములతో జగతి నలరించెను. యాత్రికుల ముఖపద్మములు వికసించెను. ఆపద గడచినది. వారి కీఁక దేవునితోఁ బనితీరినది. అందఱును పట్టరాని సంతోషోత్సాహములతో, ఆటపాటలతోడను, త్రాగుడు తోడను పరవశులైరి. దీనినంతటిని తిలకించి గాంధి మిక్కిలి చింతించెను. మానవుల సంకుచితదృష్టి కాతని హృదయము సంక్షోభమందెను. పదునెనిమిదవనాఁడు ఓడ నేటాలు చేరెను. ఈతుపానుకన్న భయం

కఠినమగు తుపానును గాంధి యాఫ్రికాలో నెదుర్కొనవలసియున్న దనుటకు దీనిని సూచనగా భావింపనగును.

ఏకారణముచేతనో గాంధిని, ఆతని కుటుంబమును చీఁకటి పడిన తరువాతఁగాని యోడదింపవలదని యోడ యజమానునకు ఒక ప్రభుత్వోద్యోగి రహస్యవార్త నంపెను. ఈవార్తను గాంధి తెలిసికొని యందుల కీయకొనెను. ఇంతలో నొక స్థానికన్యాయవాది గాంధిని జేరి, "మీరు దొంగలవలె సందెచీఁకటిలోఁ బురమున కేఁగుట నాకిష్టములేదు. మీకుటుంబమును బండిపై రుస్తుముజీ గృహమున కంపుదము. మనమిరువురము నడిచిపోవుదము. ఇపుడు వాతావరణము మిక్కిలి ప్రశాంతముగనున్నది" యని యొత్తిఁగించెను. ఏపాపమును తెలియని గాంధి మిత్రుని హిత వచనములకుఁ దలపంకించెను. ఆ ప్రకారము కస్తూరిబాను, పిల్లలను బండిపైఁ బంపి, గాంధి మిత్రునితో నడువసాగెను. రుస్తుముజీగృహము సముద్రతీరమునకు రెండుమైళ్లదూరమునఁ గలదు.

గాంధికి మిత్రుఁడు చెప్పినసమాచారము సరియైనదికాదు. ఆఫ్రికాభారతీయులపక్షమునఁ బనిచేసి, తమప్రాబల్యము నణఁచుటకై తిరిగి గాంధి వచ్చుచున్నాఁడను వార్త తెలియఁగనే రంగు జాతియువకులు ఒడలు తెలియని కోపావేశమున నుద్రిక్తులై యాతనిని హింసింపఁ దలపడిరి. కొంతదూరము నడచిరో లేదో

వినువీథిని 'గాంధి గాంధి' యను అంకెలు వినిపించినవి. ఆ కోలాహలమునకు మిత్రుఁడు భీతచిత్తుఁడై గాంధిని రిక్షానెక్కి పొమ్మని తనదారి తానుచూచుకొనెను. అంతలో జనసమూహము గాంధిని సమీపించి, వానిపై రాళ్లవాన కురిపించినది. అందొకఁడు గాంధితలగుడ్డ నపహరించెను. వేఱొకఁడు కాలితోఁ దన్నెను. గాంధి ఒడలు తెలియక సమీపమునగల యొకయింటి కప్పు పట్టుకొని వ్రేలాడెను. ఇట్టి క్లిష్టపరిస్థితులలో, దైవ నియోగమా యనునట్లు పోలీసు సూపరింటెండెంటు సతీమణి ఆ దారినిపోవుచు గాంధి దీనావస్థనుతిలకించి దుండగీండ్రకు, గాంధికి నడుమ నిలువఁబడి ఛత్రము నడ్డువెట్టి ఆతనిని సంరక్షించెను. ఇంతలోఁ బోలీసులువచ్చి గాంధిని సురక్షితముగ రుస్తుంజీ గృహమునకుఁ జేర్చిరి. గాంధి శరీరమంతయు గాయములతో రక్తసిక్తమైపూచిన తంగేటివలెనుండెను. గాంధిపని యంతటితో సమాప్తము కాలేదు. తెల్లవాఁడు వానిని వెన్నంటియే యుండెను. ఆతని నానాఁడు బలిగొనవలయుననియే ఆమూాఢుల సంకల్పము.

చీఁకటి పడినతోడనే వారు రుస్తుంజీ గృహము చుట్టుముట్టి "గాంధినప్పగింపుఁ"డని కేకలు వేయుచుండిరి. పోలీసు అధికారి అలెగ్జాండరు మిక్కిలి సమయోచితమగు ప్రజ్ఞగలవాఁడు. గాంధిమిత్రుఁడు. అతఁడా సమయముననే యుచటికేతెంచి, ఆ

గుంపులను భయమునఁగాక నయమున నదుపులోనికి తేఁగోరి, వారితో హాస్యప్రసంగముల మొదలిడెను. వారితోఁ బాటు తానును గాంధిపై పాటలుపాడుచు, గాంధిని పోలీసు వేసముతో సత్వరము పాఱిపోవలసినదిగా అతఁడు రహస్యవర్తమాన మంపెను. "జీవన్భద్రాణిపశ్యతి" యను నార్యోక్తిననుసరించి గాంధి పోలీసు వేసముదాల్చి నెమ్మదిగా పోలీసుస్టేషనులోఁ దాఁగెను. ఈ విషయము విని అలెగ్జాండరు "గాంధి యెటకో తప్పించుకొని పోయెను. ఏమిచేయుదును? మీరు మెల్లఁగా మీమీ గృహములకు తరలుఁ"డని అల్లరిమూఁకల కెఱిఁగించెను. ఈ మాటలకుఁ గొందఱు ఆగ్రహావిష్టులై నాలుకలు కఱచుకొనిరి. కొందఱు రుస్తుంజీయిల్లు శోధించిరి. మఱికొందఱు "పోనిండు పాప"మనిరి. అలెగ్జాండరు సామర్థ్యమువలన మన బాపూజీ మనకుఁదక్కెను. ఆహా! నిరపరాధియగు నొకమానవోత్తముని, ఒక భావియుగపురుషునిఁ గబళింప గర్వాంధులగు కొందఱు తులువలు తలపడిరి.

ఈదౌష్ట్యము నేలనాల్గుచెఱఁగుల కెగఁబ్రాఁకినది. మొసలి కన్నీటితో వలసరాజ్యముల కార్యదర్శి గాంధిని హింసించిన దుండగీండ్రను బంధింపుఁడని నేటాలుప్రభుత్వమున కాదేశించెను. ప్రభుత్వోద్యోగి వెంటనే గాంధిని వారలపేర్లు తెల్పవలసినదిగా కోరెను. గాంధి వారలలో కొందఱను గుర్తింపఁగలఁడు.

కాని వారల చెఱఁబెట్టుట అతనిఉద్దేశ్యము కాదు. కొందఱు పత్రికా విలేఖకులు గాంధిని దర్శించి, ఆతఁడు భారతదేశమున శ్వేతజాతులపై దుష్ప్రచారము సాగించినట్లు అపరాధారోపణముగావించి, ప్రశ్నపరంపరలఁగురియించిరి. గాంధి వానికన్నిటికిసూటిగా సమాధానముల నొసఁగెను. మాతృదేశమునఁ దానుగావించిన ప్రకటన ప్రతుల నన్నింటిని పత్రికలకు పరిచురణార్థ మొసఁగెను. సత్యము దాఁగబోదు. గాంధిసత్యప్రవర్తన తెల్లవారలకుఁగొంత మనఃపరివర్తనము దెచ్చినది. వారుతమయువకుల దౌష్ట్యమునకు సిగ్గుచెందిరి. గాంధి గౌరవప్రతిష్ఠలు సమృద్ధమాయెను. కురిసిన రాళ్ళవాన ఆతనికి, ఆతని యుద్యమమునకు పూలవానగా మాఱినది. మనోవాక్కాయకర్మల ప్రతీకారవాంఛారహితుఁడై యెట్టి యిడుమలనైన నోడిఁదాల్పఁగల ధీరోదాత్తతయే గాంధినియుగపురుషునిఁ గావించినదనుటలోనాశ్చర్యమేమున్నది?

౪

ఆఫ్రికాలో గాంధి కార్యకలాపములు బహుముఖములుగా ప్రారంభమైనవి. అతఁ డొకవంక గడితేఱిన న్యాయవాది; వేఱొకపక్క రాజకీయవిప్లవనాయకుఁడు; మఱియొకచక్క ప్రజాహితోద్యమ సారథి; ఇంకొకవంక స్వయంసహాయసూత్రముతో గృహవ్యవస్థ నతిదక్షతతో చక్కదిద్దిన గృహమేధి.

ఇచట నారంభమైన యీబహుముఖత్వమే గాంధి జీవితరంగమున అనంతరూపముల వెల్లివిరిసి, ప్రపంచమున కబ్బురపాటొదవించినది; విశ్రాంతియెఱుఁగని వీరసేనానాయకునిగా దివ్యనీరాజన మెత్తించినది. స్థాలీపులాకముగ వీనిలోని గొన్నింటిని ప్రస్తావింతుము.

న్యాయవాదవృత్తికనుకూలమగు ఆడంబరముల ప్రప్రథమమున నాతఁడు సమకూర్చుకొనెను. కాని యాత్మపరిశోధకుఁడగు గాంధి వానిని క్రమక్రమముగ తగ్గించెను. గుడ్డల యిస్త్రీకి అతఁడు ధనమును మొదట వ్యయపఱిచెను. ఎంతవ్యయపఱిచినను, సమయమునకు ఇబ్బంది తప్పినదికాదు. ఆ కారణమున ఆతఁడు స్వయముగ ఇస్త్రీవిద్య నలవఱుచుకొనెను. తొలిసారిగా ఆతఁడు తనమెడపట్టీని ఇస్త్రీగావించికొని న్యాయస్థానమున కరుగఁగా మిత్రులు గేలిచేసిరి. అయినను ఆతఁడు దానిని సరకుగొనలేదు. ఇట్లే మంగలివిద్యనుగూడ నాతఁ డలవఱుచుకొనెను. అతఁడు తన క్షౌరము తాను చేసికొనిన మొదటిదినమున "మీ తలను ఎలుకలు కొఱికినవా?" యని ప్రశ్నించి కొందఱు ఎగతాళిసల్పిరి. ఆ మిడిమేలపు నాగరకులు అనుభవపూర్వకముగ గాంధి బోధించిన స్వయంసహాయసూత్రమును అణుమాత్రకును గ్రహింపఁజాలరైరి. అది వారి దురదృష్టము!!

గాంధి మెట్టినచోటు 'ప్రయాగ'. "ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబకం" అనునార్యోక్తిప్రకారము విశ్వమానవులే యతని కుటుంబము. వివిధకార్యకలాపములకుఁ జెందినమానవాళి కాతని కుటీర మాశ్రయము. ఆతని సువిశాలహృదయమున అయినవారు- కానివారు-స్వదేశీయులు-విదేశీయులు తెల్లవారు-నల్లవారు అను తారతమ్యము లేదు. అతఁ డభ్యాగత సేవాపరతంత్రుఁడు.

*

ఇట్లుండ అనేకవిచిత్రసంఘటనములు తారసిలినవి. అందొకటి యిది. గాంధి డర్బనులో నుండఁగా ఒకానొక ప్రభుత్వోద్యోగి, పంచమకులమునకుఁ జెందిన వాఁడు, గాంధి కుటుంబమున కతిథియాయెను. సాధారణముగ ఆతని విశాల గృహాంగణమున కేతెంచినవారందఱు, సొంతగృహమునందువలె తమ తమ పనులను తామే చక్కదిద్దుకొనెడివారు. కాని యీ యతిథి యచటి యలవాట్లకు క్రొత్తవాఁడు. ఆకారణమున నాతనికి సౌకర్యము లేర్పఱుచుబాధ్యత కస్తూరిబాయిపైఁబడెను. తన గీమున కేతెంచు నశేషప్రజానీకమును ఆమె అత్యంతాదరముతో సత్కరించెడిది. కాని పంచములయెడ నామె యభిప్రాయము లింకను సంస్కృతములు కాలేదు. తనభర్తయు, నితర సవర్ణులును వాడిన మఱుఁగుతొట్ల నామె సంతోషముతో శుభ్రపఱిచెడిది. కేవలము పంచముఁ డుపయోగించిన తొట్టిని

కడుగుటెట్లు? కాని భర్త యాదేశము నతిక్రమించుటయా? బరువుగుండెతో బాష్పాంబుధారల నురల్చుచు, ఆమె యాపనికిం బూనుకొనెను.

గాంధి భార్యయెడల కరుణామయుఁడు. కాని యాతనికిం గల దయ లోకముతోం బాటిదగు పూలపాన్పు కాదు. కఠోర నియమపాలనమున నిగ్గులు దేలిన యసిధార. తనవలెనే తన సహధర్మచారిణియుం దన సంస్కారోద్యమమున స్వ పరభేదము లెఱుంగని యపూర్వ క్షమాస్వరూపము కావలెనని యాతని యాకాంక్ష.

తనచే నాదేశింపఁబడిన పనిని తన యర్ధాంగి బరువుగుండెతో నిర్వర్తించుచున్నదని యాతఁడు గుర్తించెను. ఆమెచే చిఱునవ్వు దొంతరలతో దానినిం జేయింపవలెనని యతఁడాశించెను. కాని తానొకటి తలంచిన, దైవ మన్యము తలపోయునుగదా!! గాంధి యాగ్రహము కట్లు త్రెంచుకొని యుఱికినది.

''ఇట్టి రాద్ధాంతములు నాయింట జరుగుట నేసహింప'' నని గాంధి కేకపెట్టెను. ఈ పలుకులు కస్తూరిబా యెడఁదను అలుఁగులవలె గ్రుచ్చుకొన్నవి. ''మీయిల్లు మీరే యట్టె పెట్టుకొనుఁడు. నేను వెడలిపోవుదు''నని యామె యుద్వేగమున బదులుపల్కెను. వేడిగాడ్పులవంటి యీపల్కులకు గాంధిహృద

యమునఁగల దయార్ద్రత యింకిపోయెను. ఒడలుమఱచి, కస్తూ
ర్బా చేయిపట్టుకొనియీడ్చుకొనిపోయి, ద్వారముతీసి బయటికి
నడువవలసినదిగా అతఁడాదేశించెను. ఆమెహృదయము మఱింత
క్రుంగినది. అశ్రుధారావాహినులు గంగా యమునలవలె ప్రవ
హించినవి. "ఇదియేమి వైపరీత్యము? కటా! మీరింతలజ్జావిహీను
లైతిరే!! ఈనిర్జనాటవిని నేనెచటికి వెడలుదాన? మీభార్యనైన
నెపమున మీరుకొట్టినను తిట్టినను మిన్నకుండవలయునా? నిగ్ర
హము తెచ్చుకొనుఁడు. తలుపు వేయుఁడు" అని యామె మిత
మధురభాషణముల దురాగ్రహికి సంయమనము బోధించెను.
అధికారాంధమైన యాతని హృదయవీథిని ఈ మాటలు తళు
కుఁగన మెఱుపులవలె మెఱిసి, ఆతనికిఁ గర్తవ్యము నుపదేశించి
నవి. చబుకు దెబ్బఁగొనిన శిష్యుని మాడ్కి గాంధి తల
వంచి, యొకించుక చింతించి, తన యవివేకమునకు లజ్జితుఁడై,
యిట్టిధూర్తనర్తన మిఁకమీఁదట తనజీవితమున పునరావృత్తము
కాకుండున ట్లప్పుడే నిశ్చయించుకొనెను. భర్తకు భార్యపైఁగల
యధికారపాలనవిషయమున గాంధి బాల్యచాపలము ఈ
ఘట్టముతో పరాకాష్ఠ నంది నిష్ఠురరూపము దాల్చి, వెంటనే
పరిభవమును కూడ పొందినది. అంతతో అతనికి హిందూ
మతమునఁ గల భార్యాభర్తల యనురాగస్వరూపము తేజో
యుతమై కనులఁ బొడగట్టినది. "హిందూమతమును గూర్చిన

నాయభిప్రాయము నే నుగ్గడింపఁ జాలనట్లు నా భార్యను గూర్చియు నే వివరింపఁజాలను. ఆమె నాహృదయము నసాధ్యముగ కదలించినది. ఆమెలోఁ బెక్కులోపములుండుఁగాక! మా యిరువురి మధ్యఁగల యనురాగమును విస్మరింపఁజాలను.''

౬

ఆఫ్రికాకు భారతీయులవలె వలసవచ్చిన డచ్చివారు బోయరులు. బ్రిటనుకు వీరితో యుద్ధమువచ్చినది. గాంధి సానుభూతియంతయు బోయరులయందే కలదు. కాని తనవ్యక్తిగతాభిప్రాయముల కతఁ డిచ్చో తావొసఁగలేదు. బ్రిటిష్‌పౌరుఁడుగా, వారినుండి హక్కులను గోరుచున్న గాంధి బ్రిటిషువారికే యీ పోరాటమున సహాయము సలుపవలయునని యాశించెను.

భారతీయులు పిఱికిపందలనియు, స్వార్థపరులనియు ఆంగ్లేయుల యభిప్రాయము. ఈ దురభిప్రాయమును దుదముట్టించు నవకాశము నాఁడు లభించినది. గాంధి పదునొకండువందల భారతీయులతో స్వచ్ఛందసేవాదళము నేర్పఱిచి, వారికందరకు ప్రథమచికిత్సలో తర్ఫీదు నిప్పించెను. నల్లవారి సహాయము నపేక్షించుటకు మున్ముందు తెల్లవారు సంకోచించిరిగాని, పరిస్థితులఁబట్టి తరువాత నది తప్పినదికాదు.

పిలిచినదే తడవుగా గాంధి తనపరివారముతో రణరంగమున పర్యటించి, క్షతగాత్రులకు ప్రథమచికిత్స గావించెను. అట్టి క్షతగాత్రులలో 'జనరల్ యడ్గేటు' అను సుప్రసిద్ధ ఆంగ్ల సేనానాయకుఁడుకూడఁ గలఁడు.

పోరాటము ముగిసినది. భారతీయుల సేవ మిక్కిలి ప్రశంసింపఁబడినది. ఇఁకనైన ఆంగ్లేయులు సహృదయతతో ఆఫ్రికా భారతీయులకు హక్కులను సమకూర్తురని గాంధి యాశించి, మాతృదేశమునకుఁ బయనమాయెను. కాని సోదరప్రజానీక మీమారుకూడ పూర్వ నిబంధనను వీడలేదు. వారు ఈ పర్యాయము గాంధికి, అతని కుటుంబమునకు ఘనముగు వీడ్కోలు గావించిరి. ఆతనికి, ఆతని యర్ధాంగికి అనేక బహుమానములు ప్రీతిపూర్వకముగా నొసంగిరి. అందుఁగొన్ని వెండి బంగారునగలుకూడఁ గలవు. వాని నెట్లో ఆతఁడు స్వీకరించెనుగాని, యానాఁటిరేయి అతనికి కునుకుపట్టలేదు. ''ప్రజాధనమును సొంతముచేసికొనుటయా? ఇంతకన్న ఘోరపాపము కలదా?'' యని యాతఁడు తన్నుఁ దాప్రశ్నించికొని, యర్ధాంగిని నిద్రలేపి, బహుమానములన్నియు నొక్కచోనుంచి, 'ఇది ప్రజాధన'మని యిందు చిల్లిగవ్వయు నంటరాదని పేర్కొనెను. ఆనాఁటినుండి సంఘసేవాపరాయణులు ప్రజ లొసఁగు కాను

కలను స్వార్థమునకు వినియోగింపరాదని గాంధి యొక నియమ మునగ జీవితాంతము వఱకును పాలించెను.

౬

గాంధి మాతృభూమిఁ జేరెను. ఆ సంవత్సరము కాంగ్రెసు సమావేశము కలకత్తానగరమున జరిగెను. తనయం దత్యంతము సోదరప్రేమఁ జూపు గోఖలే సహాయమున దక్షిణాఫ్రికాలోని భారతీయులపట్ల సానుభూతినిఁ జూపించుచు నేకగ్రీవముగ ఆ సమావేశమున ఒకతీర్మానమును గాంధి యామోదింపఁ జేసెను. కాంగ్రెసు స్వచ్ఛంద సేవకులకు సంఘసేవావిధానమును ఆచరణ పూర్వకముగ నతఁడు బోధించెను. ఆతఁడు కొన్నినాళ్లు మహా భాగ్యముగ నెంచి కాంగ్రెసు కార్యదర్శికి గుమాస్తాగాఁ బని చేసెను. భారతరాజకీయప్రముఖు లందఱితోడను పరిచయము గావించుకొనెను. పిమ్మట బొంబాయినగరమున న్యాయవాద వృత్తిని నెలకొల్పెను. కాని మహాకార్యభారము నిర్వహింప వలసిన గాంధిని ఉదరపోషణార్థమై సామాన్యవృత్తినిర్వహణము నందు భగవానుఁ డుంచునా? ఆఫ్రికాకు వెంటనే రావలసినదిగా పిలుపు వచ్చినది. మాట ముల్లె కట్టుకొని గాంధి తిరిగి యాఫ్రికా చేరుకొనెను. అనంతర మతఁ డాఫ్రికాలో నిర్వహించిన కార్యకలాపములు, ఆతని జీవితమునందలి పరిపూర్ణపరిణామములు సువర్ణాక్షరముల లిఖింపఁదగ్గవి.

౮

తన జీవితమును సంఘసేవ కంకితమొనఁగవలయునను నుత్కంఠ యధికమగుకొలఁది. యాతని కంతర్వీక్షణము తీవ్ర రూపము దాల్చుచుండెను. అంతర్వీక్షణము తీవ్రస్వరూపము దాల్చుకొలఁది, భగవద్గీతయం దాతని కనురాగ మతిశయింపఁ జొచ్చెను. గీత పదుమూఁడవయధ్యాయమునందు పేర్కొనఁబడిన 'అపరిగ్రహము''సమభావము' అతనిహృదయమున గాఢముగా హత్తుకొనినవి. వెంటనే వానిని తనజీవితమున సాధింపనెంచెను. భీమాకంపెనీలలో తనకుఁగల సభ్యత్వమును వదలుకొనెను. బొంబాయిలోని తన సోదరునకు సొంత ఆస్తిపాస్తులతో సర్వ సంబంధముల విసర్జించుచు కమ్మ వ్రాసెను. భావికాలమున తన యార్జనములన్నియు సంఘశ్రేయమునకే వినియోగింపఁ బడుననికూడ ఆతఁడు తెలియఁబఱిచెను. ఆహా! ఎట్టిత్యాగము!! ఎట్టి యనాసక్తియోగము!!! స్వకీయ సంపాదనతో గాంధి 'ఇండియన్ ఒపీనియన్' అను పత్రికకు సంపాదకత్వమును వహించి నడపుచుండెను. ఆతని సంపాదకీయవ్యాసములు ప్రతి పదాక్షరరసభావభరితములు. ఆహార నియమములను గూర్చి గాంధి యందు ప్రత్యేక వ్యాసములను ప్రకటించెను. వాని యన్నిటి సంపుటియే ''ఆరోగ్యదర్శిని'' యను మహాగ్రంథము.

ఈ సమయమున గాంధి బహుగ్రంథపఠనముగావించెను. వాని యన్నిటి ప్రభావ మాతనిపై కొలఁదిగనో గొప్పగనో పని చేసెను. అట్టివానిలోఁ బేర్కొనఁదగినది. 'రస్కిన్' మహాశయుని "అంటు ది లాస్ట్" అను గ్రంథము. సంఘశ్రేయస్సుపైనే వ్యక్తి క్షేమ మాధారపడి యున్నదనియు, జీవనోపాధికి కృషిసల్పు వాఁడు న్యాయవాదియైనను, పాకీవాఁడైనను సమానులేయనియు, కష్టించువాఁడే భుజించుటకర్హుఁడనియు సూత్రములనాయుద్గ్రంథము బోధించినది. ఈ బోధలు గాంధిని మిక్కుటముగఁ గదలించినవి. తనయాశయములను ఆచరణయోగ్యములుగావించుటకై ఆతఁడు డర్బనునగరమున 'ఫోనిక్సు ఆశ్రమము'ను స్థాపించెను. తాను నడపు పత్రికాకార్యాలయము నతఁడచ్చోట నెలకొల్పి, మిత్రులకందఱకు నొకఁడెందు పనిచేయుట కవకాశములఁ గల్పించెను. కాని యీ యాశ్రమము పెద్దకాలము కొనసాగలేదు. అతఁడు తన పత్రికను తప్పని పరిస్థితులలో 'జోహాన్సుబర్గు' మార్చవలసివచ్చెను. గాంధి జోహాన్సుబర్గులో నిరాడంబర జీవితమును, మహోన్నత భావనాశక్తిని అలవఱచుకొనెను. తాను భుజించురొట్టెయు నాతఁడే స్వంతముగ తయారుగావించుకొనెను. గృహసమ్మార్జనమునుగూడ తానే చూచుకొనెను. ఇంతలో 'జూలూవిప్లవము' చెలరేగెను.

'జూలిస్'లను తెగవారు బ్రిటిషువారికి పన్నుల నీయ నిరాకరించిరి. ప్రభుత్వము వారిపై కఠినచర్యఁ గైకొన్నది. గాంధి తన రాజభక్తిని లోకమునకుఁ దిరిగిచూపుటకై, భారతీయులతో నొక 'యంబులెన్సుకోరు' నేర్పఱిచి ప్రభుత్వమునకు సహాయపడెను. గాంధి తన పరివారముతో విప్లవము చెలరేఁగు ప్రదేశములకేఁగి, యదార్థమును గనులారఁ గాంచినప్పటినుండి, యాతని హృదయము విప్లవవీరుల పక్షమున మ్రొగ్గెను. కాని ప్రభుత్వము తన్ను, దనపరివారమును గాయపడిన విప్లవవీరులకు సేవచేయుటకే నియోగించుటచే, గాంధి యపరిమితానంద మందెను. అతఁడు తన యనుచరవర్గముతో నిత్యము నలుబది మైళ్లదూర మునకుండి సంచరించుచు, ఆంగ్లేయుల కొఱకు తుపాకిగుండ్లకు గుఱియైన జూలిసు ప్రజానీకమున కపారసపర్యలు సలిపెను. ఈ సమయమున గాంధికి సేవాధర్మ మాహాత్మ్యము సుబోధకమైనది. మానవుఁడు సేవార్థియై జీవింప వలయునన్న, బ్రహ్మచర్యవ్రతము నెవ్వాతఁడు తప్పక అనుష్ఠింపవలయు నని యాతఁడు గుర్తించెను. "మానవసేవయే మాధవసేవ."

విప్లవము సమసిపోయినది. నూతనాశయముతో గాంధి ఫోనిక్సు వెడలెను. అచట తన మిత్రబృందముతో నతఁడు బ్రహ్మచర్యవ్రతప్రాశస్త్యమును గూర్చి ముచ్చటించెను. ఈ మహత్తరాశయ మవశ్య మాచరణీయమని గాంధి కంత

ర్యాణి ప్రబోధించినది. "ఆలస్యాదమృతం విషం". ఇంక తడవుచేయరాదు. ఒక సుముహూర్తమున గాంధి బ్రహ్మచర్య వ్రతానుష్ఠానము నారంభించెను.

తాఁ బూనిన నిష్ఠురవ్రతమునుగూర్చి గాంధి తరువాత తన యర్ధాంగి కెఱిఁగించెను. ఆమహాసాధ్వి కాదనునా? హృదయపూర్వకముగ హృదయేశ్వరుని నిశ్చయము నభినందించినది. నాఁటినుండి వారు పూర్వముకన్న సన్నిహితులు. వారియానందమున కింక మేరలేదు. తరువాత ఒక మాసమునకే ఆఫ్రికా సత్యాగ్రహోద్యమ మారంభమాయెను. తాను అలవోకగా మొదలిడిన ఈ వ్రతానుష్ఠానశుభప్రారంభమే భావి సత్యాగ్రహోద్యమమునకు సూచ[illegible]సూచకమైనదని తెలిసికొనినపుడు గాంధి యానందమునకు మేరలేదు.

బ్రహ్మచర్యవ్రతమును గాంధి అనాయాసముగ సాధించెనని చదువరు లనుకొనకుందురుగాక! అనుష్ఠాననియమములవలన శరీరము పరువముదక్కినను వయఃక్రమమున నిండు యౌవనస్థుఁ డగుటచే ఈ వ్రత మాతని కసిధారావ్రతమే యాయెను. కాని గాంధి స్వభావముచే దృఢమగు నిశ్చయము కలవాఁడగుటచే కఠిన శిలాసంవృతమగు మార్గ మాయనకు పూలబాట యాయెను. ఈ విధముగ గాంధి పవిత్ర భారతధర్మపథము

నందలి ప్రధానపీఠము నధిష్ఠించినవాఁడై భారతీయులకు ధర్మ శాస్త్రయుగు నధికారమున నవ్యత సంపాదించిన గురుదేవుఁ డాయెను.

(1906 సం॥న ఒకనాఁడు) పిడుగువంటి యొకయత్యవసర చట్టమును నేటాలు ప్రభుత్వపత్రిక ప్రకటించినది. దీని ననుసరించి, ఆ దేశమునఁగల భారతీయులు, స్త్రీపురుష భేదము లేక, యెనిమిదేండ్ల వయసు మించినవా రందఱు తమ వేళ్లను ప్రభుత్వోద్యోగులయొద్ద రిజిస్టరు చేసికొనవలెను. ఈ వార్త విని భారతీయు లందఱు గగ్గోలుపడిరి. ఇది వారికి గొప్ప నిరసనము. గాంధి భారతీయుల నందఱను సమావేశపఱిచెను. సభ్యులందఱు ఈ నిర్బంధశాసనమును నిరోధింపవలెనని యేకగ్రీవముగ తీర్మానించిరి. ఈచర్యకు వారు తాత్కాలికముగ "సాత్త్వికనిరోధ" మని పేరిడిరి. అనంతర మిదియే సత్యాగ్రహమని యన్వర్థనామమును బొందినది.

పిఱికిపందలగు కొందఱు భారతీయులు మాత్ర మీ తీర్మానమునకు విరుద్ధముగా తమ వేళ్లను రిజిస్టరుగావించుకొనిరి. 'నిజాయితీ'గల భారతీయు లధికసంఖ్యాకు లట్లు గావింపమిఁ, దోఁకత్రొక్కిన పామువంటి ప్రభుత్వ మాగ్రహముతో వారినందఱిని బందీలు గావింప నిశ్చయించుకొనినది. గాంధి

నిర్భయముగ ప్రభుత్వ కఠినచర్యలను తన పత్రికలోఁ దీవ్రముగ విమర్శించెను. నాయకుని బంధించిన ఉద్యమ మంతరించునని ప్రభుత్వము గాంధిని వెంటనే కారయందుంచెను. కానియుద్యమ మాఁగలేదు. అది నిత్యప్రవర్ధమాన మగుచుండెను. పరియో జనము లేదని ప్రభుత్వము కనిపించినవారి నందఱను కనిపించి నట్లు జైళ్లకుఁ బంపుచుండెను. జోహాన్సుబర్గు జైలునందున్న గాంధి, యెడతెఱపిలేక చెఱసాలకే తెంచెడి సత్యాగ్రహులవలన నుద్యమపు తాజావార్తలఁ దెలిసికొనుచుండెను. ఎంతకాలము ప్రభుత్వ మీ ప్రజానీకమును కారలయం దుంచఁగలదు? ఉంచి యేమి ప్రయోజనము? ఒక పక్షము దినములు గడచెను. ప్రభుత్వము రాజీకి యత్నించినది. జనరల్ స్మట్సు గాంధిని రప్పించెను. అధిక సంఖ్యాకులగు భారతీయులు తమంతఁ దాముగాఁ దమ పేర్లను రిజిస్టరు చేయించుకొనిన 'నిర్బంధశాసనము' తొలఁగింపవలయుననియు, ఖైదీలను వెంటనే విడుదలగావింపవలయునను రాజీకి స్మట్సు-గాంధి లంగీకరించిరి. ఆ ప్రకారము ఖైదీలు విడుదలయైరి.

"నీచాః కలహ మిచ్ఛంతి, సంధి మిచ్ఛంతి సాధవః."

సముద్రము చెలియలికట్ట నతిక్రమింపదు. అట్లే ప్రజాసముద్రము తమ నాయకునిమాట మీఱిపోదు. భారతీయులందఱు వెంటవెంటనే తమ పేర్లను రిజిస్టరు గావించుటకు వెడలిరి.

వారిలో మొదటి భారతీయుఁడు గాంధియే. అతఁడు తనపేరును రిజిస్టరు చేసికొనుటకై పోవుచుండఁగా, మిక్కిలి పరిచయముగల పఠానొకఁడు, అతనితో నడచుచు దుడ్డుకఱ్ఱతో చావమోదెను. హఠాత్తుగాఁ దగిలిన యీఘాతకు గాంధి "హేరామా" యని నేలఁగూలెను. ఆహా!! ఏమి యీ రామభక్తి!!! పసితనమున భీరువుగానున్న గాంధికి దాది రామనామము నుపదేశించి ధైర్యము గల్గించినది. ఆ నాఁటి యా దివ్యోపదేశమే యాతనికి తారకమంత్రమై కాలక్రమమున జీవన్ముక్తిని బ్రసాదించినది. సమీపమునఁగల ఆసుపత్రిలోఁ గొంత శైత్యోపచారములు జరిగినపిమ్మట గాంధి సేదదేఱెను. ఆ పఠానులను, అతని యనుచరులను పోలీసులుబంధించిరి. గాంధి స్మృతి తెలిసిన తత్క్షణము తన్ను గాయపఱచిన పఠానుని క్షేమమారసి, ఆతనిని విముక్తుని గావింపవలసినదిగాఁ గోరెను. ప్రభుత్వ మాతని ముద్దు చెల్లించినది. గాంధి తన పేరును, తానపేక్షించినట్లే తొలిసారి రిజిస్టరు గావించుకొనెను.

అధిక సంఖ్యాకులగు భారతీయులు తమంత దాముగాఁ దమ పేర్లను రిజిస్టరుగావించుకొనినను, ఒడంబడిక ననుసరించి ప్రభుత్వము నిర్బంధశాసనమును తొలఁగింపలేదు, సరిగదా! చండప్రచండుఁడగు 'జనరల్ స్మట్సు' భారతీయుల నధఃపతితులఁ

గావించుటకై మఱికొన్ని 'నిర్బంధశాసనములం' గూడ శాసన సభలోఁ బ్రవేశపెట్టెను.

భారతీయుల సహనము కట్టలు త్రెంచుకొని యుఱికినది. వెంటనే సత్యాగ్రహసంఘము, వానిని ఖండింపవలసినదిగా 'స్మట్సు'నకు వలస శాఖాకార్యదర్శికి జాబులు వ్రాసినది. ప్రయోజనము శూన్యమని చెప్పవలయునా? సత్యాగ్రహసంఘము సత్వరమే పెక్కు సభల నేర్పఱిచి, ప్రభుత్వమొసంగిన నిర్బంధ పత్రములు నగ్నిహోత్రున కాహుతినొసంగెను. అవి రెండువేలకు మించినవి. ఆనాటి యీ 'యజ్ఞకాండ'ను పత్రికలు పూసగ్రుచ్చినట్లు వర్ణించినవి. భారతీయు లింతటితో సంతృప్తిపడక, 'ట్రాన్స్వాలు' దేశమున ప్రవేశింపరాదను ప్రభుత్వ శాసనమును ధిక్కరించుచు ఆ దేశమున ప్రవేశించిరి. అపరిమితాగ్రహముతో ప్రభుత్వము వారిని కృష్ణజన్మస్థానమునకుఁ బంపినది. కొందఱను దేశము విడిపోవుదనుక బీభత్సముగ హింసించినది. సత్యాగ్రహులు ఏమాత్రము ధైర్యమును గోల్పోక తమ యుద్యమమును నిర్విఘ్నముగ కొనసాగించిరి. నిరంకుశ ప్రభుత్వము కూడ చేయునది లేక చిక్కులోఁ దలవంచినది.

౧౧

ఇంతవఱకును చెఱల కేగిన సత్యాగ్రహుల కుటుంబములను నెలబత్తెములతో సత్యాగ్రహసంఘమే పోషించినది.

ఇది మిక్కిలి భారమగుపని. అమూల్యమగు ప్రజాధన మొక విధముగ నుదరపోషణార్థమే వినియోగపడుచున్నది. ఇది గాంధి కిష్టములేదు. ప్రభుత్వముచే విడుదల గావింపఁబడిన సత్యాగ్రహులకుఁ బనిపాటులు లభించుటలేదు. ఏలయన వారు తిరిగి శంఖారావము వినిపింపఁగనే రణరంగమున కుఱుకవలెను. వీరినందఱను నొకచోటఁ జేర్చి యొక కుటుంబముగ నేర్పఱిచి సహకార సద్భావములతో స్వయంసహాయసూత్రాచరణమునఁ బోషింపవలయునని ఆయన తలపోసెను. అందులకై వివిధ ఫలవృక్షసంభరితమగు సువిశాలసుక్షేత్రమును జర్మనుశిల్పి గాంధి కొసఁగెను. దానికాయన 'టాల్‌స్టాయి క్షేత్ర'మని పేరిడి సత్యాగ్రహుల కుటుంబములన్నిటి నచటఁ జేర్పించెను. స్వయంసహాయసూత్రమును నక్షరముల పాటించి, వివిధములగు సస్యములఁ బండించి, తమ్ము తామే వారు పోషించుకొనుచుండిరి. సత్యాగ్రహులిక నెంతకాలము కాపురముండుచున్నను చీకును చింతయు లేదు. గాంధి యిచట బహువిధచేతివృత్తుల కర్మాగారము నేర్పఱిచెను. అందు తయారగు వివిధవస్తునిచయములు శిల్పకళాకౌశలమునకుఁ బేరువహించినవి. ఒక ప్రాథమికవిద్యాలయమునుగూడ ఆయన అచ్చట నెలకొల్పి, వివిధభాషాప్రాంతములకుఁ జెందిన బాలబాలికలకు క్రియాత్మకముగు విద్యను బ్రసాదించెను. ఈ తీరున గాంధిచే నేర్పఱుపఁబడిన "టాల్‌స్టాయి క్షేత్రము" ఆయన

లోఁగల నిర్మాణకౌశలమునకు నిలయమై యుత్కృష్టప్రయోజనముల సాధించినది.

౧౨

శ్రీ గోపాలకృష్ణగోఖలే నేటాలు ప్రభుత్వమునకు సత్యాగ్రహసంఘమునకును సామరస్యమును గుదుర్చుటకై మధ్యవర్తిగా ఆఫ్రికా కేతెంచెను. అతఁడు ప్రభుత్వప్రతినిధులతోఁ జర్చలు సలిపి, వారి యింగితము నెఱిఁగి, 'అన్ని విషయములు ఏడాదిలోఁజక్కఁబడు'ననియు 'భారతీయులపైఁ గల నిర్బంధ శాసనములు తొలఁగింపఁబడుననియు' గాంధితో వాక్రుచ్చెను. కాని గోఖలే జోస్యము ఫలింపలేదు. కాన వెంటనే సత్యాగ్రహము తిరిగి ప్రారంభింపక తప్పినది కాదు. ఇతఃపూర్వము సత్యాగ్రహోద్యమమునఁ బాలు పంచుకొనుటకై నారీలోకము నిషేధింపఁ బడినది. కాని ప్రభుత్వము స్త్రీజాతి గౌరవమునకే గొడ్డలి పెట్టు వెట్టిన దీమాటు. దీనితో దానిచర్యలు శృతిమించి రాగమునఁ బడినవి. క్రైస్తవ సంప్రదాయానుసారమునఁ గావింపఁబడిన వివాహములు తప్ప తక్కిన వన్నియు చట్టవిరుద్ధములఁట!! ఏమి యీ వైపరీత్యము నారీలోక మొక్కమాటు కనులు దెఱచినది. తామును సత్యాగ్రహముసల్పి తమకుఁగల్గిన యవమానమునుండి తమ్ముతాము సంరక్షించుకోఁ దలఁచిరి. ఈ యుద్దేశము క్షణికమా, లేక

శాశ్వతమా యని గాంధి పరీక్షింప నెంచెను. కారాగారక్లేశముల నాతఁడు వారికి విశదపఱచెను. క్షణికావేశముతో నుద్యమమునకుఁ గళంకము తేవలదని యతఁడు వారల హెచ్చరించెను. ఎవ్వరును జలింపలేదు. ఎవ్వరును జంకలేదు. ఎట్టి చిచ్చునైన సంతోషముతో నోడిఁదాల్తుమని వారలు గాంధికి అభయహస్తమొసఁగిరి. భారతనారీమణికిఁ ద్యాగము క్రొత్తయా? భర్త యనుమతితోఁ గస్తూరిబా యుద్యమమునకు నాయకత్వము వహించినది. ప్రభుత్వము వీరి నెట్లణఁచవలయునో తెలియక కొంతకాలము మూఁగనోము వహించినది. ఉద్యమము నానాఁటికి నతిశయించినది. పచ్చిబాలెంతలు, కూలిజనము, బాలికలు వృద్ధలు, వీరు వారననేల సమస్త మహిళాప్రపంచము కదలి వచ్చినది. గత్యంతరము లేక ప్రభుత్వము వారినందఱను జెఱఁ బెట్టినది. ముప్పుతిప్పలు పెట్టి వారిని మూఁడునెలల పాటు జైళ్ళయందుంచినది. ఈయుద్యమతీవ్రత అణఁగినది. క్రమక్రమమున వారు విడుదలయైరి, కస్తూరిబా తన యారోగ్యసౌభాగ్యమును జైలుపాలు గావించి, శల్యావశిష్టయై యిల్లు చేరినది. 'విల్లెమ్మ' యను పదునాఱేండ్ల బాలిక విడుదలయైన వెంటనే ప్రాణములఁ బాసినది. నారీలోకము ప్రదర్శించిన యద్భుతత్యాగమునకు గాంధి హృదయము పొంగెను.

౧౮

న్యూకాజిల్ బొగ్గుగనులలోఁ బనిచేయు (భారతీయ) పాటక జనము కూడ సత్యాగ్రహము గావించుటకు సంసిద్ధముగ నున్నదను వార్త వినఁగనే గాంధి ఆప్రదేశమున కేగి. వారితో పరిస్థితులను జర్చించెను. కూలీలకు సొంతకొంపలు లేవు. గనుల యజమానులే వీరి కన్ని వసతుల నేర్పఱిచిరి. కాని వీరుకూడ సత్యాగ్రహము గావింపనున్నారని వినఁగనే వారు కుపితులై, వారికొసఁగఁబడుచున్న యన్ని వసతులను నాశనమొనర్చిరి. ఇఁక కూలీలపని మిక్కిలి విషాదకరమాయెను. గాంధి యజమానులకు కూలీలకు రాజీ కుదుర్చుటకు యత్నించి విఫలుఁడాయెను. వేల సంఖ్యలోనున్న వీరిని పోషించుటెట్లు. ఏక వసతి నేర్పఱుచు విధానమెద్ది యని గాంధి విచారసాగరమున మునిఁగెను. వెంటనే కర్తవ్యము గోచరించినది. ఆయన వీరినందఱిని చాలదూరమునఁగల టాల్‌స్టాయి క్షేత్రమునకు నడిపించుకొని పోఁదలఁచెను. ఇది కష్టతరమగు కార్యము. వారి సహనశక్తి, కార్యదీక్ష యిందుమూలమున పరీక్షింపఁబడును. నడువఁజాలని వృద్ధులను, బాలురను, అంగహీనులను రైళ్లపైఁబంపి, యువతీయువకులతో గాంధి కొన్ని యోజనముల దూరమునఁగల టాల్‌స్టాయి క్షేత్రమునకు నడచెను. ప్రజానీకము సుమారు అయిదాఱువేల సంఖ్యవఱకు కలదు. వీరు మధ్య మధ్య మజిలీల నేర్పఱుచుకొనిరి. మజిలీ

లలో వంటచేసికొనుచు. ప్రయాణసమయమున రొట్టెమాత్రము భుజించుచు, మిక్కిలి క్రమశిక్షణతో వారు గాంధి యడుగుల నడచిరి. ఇట్టి మహాక్షేత్రయాత్ర చరిత్రలో నపూర్వము. ఇట్టి మానవాతీతమగు మహోద్యమముల నడిపించిన కారణముననే కదా గాంధిని ఆబాలగోపాలమంతఃకరణపూర్వకము గా 'మహాత్మా!' యని పిలుచుచున్నది.

'ఓకురస్టు' అను మజిలీవద్ద గాంధి యాకస్మికముగా ప్రభుత్వముచే ఖైదీ గావింపఁబడెను. విచారణ వాయిదా వేయఁబడుటచే ఆయన విడిపింపఁబడెను. వెంటనే ఆయన బృందమును జేరెను. తిరిగి 'స్టాండర్టన్' మజిలీవద్దను గాంధి బంధింపఁబడెను. ఏఁబది పౌనులు పూటపడి తాత్కాలికముగ విముక్తుఁడై గాంధి తన పరివారమును జేరి ప్రయాణమును కొనసాగించెను.

గాంధి తన యాత్రికులతో టాల్ స్టాయి క్షేత్రమును జేరుట ప్రభుత్వపు టసమర్థతను సూచించును. ఎట్లైనను దీనిని భంగపఱుచు నుద్దేశముతో ప్రభుత్వము మహాత్ముని తిరిగి బంధించినది. మాఱఁడు ప్రత్యేకమగు రైలుబండ్లలో యాత్రికులందఱు జైళ్లకుఁ గొంపోఁబడిరి.

౧౪

గాంధిమహాత్మునకు ప్రభుత్వ మీమాఱు నవమాసముల కఠినశిక్ష విధించిరి. యాత్రికులందఱు వేఱు వేఱు ప్రదేశముల

బందీలు గావింపఁబడిరి. ఇది యిట్లుండగా, భారత దేశమున గోఖలే, హార్డింజ్ ప్రభువు సహాయమున ఆఫ్రికా భారతీయులస్థితి గతులను చర్చించుటకై యొక ప్రత్యేకసంఘము నేర్పఱిచెను. కాని యందు భారతీయసభ్యుఁ డొక్కఁడును లేకుండుట ఆంగ్ల రాజనీతి చతురతకు నిదర్శనము. ఆసంఘము సత్వరము జనరల్ స్మట్సుతో నుత్తరప్రత్యుత్తరముల నడపి మూఁడుపౌనుల తల పన్ను శాసనమును రద్దు జరిపించి, వివాహములను చట్టసమ్మతము గావించినది. ఇంతటితో ప్రతిష్టంభనము అంతమొందినది. సత్యాగ్రహులు విముక్తులైరి. ఈ తీరున మహాత్ముని దక్షిణాఫ్రికా సత్యాగ్రహోద్యమము విజయవంతముగ నంతమొందెను. భారతీయుల ప్రతిష్ఠ యథోచితముగ వృద్ధిపొందెను.

ఇఁక ఇంగ్లాండుమీఁదుగా ఆయన మాతృదేశమునకుఁ బయనమాయెను. సోదర భారతీయులతో నిరువదియొక్క సంవత్సరములు భాగస్వామియై నాఁడు వారినివీడవలసివచ్చినందులకు మహాత్ముని హృదయము పిఱువీకులాడెను. భారత దేశ దాస్య విముక్తికై కృషిసల్పవలయుననుతహతహ ఆయనను ముందునకుఁ గొంపోయెను.

ఇట్లు గాంధి దక్షిణాఫ్రికాయందు దేశసేవాతత్పరుఁడై కష్టములను దనకుఁదానై వలచి, శరపరంపరలవలెఁ దనపై వచ్చి

పడుకొలందిని నిర్భీతులై, మేరువువలెనిలిచి, యచంచలధైర్యోత్సాహములతోడను, సమయోచితమగు నుపజ్ఞతోడను వానినెదిర్చి తుదకు విజయశ్రీనిఁ జేపట్టెను. ఈదక్షిణాఫ్రికా సత్యాగ్రహానుభవమే మున్ముందు గాంధికి భారతదేశ స్వాతంత్ర్య సాధనోద్యమమున గమ్యస్థానము చేర్చుటలో నుపకరించినది.

"అతి కష్టాస్వవస్థాసు మేధావినీఖలు బుద్ధిః" Ref. Con

Rep. Con ——

# స్వదేశాగమనము-స్వాతంత్ర్యసమరము

మహాత్ముఁడు భారతదేశమునఁ గాలిడుసరికి బ్రిటిషు ప్రభుత్వ పరిపాలనమున వెగటుచెంది, స్వాతివానకు ముత్తెపుఁ జిప్పలట్లు, భారతీయులు స్వాతంత్ర్యకాంక్షతోఁ దహతహలాడు చుండిరని వేఱుగాఁ జెప్పవలయునా? విద్యాధికులగు కొందఱు భారతీయులు స్వదేశాభిమానులై 'దేశీయమహాసభ' నొక దానిని స్థాపించి, స్వాతంత్ర్యసముపార్జనమునకై పాటుపడు చుండిరి. శ్రీ గోపాలకృష్ణ గోఖలే, బాలగంగాధర తిలక్, లాలాలజపతిరాయి, చిత్తరంజనదాసు, మోతీలాల్ నెహ్రూ మున్నగు వారందఱు ఆసంస్థకుఁ గార్యకర్తలు. అహరహము సేవామార్గమును స్వయముగ నన్వేషించుకొను గాంధిమహా

త్ముఁడు వెంటనే యిందుచేరెను. "సజ్జనులు దారె పరహితా చరణమతులు" కదా!!

మహాత్ముఁడు తన రాజకీయజీవితమున శ్రీగోపాలకృష్ణ గోఖలేను గురువుగ భావించి, యాతని యడుగుజాడల పరమాసక్తితో నడచెను. భారతదేశమున వివిధప్రాంతములంగల పరిస్థితులు, ప్రజాభిమతములు ప్రత్యక్షముగఁ దెలిసికొనుటకై మహాత్ముఁడు దేశమంతయు సంచరించెను. అనేకప్రజాసంస్థలయందుండి, యచటి కార్యాచరణ విధానమునుగని, యవి దేశాభ్యుదయమునకు, దాస్యవిముక్తికి నెంతవఱకు చేదోడు వాదోడు కాఁగలవో నూడ పరికించెను. అట్టివానిలో ప్రపంచ విఖ్యాతినందిన రవీంద్ర కవీంద్రుని "శాంతినికేతన" మొకటి.

నవభారతభాగ్యాంబరమున సరిదోడుగ నవతరించిన కాంతితారలు గాంధీ రవీంద్రులు. జాతీయ దురహంకార పరితప్తమైన పృథివిని శాంతింపఁజేసి, విశ్వమైత్రీభావమున నేకమొనర్చి, సత్యాహింసల నపూర్వసాధనములుగఁజేకొని జగతీ శ్రేయమును సాధింపనెంచిన మానవోత్తముఁడు మహాత్ముఁడు. ఇఁక ప్రపంచమును సమ్మోహపఱచునట్టుల విశ్వభారతీగీతములను నంజలిగ నివేదించి, సౌందర్యదృష్టిని జగతిని రసప్లావితమొనర్చి, మానవహృదయాంతరాగముల సమన్వయించుటలో

విశ్వశ్రేయస్సు నాశించిన "విశ్వకవి" రవీంద్రుఁడు. వ్యక్తిగత ముగ మహాత్ముఁడు రవీంద్రుని యందుఁగల గౌరవప్రపత్తుల కొలఁది "గురుదేవా!" యని సంబోధించి, సంభావించెడి వాఁడు. మహాత్ముని యద్భుతమును, నమోఘమునగు ఆత్మ శక్తికడ భక్తి వినమ్రుఁడైనవాఁడు రవీంద్రుఁడు. తనయనుభవ మున మిక్కిలి ఫలప్రదమైన స్వాయంసహాయతాసూత్రమును మహాత్ముఁడు శాంతి నికేతనవాసులకు బోధించి, 'హరిద్వార ము'లో జరుగు గొప్ప సంతకు హాజరై యచట వీథులఁ బరి శుభ్రపఱిచి, పాకీపనిఁగూడ చేసెను.

అనంతరము మహాత్ముఁడు "అహమ్మదాబాదు" నగర మున 'సత్యాగ్రహాశ్రమము'ను నెలకొల్పి, యువతీయువకులకు నాత్మనిష్ఠను ప్రసాదించెను. సత్యము, అహింస, బ్రహ్మచర్యము, అస్తేయము, అపరిగ్రహము, అభయాది సప్తమహావ్రత ముల యాచరణవిధానమును జూపి చెప్పెను. కోట్లాది ప్రజా నీకము బానిసతనమను మహాయాతనల ననుభవించుచుండ, వ్యక్తిగతమగు నాధ్యాత్మిక వికాసమును మాత్రమే ప్రసాదించు సాధనలతో మహాత్ముఁడెట్లు సంతృప్తిపడి యుండఁగలఁడు?

౨

జనకుఁడు దున్నిన పవిత్రభూమిలో మహాత్ముఁడు తొలు సారిగా సత్యాగ్రహమునకు నంకురార్పణఁ గావించెను. అపుడు

లక్నోనగరమున జరిగిన కాంగ్రెసు సమావేశమున బీహారు ప్రతినిధి 'చాంపరాన్'లోని నీలిమందుతోటల యజమానులకు రైతులకు సంబంధించిన కష్టనిష్ఠురముల విశదపఱుపఁగా, సభ్యులు రైతులయెడ సానుభూతి తెల్పుచు నొకతీర్మానము నామోదించిరి. బీహారు ప్రతినిధులు ఈ యుదంతమును స్వయముగ నా సమావేశమునకు హాజరైన మహాత్మునకెఱుకపఱచిరి. మహాత్ముఁడు చాంపరాన్ వెడలి రైతుల యిక్కట్లను స్వయముగ నారసి వారి దీనావస్థకు నిట్టూర్పు విడిచెను. ఈ సమయముననే మహాత్ముని పరిచయభాగ్యము బాబూరాజేంద్ర ప్రసాదునకుఁ గల్గినది.

ప్రభుత్వము మహాత్ముని బంధించి, విచారణసల్పి, చాంపరాన్ వెడలవలదని యాజ్ఞాపించినది. మహాత్ముఁ డాయాజ్ఞను ధిక్కరించి, యెట్టి కఠినశిక్షనైన ననుభవింతునని, శిక్షానంతరము మరల చాంపరాన్ వెడలి రైతులస్థితి బాగుపఱుతునని ప్రభుత్వమునకుఁ దెల్పెను. ఏమిచేయుటకునుదోఁపక ప్రభుత్వము నోటికిఁ దాళము వేసికొన్నది. మహాత్ముఁడు చాంపరాన్ ప్రవేశించి, తోఁట యజమానులకు నష్టము కలుగకుండ, రైతుల కష్టములను దొలఁగించెను. ఆనాఁడు చాంపరాన్‌లో భారత ప్రజానీకమునకు స్వాతంత్ర్యదివ్యజ్యోతిః పుంజములఁ జూపఁగల

విధానమును సత్యాగ్రహసాధనలోని ప్రథమపాఠముగ నతఁడు వ్యక్తపఱచెను.

తరువాత జరిగిన 'కైరా' సంఘటనముకూడ ప్రధానమైనది. ఇచట రైతులు, పంటలు పండకపోయినను ప్రభుత్వము విధించిన శిస్తులు చెల్లింపక తప్పినదికాదు. ఈ సందర్భమునకూడ మహాత్ముఁడు సత్యాగ్రహాస్త్రమును ప్రయోగించి రైతుల నిక్కట్లనుండి కడతేర్చెను. మఱియొక పర్యాయము మహాత్ముఁడు అహమ్మదాబాద్ మిల్లులలోఁ బనిచేయు కార్మికులకోర్కెలనీడేర్చెను. మహాత్ముని యాత్మకు శాంతి చేకూరెను. ఇట్లు మహాత్ముఁడు దీనజనబాంధవుఁడై దివ్యదీధితులు వెలార్చుచు ముందుకుఁ బోసాగెను.

ఇంతలో ప్రథమప్రపంచ సంగ్రామము చెలరేఁగెను. రాజభక్తిపరాయణుఁడగు గాంధి వైస్రాయిచే నేర్పఱుపఁబడిన సమావేశమున కాహూతుఁడై వెడలెను. ఆపత్కాలమున బ్రిటిషు ప్రభుత్వమునకు సర్వవిధముల సహాయము సలిపిన వారు భారతీయులకు స్వాతంత్ర్యమును ప్రసాదింతురని తలపోసి, బ్రిటిషువారికి సర్వవిధముల సహాయపడవలసినదిగా ప్రజలను ప్రబోధించి, వాడవాడల సంచరించి భారతీయులను యుద్ధభటులుగాఁ జేర్చెను. అప్పటి ప్రయాసమునకాయన తనయారోగ్యము కూడకోల్పోయెను. కాని యాశించిన ప్రకారము జరు

గనే జరుగలేదు. ప్రభుత్వమునందు తనకుఁగల విశ్వాసమును మహాత్ముఁడు క్రమముగాఁ గోల్పోయెను. దేశదాస్యవిమోచనార్థము ప్రభుత్వముతోఁ బోరాటము తప్పదని ఆయన భావించెను. ఆయనవద్ద సత్యాగ్రహసమ్మోహనాస్త్రము కలదు. ఇఁక దానినే ప్రభుత్వముపై ప్రయోగింపవలయును. ''ఉత్తమ లక్ష్యముల సాధించుట కుత్తమమార్గమే శరణ్యము'' అని మహాత్ముని యాలోచన.

౩.

అసహాయోద్యమ మొక్కనాఁడు హఠాత్తుగా ప్రారంభింపఁబడినది కాదు. అది యనేకపరిస్థితులవలన కలిగిన క్రమపరిణామము.

'రౌలటు సంఘము' సలహా ననుసరించి ప్రభుత్వము రౌలటు బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టినది. దీనిమూలమున భారతీయులకుఁ గలస్వల్పస్వాతంత్ర్యమునుగూడ ప్రభుత్వమపహరింపఁ దలఁచినది. బహిరంగవిచారణ సలుపకయే భారతీయులను కారాగారములకుఁ బంపుట, జాతీయగ్రంథములను నిషేధించుట, ఉప్పు తయారుచేయరాదనుట, యిందలి కొన్ని ముఖ్యాంశములు. కేంద్రశాసనసభాసభ్యులు శ్రీ శ్రీనివాసశాస్త్రి, పండిత మదనమోహనమాలవ్యాగార్లు దీనిని తీవ్ర

ముగ ప్రతిఘటించిరి. కాని యేమి ప్రయోజనము? మహా
త్ముఁడు 'సత్యాగ్రహసభ' జరిపి, బిల్లును సర్వవిధముల ప్రతి
ఘటించుటకు సభ్యుల ప్రమాణములఁ గైకొనెను. పిమ్మట
మదరాసునచ్చి, శ్రీ కస్తూరిరంగఅయ్యంగారు, శ్రీ రాజగోపాలా
చార్యులాదిగాఁ గల ప్రముఖులతోఁ గర్తవ్యమునాలోచించెను.
అంతలో 'బిల్లు' శాసనరూపముఁ దాల్చినది. ఆనాఁటిరేయి
మహాత్ముఁడు దీర్ఘాలోచనానిమగ్నుఁడై కలఁత నిద్రపోయెను.
భావికార్యక్రమమంతయుఁ గల రూపమున వానికి ప్రత్యక్షమా
యెను. మఱునాఁటి యుదయమున దేశమంతట నుపవాసదీక్ష
వహించి, ధర్మకార్యదీక్షాయుతులై నిరసనములతో శాసనమును
ధిక్కరింపవలసినదని మహాత్ముఁడు ప్రబోధించెను. తమ నాయ
కుని పలుకు వినవచ్చినంతనే పల్లెపట్టణములలోని ప్రజలు
హర్తాళములు జరిపిరి. రాజధానినగరమున హిందూమహమ్మ
దీయులు పరస్పరవిభేదములు లేక స్వామి శ్రద్ధానందుని నాయ
కత్వమున హర్తాళములు జరిపిరి. ప్రజలలోఁగల యీ యలజడి
నణఁచుటకై ప్రభుత్వము హింసాకాండ నారంభించినది. దీనిని
సహింపలేక కొందఱు ప్రతిహింస గావించిరి. ఇది మహాత్ము
నకు సూదిపోటువలె నాయెను. మహాత్ముఁడు దక్షిణదేశ
పర్యటనము ముగించుకొని, బొంబాయి నగరమున మిత్రులతో
సత్యాగ్రహము గావించెను. కరపత్రముల మూలమున ప్రజలు

క్రమశిక్షణను నెట్టి పరిస్థితులలోను కోల్పోవరాదని హెచ్చరించెను. తరువాత ఆయన ఢిల్లీనగరమునకుఁ బోయి. అచటి పరిస్థితుల సమీక్షించి, శాంతిని బోధించి, పంజాబునకుఁ బయనమాయెను. కాని మార్గమున ప్రభుత్వము బంధించి ఆయనను బలవంతముగ బొంబాయినగరముఁ జేర్చెను. అచ్చటచ్చట ప్రభుత్వోద్యోగులపై ప్రజలు ప్రతిహింస సలుపుచుండిరని విని, క్రమశిక్షణలేని ప్రజలలోఁ జట్టవిరోధము ప్రవేశపెట్టుట తన తప్పని గ్రహించి మహాత్ముఁడు సత్యాగ్రహ సంఘపక్షమున స్వయంసేవక సేన నేర్పఱచెను. కానియీ కార్యకలాప ముద్రేక పూరిత ప్రజాకోటికి సంతృప్తికరముగ లేదు.

ఇది యట్లుండ, పంజాబులో ప్రభుత్వనిరంకుశ విధానము శ్రుతిమించి రాగమునపడెను. దేశమంతటను 'మార్షల్ లా' అమలు జరుపఁబడినది. ఎట్టి విచారణ లేక నిరపరాధులగు ప్రజలను ప్రభుత్వము ఘోరహింసలకు బలిచేయుచుండెను. మహాత్ముని హృదయము పంజాబుమీఁదనే కలదు. అచట శాంతిని నెలకొల్పుటకు ప్రభుత్వము మహాత్మున కెంతకోరినను అవకాశ మొసఁగలేదు. అయినను సమయమును వృథా సేయక మహాత్ముఁడు ఆంగ్లమున ప్రచురితమగు 'యంగ్ ఇండియా' యను పత్రికకు, గుజరాతీభాషలో ప్రచురితమగు 'నవజీవన్' అను మాసపత్రికకు సంపాదకత్వమువహించి, ప్రజలకు శాంతియుత

మగు శాసనధిక్కార విధానమును వ్యాసములద్వారా తెలియం
జెప్పెను. అచిరకాలముననే యారెండు పత్రికల కెనలేని ప్రా
ముఖ్యము దేశమంతటను గలిగెను.

౪

పంజాబు విషయమై కొలందిగ పూర్వమే పేర్కొనంబడెను. అచటి విషాదసంఘటనల విపులీకరించుటకు భాషచాలదు. చాలినను గలమాడదు. ప్రపంచమున నెట్టినిరంకుశప్రభుత్వములును నిట్టి యమానుషకృత్యములను అమాయికులును, నిరాయుధులును నగు ప్రజలపై జరిపియుండ లేదనుట యథార్థము. 'జలియన్ వాలాబాగ్' అను ప్రదేశమున సమావేశమైన ఆబాలవృద్ధమగు సమూహమును, కర్కశహృదయుఁడగు 'జనరల్ డయ్యరు' నరరూపరాక్షసుఁడై, తన తుపాకిగుండ్ల బారులకు గురిచేసెను. సభ్యతాలోక మీచర్యకు సిగ్గుచేఁ దల వంచినది. దొంగలు పడిన యాఱుమాసములకుఁ గుక్కలు మొఱుగురీతి, ప్రభుత్వము పంజాబు దురంతములఁ బరిశీలింప వలసినదిగా 'హంటరుకమిషను' ను నియమించెను. కాంగ్రెసు పక్షమున నొకయుపసంఘము నేర్పాటుగావించి, మహాత్ముఁ డా ప్రదేశమునంతయు సంచరించి, యెట్టి యతిశయోక్తులు లేని వృత్తాంతమును దయారుచేసి యొకటి ప్రభుత్వమునకు, మఱి యొకటి పత్రికలకు సమర్పించెను. సర్వప్రపంచ మావృత్తాంతమును జదివి ప్రభుత్వవిధానమును 'ఛీ ఛీ' యని గర్హించినది.

ఇది యిట్లుండగ 'హంటరుకమిషను' డయ్యరుచర్యలను సమర్థించుచు, అతని స్థైర్యసాహసములం గొనియాడుచు, నొక నివేదికను ప్రభుత్వమున కొసంగినది. ఆంగ్లశాసనసభ, తన ప్రతిష్ఠకు భంగము కానిరీతి, ఈ విషయమును చర్చించి, ఏ ముఖ్యమగు నిర్ణయమును చేయజాలక పోయినది. ఇదియంతయు ప్రజలకుఁ గోపకారణమైనది.

ఈ సమయమున ఢిల్లీనుండి మహాత్మునకొక పెద్దపిలుపు వచ్చినది. ముస్లిము ప్రముఖుల సంతకములందుఁ గలవు. శ్రద్ధానందుఁడుకూడ నందు పాల్గొనెనట! చర్చనీయాంశము 'ఖిలాఫత్' సంబంధమైన విషయము. బ్రిటిషు ప్రధానామాత్యుఁడు యుద్ధమునకుఁ బూర్వము కావించిన వాగ్దానములకు వ్యతిరేకముగా 'టర్కీ'తో ఒడంబడికఁ గావించుకొనెను. ఇది భారతీయ ముస్లిములకుఁ గష్టము కలిగించినది. ఈవిషయమై మహాత్ముఁడాదినుండియు శ్రద్ధఁజూపెను. యుద్ధసహాయమునకుఁ బూర్వమే ఆయన 'ఖిలాఫత్తును' గూర్చి వైస్రాయికి వ్రాసిన లేఖలో ప్రస్తావించి, యీ విషయమున నొక నిర్దుష్టమగు ప్రకటనఁ గావించినఁగాని మహమ్మదీయులు తృప్తిపడరని హెచ్చరించెను. కావున మహాత్ముఁ డాసక్తితో ఢిల్లీసభకు హాజరై ముస్లిములతో సహాయనిరాకరణోద్యమమును గూర్చి ప్రస్తావించెను. వారందఱును నేకకంఠమున మహాత్ముని ప్రతిపాదనను నంగీకరించిరి.

ఆనాఁటి సభలో ఆయన హిందీ, ఉర్దులనుసమ్మేళన మొనర్చి ప్రసంగించెను. ఇదియే 'హిందుస్తానీ' యనునూతననామధేయముతో భారతీయులకు జాతీయభాష కావలయునని మహాత్ముఁడాశించెను.

౨౫

లోకమాన్య బాలగంగాధరతిలక్, పండిత మోతీలాల్ నెహ్రూ, లాలాలజపతిరాయి, దీనబంధు, మదనమోహనమాళవ్యా, సి. ఆర్. దాసు మున్నగు ప్రముఖభారతీయనాయకులతో మహాత్మునకుఁ బరిచయమేకాక కొంత పలుకుబడియు నేర్పడినది. వీరందఱును మహాత్ముని కార్యదీక్షను, దేశసేవానిరతిని, నిష్కల్మషవర్తనమును, సత్యాన్వేషణతత్పరతను గుర్తించిరి. కాంగ్రెసుకార్యక్రమములలో మహాత్ముఁడత్యంతాసక్తిని ప్రదర్శించుచు తన శక్తికొలఁది సంస్థకు సపర్యల సలుపుచుండెను. భారతప్రజాబాహుళ్యపుటాదరణల చూఱగొన్నయేకైకసంస్థయదియే యనికూడ ఆయనగుర్తించెను. మహాత్ముఁడు తలపోసిన యసహాయోద్యమమును గూర్చిన సాధకబాధకములఁ జర్చించుటకై కాంగ్రెసు ప్రత్యేకసమావేశము కలకత్తానగరమున నేర్పాటుగావింపఁబడెను. దీనికి కాంగ్రెసు అతిరథులు, మహారథులును హాజరైరి. 'పంజాబు సింహము' లాలా లజపతి

తాయి సభాధ్యక్షుఁడు. పెక్కురుమిత్రుల సూచనలనంగీకరించి, మహాత్ముఁడు 'స్వారాజ్యసాధనమున కసహాయోద్యమమే రాజమార్గ' మను తీర్మానమును ప్రతిపాదించెను. సుదీర్ఘములును, సునిశితములును, సుగంభీరములును అగు వాదోపవాదముల యనంతరము సభ మహాత్ముని తీర్మాన మంగీకరించినది. తరువాత జరిగిన నాగపురము కాంగ్రెసులో నిది యంతిమరూపము దాల్చినది. కాంగ్రెసు నిబంధనావళిలోఁగూడ పెక్కుమార్పులను మహాత్ముఁడు కావించెను. కాంగ్రెసు మహానౌకకిఁక మహాత్ముఁడే చుక్కానిపట్టువాఁడు. నాఁటినుండి ఖద్దరు, అస్పృశ్యతా నివారణము, హిందూముస్లింసఖ్యము మున్నగు క్రొత్తయంశములు కాంగ్రెసులో ప్రధానస్థాన మలంకరించినవి. నాఁటి నుండియే కాంగ్రెసు భారతప్రజాసంస్థగా నలరారినది.

నిరంకుశప్రభుత్వ మొసఁగిన వ్యర్థపు బిరుదులఁ బరిత్యజించుట, అందలి గౌరవపదవులఁ ద్యజించుట, ప్రభుత్వోద్యోగముల చేయకుండుట, ప్రభుత్వ పద్ధతులలో నే సందర్భముననురాజీపడకుండుట, పన్నుల చెల్లింపకుండుట, పోలీసు, మిలిటరీ శాఖలలోఁ బనిచేయకుండుట, ఖాదీ యుత్పత్తి, విదేశవస్తుబహిష్కరణము, ఖద్దరధారణమును మున్నగునవి యసహాయోద్యమమునకు జీవనాడులు. దీని యాచరణవిధానమును మహాత్ముఁడు విశదపఱచెను. ఇంత దూరదృష్టితో నేర్పఱుపఁబడిన యీ

యుద్యమమును 'ఆనిబీసెంటు' మున్నగు ప్రముఖవ్యక్తులు తీవ్రముగ నిరసించిరి. కాని మహాత్ముఁ డిసుమంతయుఁ జలింప లేదు.

బ్రిటిషుప్రభుత్వము, తనకు ప్రథమప్రపంచసంగ్రామమున నొసఁగిన 'కేసరీహింద్'అను సువర్ణ పతకమును మహాత్ముఁడు వైస్రాయికిఁ బంపుచు నీతినియమ రహితమగు ప్రభుత్వ పాలనలోఁ దా నొక్కనిముసము మనఁజాలనని జాబు వ్రాసెను. తరువాత ఆయన పెద్ద పెద్దనగరములకుఁ బోయి యుద్యమ విధానమును విశదపఱచెను. వేఱొక ప్రక్క 'యంగ్ ఇండియా' పత్రికాముఖమున శరపరంపరలుగా తన దివ్యలేఖినితో నిర్మాణాత్మక కార్యసాధన విధానమును వ్యాసరూపములఁ బ్రకటించెను.

మహాత్ముని స్వరాజ్యసమరశంఖారావము దేశమునాల్గు చెఱఁగుల మాఱుమ్రోఁగెను. న్యాయవాదులున్యాయస్థానముల వీడిరి. విద్యార్థులు పాఠశాలలను, కళాశాలలను వదలిపోయిరి. ప్రభుత్వోద్యోగులు తమ పదవులకు రాజీనామా లొసంగిరి. దేశమంతటను 'మహాత్మాగాంధికిజై', 'వందేమాతరం' అను జయజయధ్వానములు మిన్నుముట్టెను. కాంగ్రెసు కార్య వర్గ మెప్పటి కప్పుడు సమావేశమై యుద్యమస్థితిగతులను, ప్రభుత్వమునోగతిని సమీక్షించుచుండెను. ఉద్యమము నానాఁ

టికి బలపడినది. ప్రజల నైతికబలముకూడ నినుమడించినది. మహాత్ముఁడాలీసోదరులతో వివిధప్రాంతముల సంచరించి దేశదాస్యవిముక్తికి త్యాగులు కావలసినదిగా ప్రబోధించెను. స్వరాజ్యనిధికై కోటిరూప్యములు వసూలుగావించెను. దేశమంతటను విదేశవస్తువులు బహిష్కరింపఁబడినవి. మిల్లుగుడ్డలు అటనట దగ్ధమొనర్పఁబడినవి. వేల్సుయువరాజురాకకై వ్యతిరేకప్రదర్శనములు జరుపఁబడినవి. ఆతఁడు స్వీయదేశమునకు మరలఁగనే మహాత్ముఁడొక యేఁడాదిలో స్వరాజ్యము కరగతము గావింతునని యుద్యమమును బునరుజ్జీవింపఁజేసెను. పరిస్థితులు మఱింతవిషమించినవి. ప్రజలు మహాత్ముని నిర్భయముగ ననుసరించిరి.

అచ్చటచ్చట హింసాపూరితమగు సంఘటనలు ప్రజలలోఁ జెలరేఁగి మహాత్ముని కలవరపఱిచెను. బార్డోలీ సత్యాగ్రహమున సర్దారు పటేలు ప్రముఖపాత్ర వహించి, మహాత్ముని మన్ననలఁ బొందెను. చీరాల 'రామదండు' పెదనందిపాడు, పలనాడులలో పన్నుల నిరాకరణోద్యమములు నిర్వహింపఁబడినవి. ఇంతలో 'చౌరాచౌరీ' యనుచోట ప్రభుత్వోద్యోగులపై ప్రజలు తిరుగఁబడి హింసకావించిరి. అంత మహాత్ముఁడు ప్రజలను స్వయంసహాయసూత్రమునకు మూలకందమగు రాట్నపరిశ్రమ, ఖద్దరుధారణము, ఖద్దరు ఉత్పత్తి

మున్నగు నిర్మాణ కార్యక్రమమును కొనసాగింప వలయునని హెచ్చరించెను. కాని యుద్రేకపూరితులగు ప్రజ లీపలుకు-నంతఁగా వినిపించుకొనరైరి. ఉద్యమపటుత్వము సన్నగిలినది. ఇందులకు మహాత్ముఁడు నిందితుఁడాయెను. కాని యాయన తొణఁకక, బెదరక, నిర్మాణకార్యక్రమమును కొనసాగించెను. మహాత్ములకు దూషణభూషణములు తృణప్రాయములుకదా!!

౬

అప్పటికే చాలదినములనుండి ప్రభుత్వము మహాత్ముని బంధింపనున్నదని గాలివార్తలు చెలరేఁగినవి. రానేవచ్చిన దా ఘడియ! మహాత్ముఁడు సబర్మతీయాశ్రమమున బంధింపఁబడెను. "నిర్భయులై యహింసా మార్గమున పోరాడుఁడు. నిర్మాణ కార్యక్రమమును విస్మరింపకుఁడు. హిందూముస్లిము లేకమనస్కులై వర్తిల్లుఁడు" అని మహాత్ముఁడు సందేశమొసఁగిన తదుపరి ప్రభుత్వవశుఁడాయెను.

మహాత్మునిపై 'రాజద్రోహము' నేరమారోపింపఁబడినది. ఆయన న్యాయస్థానమునకుఁ దేఁబడెను. ఇసుకవేసిన రాలని రీతిగా ప్రజలు కిటకిటలాడుచు న్యాయస్థానమును జుట్టుముట్టిరి. అలనాఁడు ప్రతిపక్షపు రాయబారియని కృష్ణుని పేరోలగమున బంధింప నుంకించిన ధార్తరాష్ట్రాదులు తనుకు తెలియకయే ఆతని కతిసంభావనమొనర్చి, ఆతనిమాహాత్మ్య

నునకు విన్నప్తులైనట్లు, మహాత్ముఁడు న్యాయస్థానమున ప్రవే శింపఁగనే ప్రజానీకమే కాక, తాబేదారు మొదలు సుబేదారు వఱకు బ్రిటిషువాఁడగు న్యాయాధికారితోఁగూడ, ఏదో యొకయ గోచరమగు శక్తి తన్నాకర్షించినట్లు లేచి నిలుఁవబడి గౌరవించిరి. మహాత్ముఁడు జలదగంభీరస్వనమున తనవాఙ్మూలమునొసఁగెను. ఇది భారతదేశచరిత్రలో చిరస్థాయినొందినది. మహాత్ముని సిరాఘాటమగు వాక్సరణి, నిర్భయత పలుకు పలుకున తొణి కిసలాడు సత్యపదవీతత్పరత ప్రపంచము నుత్తేజమొనర్చెను. 'బ్రిటిషు న్యాయాధికారి సమక్షమున మహాత్ముఁడు నిలిచెనా, లేక యవతారమూర్తియగు యుగపురుషుని యెదుట బ్రిటిషు ప్రభుత్వమే విచారింపఁబడుచున్నదా?' యని ప్రేక్షకసమూ హము వితర్కించుకొనెను. మహాత్మున కాఱేండ్లు కఠినశిక్ష విధింపఁబడినది. ప్రపంచపత్రికలన్నియు ప్రభుత్వదమననీతి నేవఁ గించుకొనినవి. ఏప్రభుత్వపశుకృత్యములకు ప్రతిక్రియఁగా నీయుద్య మము ప్రేరేపింపఁబడినదో, ఆయుద్యమఫలితముల కనులారఁ గాంచిన పిదప బ్రిటిషువారు, అవి తమ ఘోరాపరాధము లుగా గుర్తించి, రౌలటు శాసనమును రద్దుపరచుటయే కాక, టర్కీతో నొడంబడికకూడఁ గావించుకొనిరి. మహాత్ముని దూర దృష్టి కింతకన్న నిదర్శనములు వేఱు కావలయునా?

ఇది యట్లుండ 'గయ' కాంగ్రెసుసభలో సి. ఆర్. దాసు ప్రజలను మహాత్ముని మార్గమునుండి మరలింప యత్నించి

విఫలుండాయెను. మోతీలాల్ నెహ్రూ మున్నగువారుకొందఱు శాసనసభలలో ప్రవేశించి ప్రభుత్వములో ప్రతిష్టంభనలుకలిగింపవలయునని వాదించిరి. తుదకు 'కాకినాడ' కాంగ్రెసుసభలో శాసనసభాప్రవేశతీర్మాన మామోదింపఁబడెను. నాఁటినుండి కాంగ్రెసుసంస్థలో మితవాదులు, అతివాదులు అను రెండు పక్షము లేర్పడినవి.

తరువాత మహాత్ముఁడు వ్యాధిగ్రస్తుఁడగుటచే నాయనకు శస్త్రచికిత్స జరిగినది. పిమ్మట ఆయనను ప్రభుత్వము విడుదల చేసెను. అందులకు సమస్తభారతము పండుగచేసికొన్నది. క్రమక్రమమున నారోగ్యము చేకూర్చుకొని మహాత్ముఁడా యేఁడాదిబెల్గాము కాంగ్రెసునకధ్యక్షుఁడై, మద్యపాననిషేధము హిందూస్థానీ, జాతీయభాష, భాషాప్రయుక్తరాష్ట్రవిభజనము మున్నగు నూతనాంశములుగల ప్రణాళికను కాంగ్రెసునందు ప్రవేశపెట్టెను. ప్రభుత్వము నాశ్రయించియే స్వాతంత్ర్యమును సముపార్జింపవలయునను ఛాందసధోరణి నంటిపట్టుకొనిన్రేలాడు మితవాదుల సంస్థయగు 'స్వరాజ్యపార్టీ' యపేక్షించినరీతి నేర్పఱుపఁబడిన 'రౌండుటేబిలు' సమావేశమునకు మహాత్ముఁడు కాని, ఆయన యనుయాయులు కాని హాజరుకాలేదు. ఈసను యమునసే ఆయన ఒక సుదీర్ఘమౌనవ్రతము నవలంబించి యంత ర్ముఖుఁడై, రాఁబోవు కార్యక్రమములకు శక్తిచేకూర్చుకొనెను.

౭

భారతీయులకు స్వరాజ్య మెంతవఱ కొసఁగనలయునో సమీక్షించుటకై బ్రిటిషుప్రభుత్వము 'సైమనుసంఘము' నేర్పఱచెను. ఇందొక్క భారతీయసభ్యుఁడుకూడ లేఁడు.

సైమను తన సహచరులతో బొంబాయినగరమునఁ గాలిడఁగనే, మహాత్మునియాజ్ఞానుసారము, కాంగ్రెసుస్వచ్ఛంద సేవకులు నల్లజెండాలజూపి, 'సైమను! వచ్చినదారిపట్టు' మను నినాదములుచేసి, వ్యతిరేకప్రదర్శనములఁగావించిరి. దేశమంతయుఁ దమయసమ్మతిని హరతాళములు, నిరశనవ్రతములమూలమునవ్యక్తపఱచినది. వీనినణఁచుటకై ప్రభుత్వముతనపశుబలము నంతయుఁ జూపినది. రక్తధారలు పట్టణవీధులలో మడుఁగులు గట్టినవి. పీనుఁగులు ప్రోవులు పడినవి. గాయపడిన ప్రజల హాహాకారవములు మిన్నుముట్టినవి. లక్నోనగరమున పండిత జవహర్‌లాల్ నెహ్రూ సుకుమారగాత్రము పోలీసుల కఱకు లాఠీలకు గుఱియైనది. పంజాబున లాలాలజపతిరాయి, ప్రభుత్వ ఘాతములకు వీరస్వర్గము నలంకరించెను. నాయకులే యిట్టి దుర్గతులఁజిక్క, దిక్కులేని స్వచ్ఛందసేవకుల మాట చెప్పవలయునా? భారతమాత ప్రియపుత్రుల రక్తధారల జలకమాడిన సైమనుసప్తకము, ప్రభుత్వవిధానమున నేవో కొన్ని

మార్పులను గావింపనలసినదిగా ఒక నామమాత్రపు నివేదికను తయారు చేసినది.

ఈ సందర్భమున యూరపు దేశమున బర్యటింపవలసినదిగా మహాత్ముని పలువురు మిత్రులు కోరిరి. కాని ఆయన అందులకీయకొనక తన సర్వశక్తులు నిర్మాణకార్యక్రమమున వినియోగించెను. కార్మికులు పలుచోట్ల సమ్మెలుగావించిరి. హిందూస్థాన్ సేవాదళ మేర్పఱుపఁబడెను. జాతీయపతాక మన్ని భవనములపై నెగురవేయఁబడినది. నిర్మాణకార్యక్రమ ప్రచారములు దినదినప్రవర్ధమానములగుచుండెను. మహాత్ముఁడు 'లాహోరు' కాంగ్రెసుకు అధ్యక్షుఁడుగా ఎన్నుకొనఁబడెను. కాని తనవారసుఁడగు జవహరు నిమిత్తము ఆయన రాజీనామా యొసఁగెను.

ఇర్విన్ ప్రభువు బ్రిటిషుప్రభుత్వముతో సుదీర్ఘచర్చలు జరిపిన పిదప ఇండియాకు మరలివచ్చి, 'అధినివేశస్వాతంత్ర్య మొసఁగుటయే బ్రిటిషుప్రభుత్వ వాంఛిత' మని పేర్కొనెను. సాముదాయికముగా పూర్తిమద్యనిషేధము, ఉప్పుపన్ను రద్దు, మున్నగు నంశములతోఁగూడిన యేకాదశ సూత్రప్రణాళిక నొకదానిని సూచించి, దీని నమలుజరిపిన, సహాయనిరాకరణోద్యమము నుపసంహరించుకొందునని మహాత్ముఁడు ప్రభుత్వము

నకుఁ దెల్పెను. భారతదేశక్షేమమునకై వినియోగపడు నీప్రణాళికను బరప్రభుత్వ మంగీకరించునా?

౮

సబర్మతీయాశ్రమమున కాంగ్రెసు కార్యవర్గము సమావేశమై తిరిగి శాసనోల్లంఘనోద్యమమును సాగింపవలసినదిగా మహాత్ముని కోరినది. మహాత్ముఁడు తన యనుచరులతో నాలోచించి, ఉప్పుతయారుచేసి ప్రభుత్వశాసనమును ధిక్కరింపవలయునని సంకల్పించుకొనెను. ఈవిషయమై వైస్రాయికి జాబు కూడ వ్రాసెను. ఇర్విన్ ప్రభువు మహాత్ముని బెదరించుచు ప్రత్యుత్తరమొసఁగెను. "బ్రిటన్ పశుబలముతో భారతదేశము నొక సువిశాల కారాగారము గావింపనున్నది" అని యాజవాబునకు తిరిగి మహాత్ముఁడు జాబువ్రాసెను.

(1930 మార్చినెల 12-వ తేదీ) చరిత్రాత్మకమగు దండయాత్ర ప్రారంభమాయెను. ఒక పెద్దముత్తైదువు భారతమాతవలె నెదురువచ్చి, లలాటమున కుంకుమరేఖలు తీర్చిదిద్ది, 'విజయీభవ' యని మహాత్ము నాశీర్వదించినది. కస్తూరిబా, సరోజనీనాయుఁడు మున్నగునారీమణుల నాయకత్వమున లలనామణులు లవణసత్యాగ్రహమున వీరోచితపాత్ర వహించిరి. మహాత్ముని ఇతర నాయకులను ప్రభుత్వము బంధించినది. స్త్రీ పురుష విభేదములేక చిక్కినవారిని చిక్కినట్లు లాఠీలతో

మోదించినది. కారలు ఇసుకవేసిన చాలునట్లుండెను. ప్రభుత్వ దమననీతితోఁబాటు ప్రజలలో సత్యాగ్రహోద్యమముపైనా సక్తి తీవ్రమైనది.

దేశ మీరీతి నల్లకల్లోలములలో మునిఁగియుండ, మితవాదులు, సంస్థానాధీశ్వరులు స్వరాజ్యసమస్య చర్చించుటకు లండను పోయిరి. శూన్యహస్తములు, శుష్కవాదములు. భారతీయుల యేకైక సంస్థయగు కాంగ్రెసు ప్రాతినిధ్యము లేని సభానిర్ణయములు సమగ్రములు, ప్రజాభీష్టదాయకములు కావని ప్రభుత్వము గుర్తించెను. అంతట గాంధీ-ఇర్విన్ ఒడంబడిక జరిగెను. తత్ప్రకారము రెండవ 'రౌండుటేబులు' సభకు మహాత్ముఁడు కాంగ్రెసు సంస్థ యేకైక ప్రతినిధిగా లండను వెడలెను. విశాలభూభాగముల పరిపాలకులు, చీని చీనాంబరధారులైన అగర్భ శ్రీమంతులు, అనాఁడు సమావేశమైరి. కాని యర్ధదిగంబరుఁడైన యా మహాత్ముని దివ్యసాన్నిధ్యమున సభ సకలము ప్రమోదమొందెను. భారతీయులు వాంఛించు 'సంపూర్ణ స్వరాజ్యము'ను గూర్చి మహాత్ముఁడు తెలిపిన నిముసములసేపు ముక్తకంఠమున సభాసదుల [illegible]. ఆబాలగోపాల మానందపారవశ్యమునఁదేలి మహాత్మున కంజలి సమర్పించిరి. కాని స్వరాజ్యమును సంపాదించినవారు లేరు. మహాత్ముఁడు రిక్తహస్తములతో (1931

డిసెంబరు 28 వ తేదీ) బొంబాయినగరమున నడుగు పెట్టెను. తత్ క్షణము దేశపరిస్థితులువిషమించినట్లాయన గుర్తిం చెను. చండశాసనుఁడగు 'వెల్లింగ్డన్' ప్రభువు నిరంకుశముగ ప్రజా భక్షణశాసనముల నమలుజరిపెను. సమరససాధనాన్వేషణ తత్పరుఁడగుమహాత్మునితో దేశపరిస్థితులఁగూర్చిముచ్చటించు టకుఁగూడ నాతఁడీయకొనలేదు. ఆహా! ఏమివైపరీత్యము!! పలుకే బంగారమైనది!!! నాయకులు, మహానాయకులు వెంటనే జైళ్లకుఁ బంపఁబడిరి. సత్యాగ్రహుల యాస్తిపాస్తులు ప్రభుత్వ వశమాయెను. వేయేల? భారతప్రజానీకము తను ధన మాన బలముల ప్రభుత్వము మఱియొకమారు వశపఱచుకొనెను. దేశ మును స్మశానతుల్యము గావించి యెంతకాల మేలఁగలదో చూతము!!

సత్యాగ్రహోద్యమమునను, సత్యాగ్రహిజీవితములోను మహాత్ముఁడు నిరాహారవ్రతమున కొకవిశిష్టత చేకూర్చెను. "భూమిపై మానవునిపుట్టుక యెంత ప్రాచీనమైనదో, నిరాహార వ్రతముకూడ నంతపురాతనమగు సంప్రదాయము. ఆత్మ పారిశుద్ధ్యమునకును, మహాశయసాధనమునకును బూర్వులీ వ్రతమవలంబించిరి. భగవద్దర్శనార్థము బుద్ధుఁడు, జీసను, అహ మ్మదు ఉపవసించిరి. పార్వతి శివుని వివాహమాడుటకు నిష్ఠుర వ్రతనియమములతో నిరాహారయాయెను. ఇట్లనేక నిదర్శన

ములఁ జూపవచ్చును. నే నెప్పు డుపవసించినను వీరినాదర్శముగ పెట్టుకొందును. కాని వారి యాదర్శములంత పవిత్రము లైనవి కావు. ఉపవాసమనునది సత్యాగ్రహి కొకబలయుతమగు నాయుధము. నాకిది ప్రాయశ్చిత్తము చేసికొనుటవంటిదియు నగును. ఈ యాయుధమును వినియోగించుటకు నిపుణత్వము కావల యును. భగవంతుఁడు నాకీమార్గమున సుశిక్షణనొసఁగెను. ఇంకను నొసఁగఁగలఁడని నానమ్మకము. ఇది నేను నామమాత్రముగ నవ లంబించుట కాదు. అంతర్వాణియే న న్నీరీతి నడిపించుచున్నది. నే నా ప్రబోధమునకు దాసుఁడను. నా కానమయమున శారీరక ముగ శక్తి లేకున్నను, ఆయగోచరమగు శక్తియే నీరసస్థితినుండి తప్పించి నాకు బలమును ప్రసాదించును'' అని మహాత్ముఁడు వాకుృచ్చెను. ఆయన దేశపరిస్థితులు సక్రమపథమున నుండక తన్మాత్రోనలఁ బట్టినపుడు, ఆత్మపారిశుద్ధ్యమునకే పెక్కు మార్లుపవాసదీక్ష వహించెను. అవియన్నియు క్రమఫలితమ్ముల నొసఁగినవి. వీనిలో పేరెన్నికఁగన్నది యరవాడ జైలునం దవలం బించిన యామరణ నిరశనదీక్ష.

మహాత్మునకు హరిజనులు బహిఃప్రాణము. అస్పృశ్యతా నివారణమునకే యాయన యహరహము కృషిసల్పెను. తనకు పునర్జన్మమే యున్నచో హరిజనుఁడై పుట్టుదువని ఆయన పెక్కుమార్లు వ్రాకుచ్చెను. అట్టివారిపై నీఁగవాలిన నాయన

సహింపలేఁడు. వారులేని హిందూసంఘము ప్రాణములేని శరీరము వంటిదని యాయన తీవ్రాభిప్రాయము. విభజించి పాలించు రాజనీతిగల బ్రిటిషువారు హరిజనులను హిందూ సంఘమునుండి చీలఁదీసి, వారికి ప్రత్యేకనియోజక వర్గముల నేర్పఱుపనెంచిరి. దీనికే "మెక్డొనాల్డ్ కమ్యూనల్ అవార్డు" అని పేరు. ఇది విని మహాత్ముని హృదయము పరితపించినది. ఇట్టి యన్యాయమున కొడిగట్టిన బ్రిటిషువారి మనఃపరివర్తనమునకై మహాత్ముఁడు ఈ దీక్షవహించెను. సర్వప్రపంచమున కీవార్త కను రెప్పపాటులో వ్యాపించినది. మహాత్ముని ప్రాణముల కాపాడ వలసినదిగా బలుదిక్కులనుండి తంతివార్తలు ప్రభుత్వమునకుఁ జేరినవి. ప్రభుత్వము కంపించినది. నిమ్నజాతి నాయకులు, సవర్ణ హిందువులు పూనాలో ప్రభుత్వముతో సంతృప్తికరమగు ఒడం బడిక గావించుకొనుటచే మహాత్ముఁడు నిరశనవ్రతమును విర మించెను. ఒడంబడిక ననుసరించి నిమ్నజాతులకుఁగల ప్రత్యేక నియోజకవర్గములు రద్దయినవి. తరువాత మహాత్ముఁడు నిర్ణీత మగువ్యవధిలో అస్పృశ్యతను నిర్మూలింపవలసినదిగాఁ గోరెను. ఏతత్ప్రయత్నముగ 'హరిజన సేవకసంఘ' మొకటి నెలకొల్పఁ బడినది. 'హరిజన' పత్రిక ప్రారంభింపఁబడినది. తన్మూలమున హరిజనులకు దేవాలయప్రవేశము కల్పించి వారిని తమసోదరు లుగాఁ జూచుకోవలసినదిగా మహాత్ముఁడు సవర్ణహిందువులను

ప్రబోధించెను. అనంతరము దేశపరిస్థితులను గమనించి, వ్యక్తి సత్యాగ్రహమును ప్రవేశపెట్టెను. వెంటనే ఆయనను ప్రభుత్వము చెఱఁగొని యేండాది శిక్ష విధించినది. ఈమారు జైలునందుండి 'హరిజన' పత్రికను నడుపు సౌకర్యమునుగూడ ప్రభుత్వమొసఁగలేదు. ఈ నిర్బంధమునకుఁ దీవ్రనిరసనమును జూపుచు మహాత్ముఁడు రెండుమార్లు నిరసనవ్రతమును బూనెను. అతి ప్రమాదకరమగు పరిస్థితులలో 'బేషరతు'గా విడుదల గావింపఁబడెను. కాంగ్రెసు సంస్థయందుకూడ సభ్యత్వమునువదలుకొని, రాజకీయములకు దూరస్థుఁడై నిర్మాణ కార్యక్రమమునఁ దన దృష్టిని కేంద్రీకరించెను. గ్రామపరిశ్రమల పునరుద్ధరణము, అస్పృశ్యతానివారణము ఆర్తజనరక్షణము మున్నగు విషయముల నాయన ప్రశంసనీయమగు కృషిసల్పెను.

ఇంతలో బ్రిటిషువారు భారతీయులకు తమ దేశపరిపాలనములోఁ గొంత బాధ్యతనొసఁగుటకై యొక నూతన శాసనమును దయారుచేసిరి. దీని ననుసరించి రాష్ట్రములకుఁ గొంత స్వతంత్ర పరిపాలన మొసఁగఁబడినది. కాని ప్రత్యేకాధికారములు ఆంగ్లేయ గవర్నరు, గవర్నరు-జనరలు హస్తగతములు.

రాష్ట్రములలో ఎన్నికలు జరుపఁబడెను. ఆయా రాష్ట్రముల శాసనసభలకు అధిక సంఖ్యాకులుగా నెన్నికయై కాంగ్రెసు

అఖండవిజయమును సాధించినది. కాంగ్రెసు ప్రణాళికను క్రమ క్రమముగ నమలుజరుప ప్రభుత్వములు నిశ్చయించినవి. అనేక ప్రజోపయోగకరమగు పనుల నిర్వర్తించినవి. కాని ఈ ప్రభుత్వములు రెండేండ్లలోనే యంతరించినవి.

౯

ఇంతలో రెండవ ప్రపంచసంగ్రామ మారంభమాయెను. బ్రిటిషువారు యూరపులోని కొన్ని దేశముల స్వాతంత్ర్యము నిమిత్తమై పోరాడుచున్నారట! ఆహా! ఎట్టిపరహితార్థమతులు! కోట్లాది భారతీయులను బానిసలను జేసి, విశాల భరతఖండము నొక పెద్ద కారాగారమును గావించిన విషయము వారు విస్మరించిరి. అవును, బహుకార్యభారనిమగ్నుల కావిషయ మెట్లు జ్ఞప్తియందుండును! భారతీయులు వారికి సర్వవిధముల సహాయ పడవలయునని వారి యాప్సితము. ఒకమారు గావించిన సహాయమునకు ప్రతిఫల మందరు కెఱుకయే! తిరిగి యట్టి గోతిలోఁ బడుటయా? కాంగ్రెసిందుల కంగీకరించునా? అంగీకరింపక ప్రభుత్వయంత్రమును నడుపుటెట్లు? వెంటనే రాజీనామాలు దాఖలైనవి. తిరిగి శాసనోల్లంఘనోద్యమ మారంభమాయెను. మహాత్ముని నిర్మాణకార్యక్రమముల రూపు దాల్చిన వినోబాభావే ప్రథమునియంతగా నుపక్రమించెను. ప్రతి

మానవునకును ప్రాథమికస్వత్వమగు వాక్స్వాతంత్ర్యమును బడ యుట దీనిప్రధానలక్ష్యము. ముప్పదివేల భారతీయు లిందు పాల్గొని పరిభుత్వముచే బంధింపఁబడిరి.

బ్రిటిషువారు జపానుతో యుద్ధమును ప్రకటించిరి. భారతీయుల సహాయసంపత్తులిపుడు మిక్కిలి ఆవశ్యకములు. యుద్ధానంతరము భారతదేశస్వాతంత్ర్యవిషయమైయాలోచింత మని, ప్రకృతము తమకండగా నిలఁవఁబడి, జయము గల్గింప వలసిన దను ప్రతిపాదనలతో 'క్రిప్సు' రాయబారము జరుపుటకై మన దేశమునకు వచ్చెను. వివిధపక్షనాయకులతో నితఁడు సంప్రదించెను. సద్యఃకాలమున నేదో రూపమగు ప్రజాప్రభుత్వము లేనిదే యెట్టి యాలోచనలు వలదని మహాత్ముఁడు పేర్కొనెను. అన్నిపక్షములవారును నట్లే పేర్కొనిరి. రాయబారము విఫలమైనది. దొరగారు వచ్చిన తెన్నుపట్టిరి. 'తేదీ లేని బ్యాంకు చెక్కు' అని మహాత్ముఁడు దీనిని వర్ణించెను.

అఖిలభారతకాంగ్రెసుకమిటీ బ్రిటిషువారితో కడపటి పోరాటమును నలుపుటకై బొంబాయి నగరమున సమావేశమైనది. మహాత్ముడు తుదిసారి యుద్రేకపూరితముగఁ దన ముక్తకంఠమునెత్తి 'భారతదేశమును వదలి పొం'డని బ్రిటిషువారిని హెచ్చరించెను. మహాత్ముని దివ్యవాక్కు కొన్నివేలమైళ్ళదూరమున నున్న బ్రిటిషువారి గుండియల కలవరపఱిచినది. 'దేశీయు

లిందుకై యొకమారు తనలోఁగల యహింసాశక్తుల నన్నిటిని పునరుజ్జీవింపఁజేసి కర్తవ్యమును నిర్వహింపవలయును. లేదా మరణింపవలయును' అనునీయాజ్ఞ మహాత్మునినోట వెలువడినదో లేదో ప్రభుత్వము ఆయనను, ఆయన యనుచరులను బంధించినది. ప్రజల యుద్రేకము చెలియలికట్ట లేనిసాగరమువలె పొంగి పొరలినది. తంతితీఁగ లూడఁబెఱికిరి. రైళ్లనాఁపిరి. న్యాయస్థానముల మూసిరి. పాఠశాలలు కట్టివేసిరి. సర్వవిధముల ప్రభుత్వములో ప్రతిష్టంభన మేర్పడినది. దీనికే చారిత్రాత్మకమగు 'ఆగష్టు విప్లవము' అనిపేరు. ఈ మహావిప్లవమున ఎందఱో దేశభక్తులు తమ ప్రాణములను తుపాకిగుండ్ల కర్పించిరి. మఱి యెందఱో దేశభక్తులు ప్రభుత్వ నేత్రముల కారముచల్లి ప్రజాసేవఁ గావించిరి. ఈనాఁడు మన మనుభవించు స్వాతంత్ర్యము వారందఱి మహత్తర సేవాఫలమేగదా!

ఈ యుద్యమములో మహాత్ముని యహింసాప్రభావము దిగంతముల మాఱుమ్రోఁగినది. మహాత్ముఁడు తన సతీమణితోడను, కార్యదర్శియగు మహాదేవదేశాయితోడను 'ఆగాఖాన్' భవనమున నిర్బంధింపఁబడెను.

మహాత్ముఁడు కారాగారమున నుండఁగా దలవని తలంపుగా ఆత్మపారిశుద్ధ్యమునకై మూఁడు వారములపాటు నిరశనవ్రతదీక్ష

బూనెను. మహాత్ముని విముక్తికై తంతివార్తలు శరపరంపరలుగా ప్రభుత్వమునకు వచ్చినవి. విడుదలచేయలేదు సరిగదా, ఏవేళ మరణించునోయని వారు దహనసంస్కారములఁ జేయించుటకై మంచిగంధపుఁజెక్కలనుగూడసంసిద్ధపఱిచిరఁట! ఉపవాసదినము లధికమగుకొలఁది నాయన ముఖము నూత్న తేజఃపుంజముల వికసించెను. దీక్ష జయప్రదముగ ముగిసినది.

అనఁతికాలమున నే కన్నబిడ్డకంటె నెక్కువ మక్కువతో తన చెంత మెలఁగిన మహాత్ముని యాంతరంగిక కార్యదర్శి, శ్రీ మహాదేవ దేశాయి పరమపదించెను. ఇతఁడు పరమపవిత్రమగు మహాత్ముని 'యాత్మకథ' నాంగ్లమున తర్జుమాచేసి, విశాల విశ్వమున కందించిన పూజనీయుఁడు. 'గోరుచుట్టుపై రోఁకటిపోటు' చందమున మహాత్ముఁడు తరువాత కొలఁదిమాసములకే తన యర్ధాంగినిఁగూడ కోల్పోయెను.

ఆనాఁడు మహాశివరాత్రి పర్వదినము. అది నటరాజమూర్తి శాంతగంభీరముగ ప్రళయతాండవముచేయు ప్రదోషవేళ. కారాగారమున రోగశయ్యపై పరుండిన శ్రీమతి కస్తూరిమాత హృదయమాన్రుత్యకింకిణీధ్వనులతో లయమైనది. ఆమహాసాధ్వి చివరకు తనబాహ్యచేష్ట లుడిగి సరాసరి రసాగర్భమున విలీనమయినది. కస్తూరిమాత పరమపదించెనువార్త నాకాశ

వాణి దశదిశల కందించినది. అశేషభారతప్రజలును అధీరులై కన్నబిడ్డలకంటె నెక్కుడుగా నాక్రోశించిరి.

అఱువది యేండ్లనుండియు, నిరంతరదీవ్యదఖండభక్తితోఁదన చరణాబ్జపుజాడల తప్పక సంచరించిన సహధర్మచారిణి దైవయోగముచే మహాత్మునకు శాశ్వతముగాదూరమైపోయిన విషాదముహూర్తమున, గతచరిత్రియంతయు నొక్కమారాయన కనులఁ గట్టినది. ఆధీరోదాత్తుఁ డా కరుణాదృశ్యమున కరఁగి పోయినాఁడు. ఆగాఖాన్ మందిరమునకు నూఱుగజముల దూరమున మహాదేవభాయికి ప్రక్కనే యీాలలనామణి చితి పేర్చఁబడినది. చితిపైనామెశిథిలదేహమును శయనింపఁ జేయుచుండఁగా మహాత్ముని కనులనుండి రెండేరెండు కన్నీటిబొట్టులురలెను. ఈ కన్నీటిబిందువులకే మహాసముద్రములు సరిపోఁగలవు? ఆనాఁడు 'ఆగాఖాన్ భవనము' ఒక కారాగారము! ఈ నాఁడో యదియొక మహాపుణ్యక్షేత్రము!!

మహాత్ముఁడు తన యనుఁగుకార్యదర్శిని, యర్ధాంగిని గోల్పోయిన కొలఁదికాలముననే యాయన యారోగ్యముకూడ శిథిలమైనది. ప్రభుత్వమాయనను విడుదలచేసినది. భారత భాగ్యవిధాత ప్రజలలోఁ బ్రవేశించెను. ఆయన బోసినవ్వుల కాంతిపూరములు దేశమునందంతటను వెల్లివిరిసినవి. మహాత్ముఁడు

ఆరోగ్యమును జేకూర్చుకొనుచు సేవాగ్రామమున నిర్మాణ కార్య క్రమమును నిర్వర్తించుచుండెను.

రెండవ ప్రపంచ సమరము ముగిసినది. ఆంగ్లేయులు దివాలాతీసిన షాహుకార్లయిరి. దౌర్జన్యవిధానముతో భార తీయుల నిఁక నదపులోనుంచి పరిపాలించుట దుస్సాధ్యమని పూర్తిగా గ్రహించిరి. వెంటనే అగ్రనాయకులను ప్రభుత్వము విడుదలచేసినది. దుర్భర కారాగారవాస క్లేశములకు గురియై నను నాయకుల యుద్దీప్తి రవ్వంతయు సన్నగిలలేదు. వారు విడుదలైనదే తడవుగా ఆగస్టు తీర్మానమును బలపఱచుచు భారతీయులను స్వాతంత్ర్యపథమున ముందుకుఁ గొంపోయిరి. వీరావేశమున వినువీథిముట్టిన భీషణప్రజాఘోషములు, బ్రిటిషు వారి పరిపాలనము నిఁక భారతీయులు నిమేషము సహింపఁజాల రని లోకవిదితము గావించినవి.

బ్రిటిషువారి ప్రతినిధి లార్డు 'లిన్‌లిత్ గో' మహాత్మునితో సిమ్లాలో సంప్రదింపులు జరిపెను. సమావేశము విఫలమై నను, మహాత్ముఁడు సుహృద్భావసామరస్యములతో బనిఁ జేయు టకు సుముఖుఁడే! రాష్ట్రములలో ఎన్నికలు ప్రారంభింపఁబడినవి. కాంగ్రెసు పూర్వమువలె నఖండవిజయము నాఱురాష్ట్రముల

సాధించినది. ఇంతలో ఆంగ్ల దేశమున కఱుకువారిన 'కన్సర్ వేటి' వగు చర్చిల్ నాయకత్వమునుండి ప్రభుత్వాధికార ముదార భావులగు కార్మికపక్షమువారి చేతికివచ్చినది. వెంటనే వారు ఇండియాను వదలిపోవుటకు తమసమ్మతిని ప్రకటించి, యందుల కొక గడువునుగూడ నిశ్చయించిరి. బ్రిటిషుమంత్రులు ముగ్గురు భారతదేశమునకు వచ్చి నాయకులతో సుదీర్ఘచర్చలు జరిపి, పండిత నెహ్రూ ఉపాధ్యక్షతను తాత్కాలిక కేంద్రపరిభుత్వ మును సంస్థాపింపఁజేసిరి.

అమాత్యత్రయము తయారుచేసిన ప్రణాళికను ముస్లిము లీగువారు ముందామోదించి, తరువాత తమ యామోదము నుపసంహరించుకొనిరి. అందువలన రాజకీయములలో తిరిగి ప్రతిష్టంబన మేర్పడినది. దానిఫలితముగా వైస్రాయి 'లార్డు వేవలు' తొలఁగింపఁబడెను. అతని స్థానమున లార్డు మౌంటు బాటెను నియమింపఁబడెను. అతఁడు దేశవిభజన రూపమగు క్రొత్త ప్రణాళికను నాయకుల ముందుంచెను. అప్పటికే దేశ మున పలు ప్రాంతములలో మతోన్మాద పిశాచము విలయ తాండవము గావించుచున్నది. జిన్నా విభజన తప్పక కావలయు నని మొండిపట్టుపట్టెను. మహాత్ముఁడు జిన్నాలో దేశసమైకతా భావమును కలిగించుటకు సర్వవిధములఁ బ్రయత్నించెను. కాని స్వార్థపరుఁడగు జిన్నా, విభజించిపాలించు బ్రిటిషువారియండను

పాకిస్థానమును సాధించి తీఱవలయునని యే సంకల్పించెను. కేంద్రప్రభుత్వోపాధ్యక్షపదవి నలంకరించిన పండిట్ నెహ్రూ, విభజన ప్రణాళికపై "బాధ తప్పక పోవచ్చును. ఆవేదన చల్లాఱకపోవచ్చును గాక! మన మచంచలముగా విశ్వసించిన మన భవితవ్యము మన కనులయెదుటనే మూర్తిమంతమగు చున్న" దని తన యావేదనను సోదర ప్రజానీకమున కెఱిగించి దానికిననుమతింపవలసినదిగా నభ్యర్థించెను. కాంగ్రెసు అగ్రి నాయకుల మనోభీష్టము ననుసరించి, మహాత్ముఁడుకూడ దేశ విభజనమున కర్ధాంగీకారమునఁ దాటస్థ్యము వహించెను.

విభజన శరవేగమున జరిగినది. స్వతంత్ర రాజ్యాంగ పరిషత్తు ఒకవైపున ముసాయిదా రాజ్యాంగమును డాక్టరు రాజేంద్రప్రసాదు అధ్యక్షతను తయారుగావించుచున్నది.

౧౨

నిర్ణీతదిన మాసన్నమైనది. అవును. విధినిర్ణయము నెవరు త్రోసిపుచ్చఁగలరు? సమస్తప్రపంచము నిద్రాణమైయుండఁగా, స్వాతంత్ర్యవిజయశంఖారావముతో భారతప్రజాపరిషత్తు నిశీథ సమయమున సమారంభమై, భారత జాతీయపతాక ధర్మ చక్రసంశోభితమై, ఆకాశమున అణువణువున నాలీనమగుచు, స్వతంత్ర తామంద పవనములలో నలలారేఁపుచు నెగురుచుండ, అధికారస్వీకారమహోత్సవమును గావించినది. స్వాతంత్ర్య

సమరమున ప్రాణార్పణ చేసిన వీరయోధులకు పరిషత్తు అశ్రుతర్పణము గావించినది.

"భారతదేశస్వాతంత్ర్యసిద్ధి ఆసియాఖండమునకే కాక సకల ప్రపంచమునకును మహోత్కృష్ట శుభసమయమైనది. ప్రాగ్దిశాకాశమున వినూత్న ధ్రువతారయొకటి యుదయించుచున్నది. ఇది జగతియందలి ప్రాగ్భాగమున కంతటికిని స్వాతంత్ర్యజ్యోతి! చిరకాలాభిలషితమైన యొక మనోహర దృశ్యము, ఒకయాశాభావ మీనాఁడు సఫలీకృతమైనది. ఈ నూత్నతార కిఁక నస్తమయము లేదు. ఈ యాశాభావమునకు వినాశనము నాస్తి. ఈ మహాపవిత్రసమయమున మనకు స్వాతంత్ర్యసౌధమును నిర్మించి యొసఁగిన యా మహాశిల్పి మన భావపథమున నిలువఁబడుట సహజము. ఆ మహావ్యక్తి మన జాతిపిత. ప్రాచీనభారతసంప్రదాయము లాయనలో మూర్తీభవించినవి. స్వాతంత్ర్యజ్యోతిని చేఁబూని మనజాతి నావరించిన దాస్యాంధకారమును బటాపంచలు గావించిన మహానాయకుఁ డాతఁడు. ఆయనే మన బాపూజీ. మహాత్ముఁడు" అని జలదగంభీరస్వరమున స్వతంత్రభారతప్రధానామాత్యుఁడు పండిత నెహ్రూ, మహాత్మునకు యావద్భారతజాతిపక్షమున కృతజ్ఞతాంజలి నర్పించెను.

'పాకిస్థాన్' రాజ్యప్రతిష్ఠాపనముకూడ కరాచీనగరమున ఆనాఁడే జరగినది.

ఈ జాతీయ మహాపర్వదినమున మహాత్ముని కార్యకలాప మిఁక పరికింతము. బెంగాలు దేశమున నాత్మోన్మాద పిశాచము విలయ తాండవము సల్పుచుండఁగా మహాత్ముఁడాయా ప్రదేశముల శాంతిదూతయై పర్యటించుచు, దినమంతయు నుపవసించి, మౌనము వహించి, నూలువడఁకుచు, నిరాడంబరముగ స్వతంత్రభారతమున కంజలించెను.

స్వాతంత్ర్యముసిద్ధించినను, ప్రజలుమతసామరస్యమును, హృదయనైర్మల్యమును గోల్పోయి, నవఖాళిలో ఘోర దురంతములకుఁ బాల్పడిరి. కాలినడకపై మహాత్ముఁడు వాడ వాడలకు, నింటింటికి సంచరించుచు ప్రజాహృదయ పరివర్తనమున కహరహము ప్రయత్నించుచుండెను. ఇంతలో కలకత్తా నగర మల్లకల్లోలమాయెను. చేయునదిలేక మహాత్ముఁ డుపవాసదీక్ష వహించెను. ఆ యహింసా తపస్సునకు దుండగీండ్రి పాషాణహృదయములు కరఁగినవి. తమవద్దఁగల మారణాయుధములను వారు బాపూజీపాదముల మ్రోలఁబెట్టి మోఁకరిలించిరి. కలకత్తానగరమును శాంతియుతమొనర్చి, నిరశనదీక్ష నుపసంహరించుకొని బాపూజీ రాజధాని నగరమున కేతెంచెను.

మతోన్మాద మొక యంటువ్యాధివంటిది. అది పెచ్చరిలిన రూపుమాపుట అతిదుర్లభము. బెంగాల్ దురంతములు శాంతిశీలమగు విదర్భ (బీహారు) కెగఁబ్రాఁకినవి. [illegible]నాయకుల తీవ్రతనుకృషి ఫలితముగ నచటిమతబీభత్సము చిరకాలము ననే యణఁచివేయఁబడినది. ఒకవంక బీహారు యథాప్రకారము శాంతినిలయమయ్యెనో లేదో వెనువెంటనే ఢిల్లీపత్తనమున కీ మహామారి సోఁకినది. ఇచటను నొకయూఁపునూఁపినఁ గాని యీ పెనురక్కసి తనరూపు నుపసంహరించుకొనదు. బీదసాద లను భేదభావములేక, స్త్రీపురుషులను భేదములేక, ఎందఱెందఱినో యీపిశాచి తనపొట్టనుబెట్టుకొన్నది. మతోన్మాదము విలయరూపము ధరింప రాజవీథుల కంకాళములు కాళ్ళదొర్లినవి.

సమస్త భారతమునకును తలమానికమైన రాజధాని నగరమే యి ట్లధఃపతితమైనదే యను దుర్భరావేదనలతో మహాత్ముఁడు నిరాహారదీక్షఁ బూనెను. ముదిమిప్రాయమందలి యీ కఠోర నియమములకు నాయకులు తల్లడపడిరి. ఆయన కోరినరీతి ఏఁబదియైదుకోట్ల రూప్యములు భారతప్రభుత్వము పాకీస్థానమున కొసఁగినది, త్వరలో సంక్షోభము సమసిపోయినది. బాపూజీ నిరశనదీక్ష మాని, తనవారి కానందము ప్రసాదించెను.

# మహాభినిష్క్రమణము

"శరీరమునకన్న మెట్లవసరమో, ఆత్మకు ప్రార్థన యట్లే యావశ్యకము, అంతకు మించియుండ అనసరమని పేర్కొనవలెను. ఎట్లన శరీరారోగ్యమునకై మానవుడు అప్పుడప్పుడు నిరాహారి కావలసివచ్చును. కాని ప్రార్థనకు బస్తు లేదు. అది యెన్నడు వెక్కసము కాదు. ప్రార్థన నా ప్రాణముల నిల్పినది. అది లేనిచో చిరకాలము క్రిందటనే నే నున్మాదిని కావలసినది. ప్రార్థన తక్క ప్రపంచమున నా కన్యసుఖము లేదు. భగవంతుని యందు నాకు విశ్వాసము దృఢమగుకొలది ప్రార్థనపై నా యాసక్తి యోపరానిదాయెను. ప్రార్థనారహితమగు నా బ్రతుకు నిస్తబ్ధము, శూన్యము.

ప్రార్థనకై సమావేశమయిన వారిలో కొంద అన్యత వాదులు మరికొందఱు ఆత్మవంచకు లుండిన నుండవచ్చును. కాని సత్యాన్వేషకుడనయిన నాకు క్షణమైన నేయాలంబనము లేక సాహసింపనో, యా జీవనాధారమగు ప్రార్థన నా కానంద ప్రదమే! రాజ్యాంగమున నిస్పృహ నాకెదురై తేలిచూచినను, నే నెన్నడు శాంతినిఁ గోల్పోవలేదు. అది నాకు ప్రార్థనవలన సమకూడినది. నేను పండితుడనుగాను, ప్రార్థనాశీలుడ" నని బాపూజీ ప్రార్థననుగూర్చి తన యాశయము నెఱుకపఱిచెను.

ఆప్రకార మాయన కడపటిజీవితమంతయు ప్రార్థనాసమావేశముల జరుపుచు,అఖండ రామనామ సంస్మరణము కావించి ధన్యుఁడాయెను. ఆ సమావేశములలో హిందూ, మహమ్మదీయ, క్రైస్తవ, జైన, సిక్కు ప్రభృతి మతములలోని ప్రార్థనాగీతములఁ జదివించి, యమందానంద మందెడివాఁడు బాపూజీ. భారతీయసంస్కృతి వానియన్నిటి సమ్మేళనముచే సంపూర్ణమైనదని యాయన బలీయమగువిశ్వాసము. ఈవిషయమునఁ బెక్కురు అల్పచిత్తులైన దురభిమానులు మహాత్ముని ప్రతిఘటించిరి. భగవానుని 'ఈశ్వరా!' యనుటతోడనే సంతృప్తి చెందక 'ఖుదా' 'యహోవా' యను నామాంతరముల తోడను హృదయపూర్వకముగ సంస్మరించు సర్వమత వాహినీ సంగమకారణజన్ముఁడైన బాపూజీఘనత కింతమాత్రముచే కొఱఁత కల్గునా?

ఇది యట్లుండ, భారతదేశము విభక్తమైన నాఁటనుండి పాకిస్థానమున హిందువులు, సిక్కులు పెక్కుకడగండ్ల పాలై తమ ప్రాణ ధన మానములను దుండగీండ్రచేఁ గోల్పోయిరి. వారుదిక్కులేనివారై, బ్రతికియుండిన బలుసాకు నేరుక తినవచ్చునని గుంపులుగుంపులుగా భారతభూమికిఁ జేర నారంభించిరి. బాపూజీ యీ దీనావస్థను బరికించెను. కాని ప్రతీకార మాయన స్వభావమునకే విరుద్ధము. కావున మహమ్మదీయేత

రులు పాకిస్థాన్ వదలి రారాదని, యచటనేయుండి యాత్మసమ
ర్పణము గావించుకొనవలసినదిగా నాయన యుద్బోధ. అదియును
గాక ప్రతీకారభావముతో హిందూభాగములోని మహమ్మ
దీయులను హిందువు లేమాత్రము హింసింపరాదనికూడ ఆయన
హెచ్చరించుచునే యుండెను. రాజకీయములకును, మతమునకు
నెట్టిసంబంధము లేదని, పాకిస్థాన్ మతసంబంధమైనరాజ్యమైనను
భారతదేశ మట్టిదిగాకుండ నుండవలయుననియు బాపూజీ
యొక్కయు, ఆతని శిష్యకోటియొక్కయుదృఢతరాభిప్రాయము.
పాకిస్థానమునలె మతప్రాతిపదికముపై హిందూస్థానము
ను స్థాపింపవలయునని, అందులకై అడ్డుగానున్న హిందూమత
ద్రోహులను దెగటార్పవలయునని తీవ్రతమాభిప్రాయములు
గల ప్రత్యేకరాజకీయపక్షమొకటి భారతదేశమునఁ గలదు.
వారు బాపూజీనిఁ బొట్టఁబెట్టుకొనుటకు సమయమునకై వేచి
యుండిరి.

ఒకనాఁడు మహాత్ముఁడు ఢిల్లీలో ప్రార్థనాసమావేశ
మున నుపన్యసించుచుండ 'మదనలాల్' అనునొక యున్మాది
ఆయనపై నొకచేతిబాంబును విసరెను. అది విధివశమునఁ దప్పి
పోయినది. దుండగీఁడును ప్రభుత్వముచేఁ బట్టుపడెను. కాని
యాతనిని శిక్షింప మహాత్ముఁడీయకొనలేదు. చిఱునవ్వుదొంతర
లతో వాని తప్పిదమును కరుణామయుఁడగు బాపూజీ క్షమిం

చెను. అది యీనాఁటితో నంతరించినదికాదు. ఆనాఁ డంకురించిన విషబీజము లేఁజిగుళ్ళ నచిరకాలముననే తాల్చినది. దీని నెవ్వరు గుర్తింపకుండుట మిక్కిలిశోచనీయము.

అది 1948 జనవరి 30 తేది శుక్రవారము. ఢిల్లినగరమున బిర్లాభవన ప్రాంగణమున నేర్పాటుచేఁబడిన ప్రత్యేకప్రార్థనా సభకు బాపూజీ కొలఁదినిముసములాలస్యముగ వెడలెను. ఆయన సభావేదికనెక్కు-చుండ, సుమారు ముప్పదియైదేండ్ల యువకుఁడు నృత్యప్రణామముఁడాయెను. బాపూజీ ప్రతిప్రణామమునుగావించెను. అంతనాతఁడు, "తమరీనాఁడేలొకో కొలఁదినిమిషము లాలస్యముగ వచ్చుచున్నట్లున్నది" యని ప్రేమపురస్సరముగఁ బల్కు-రించెను. "అవును" అని బాపూజీ మందహాసముతో ప్రత్యుత్తర మొసఁగెను. అంత నాయువకుఁడు మహాత్ముని పాదారవిందముల నతిభక్తితో స్పృశించుటకా యనునట్లు వినమ్రుఁడై చేతుపాకిఁ దీసి బాపూజీగుండెమీఁదను, పొట్టమీఁదను నాలుగుగుండ్లు ప్రేల్చెను. "హేరామా! హేరామా" యని బాపూజీ నేలవ్రాలెను. ఆయనను మనుమరాండ్రు లేవతీసికూర్చుండఁబెట్టిరి. రక్తధారలు ఓడికలుగట్టెను. ప్రార్థనాసక్తులై తనరాకకు నిరీక్షించుచున్న ప్రజానీకమునకు తుదిసారి బాపూజీ ప్రణమిల్లెను. అప్పటికే ఆయనకు మాటాడుశక్తి గతించినది. ఇంత ఘోరకలి అయిదు గంటల పన్నెండు నిముసములకు జరిగినది. వెంటనే బాపూజీ

బిర్లాభవనమునకుఁ జేర్పఁబడెను. మఱి కొలఁదికాలమునకే "బాపూజీ యిఁకలేఁడు" అను వార్తారావము నలుమూలల చెలరేఁగెను. ఆకాశవాణి గద్గదస్వరమున నీ వార్త జగతీతలమున కెఱిఁగించెను.

మహాత్మా! ఆనాఁ డనాగరకుఁడగు మానవుఁడు ఏసు క్రీస్తును సిలువఁగొట్టెను. ఈనాఁడు నాగరకుఁడనని విఱ్ఱవీఁగు మానవుఁడు నిను తుపాకిగుండ్లకు బలిచేసెను. అయిన నేమి? బాపూజీ! నీవు ధన్యజీవివి! సత్యాహింసల నాచరణమున సర్వ మానవులకు ప్రబోధించిన యుగపురుషుఁడవు!! కడకు నీ యాత్మ బలిదానము మూలమునను సర్వప్రపంచమున కాత్మోన్నతిని గలిగించిన పురుషోత్తముఁడవు!! ఏ పవిత్ర రామనామమును నీయుచ్ఛ్వాస నిశ్వాసములు గావించుకొంటివో అద్దాని నేవిడువక "అంత్య కాలమునందు నన్నే స్మరించుచు దేహమును నెవఁడు వీడుచున్నాఁడో వాఁడు నాస్వరూపమును పొందుచున్నాఁ"డను గీతావాక్యము ననుసరించి నీవు సత్యస్వరూపుఁడగు పరమాత్మ యందు లీనమైతివి.

"పరమదరిద్రులును తమదిగా దేశమును భావించుకొనఁ జాలునట్టియు, దాని నిర్మాణమునకై వారి పలుకుబడికూడ చెల్లునట్టియు, ఉచ్చనీచవిభాగములు లేనట్టియు, అన్నికుల మతములవారును పూర్ణసామరస్యమున జీవింపఁ జాలునట్టియు, అస్పృశ్యతాపీడ, మద్యపానములు లేనట్టియు, ఏ భారత

ప్రాభవమును సాధించుటకై యహరహమును కృషిసల్పితివో, ఆదివ్యభారతమును, ఆభూతలస్వర్గమును, ఆ'రామరాజ్యము'ను నూట యిరువదియైదు సంవత్సరములు జీవించి సాధించెదనని తలంచితివి. కడకు మమ్ములను నట్టేట ముంచితివా? ఇంక మా కేదుగడ యెవరు?''

౨

బాపూజీ చరమదర్శనార్థమై ప్రజలు తండోపతండములుగ బిర్లాభవనము చుట్టుముట్టిరి. ఆయన దేహమున పాదములు మొదలు పొత్తికడుపువఱకు స్వచ్ఛమగుఖద్దరు వస్త్రము గప్ప బడినది. హంతయగు 'గోడ్సే' రివాల్వరు గుండ్లు కావించిన గాయము లందఱకుఁ గనిపించుచున్నవి. ఆయనముఖారవిందము కాంతి తఱుఁగనిదై ప్రార్థనానిమగ్నమైనట్లున్నది. మెడలో నొక ఖద్దరుమాల, శిరమున సాంబ్రాణీధూపము వేయఁబడినది. ఆయనబిడ్డలు, వారసులు నిశ్చేష్టులై శిలాప్రతిమలవలె వంచిన తలలనెత్తఁజాలక ప్రక్కనిలువఁబడిరి. వారేదో యింకను తమ బాపూజీతో మంతనము చేయుచున్నారు కాఁబోలును. సమస్త ప్రజలకు దర్శనముకలుగునట్లు బాపూజీ మృతదేహము బిర్లా భవనముపై నెత్తయిన వేదికమీఁద నుంచఁబడెను.

ఎంతకాల మీశోకము!! ఎంతకాల మీనిశ్చేష్టత!! బాపూజీ దివ్యప్రబోధ మొకపరి నాయకుల యంతరాత్మల

జాగరిత మొనర్చినది. నెహ్రూ తన హృదయదౌర్బల్యమును విడనాడి కర్తవ్యమును నిర్వహింప ముందంజవేసెను. పావన యమునానదీతీరమున 'రాజఘాట్' బాపూజీ దహనసంస్కారముల కుచితమైనదని అతఁడు నిర్ణయించెను.

మఱునాఁ డుదయము పూవుల తేరుపై బాపూజీ కదలిపోయెను. ఢిల్లీప్రజలు, ఆబాలగోపాలము శ్మశానవాటికకుఁ బాదచారులై వెడలిరి. తమప్రియజనకుని, ప్రియబాంధవుని, ప్రియనాయకునిఁ గోల్పోయి, పెన్నిధిని గోల్పోయిన పేదలై 'బాపూ బాపూ' యని వెక్కి వెక్కి యేడ్చిరి. జనసముద్రము, సప్తమహాసముద్రము లొక్కచోఁ జేరి కదలి వచ్చుచున్నట్లుండెను. వివిధదేశముల రాయబారులు మహాత్ముని గౌరవపురస్సరముగా పుష్పమాలాలంకృతునిఁ గావించిరి. ప్రజావాహిని పూలవృష్టిని గురిపించినది. ఊరేగింపు గమ్యస్థానము చేరినది. శోకరస పరమావధి నతిక్రమించిన యీ విషాదతమదృశ్యమును సర్వభారతము, కాదు కాదు, సమస్తవిశ్వ మొక్కసారి చూడఁగల్గిన ధన్యతఁగాంచెడిది.

ఒకప్రక్క భగవద్గీతాపారాయణము జరుగుచున్నది. వేఱొకప్రక్క రఘుపతి రాఘవ రామభజన మిన్నుముట్టుచున్నది. బాపూజీ యమునానదీ పవిత్రతోయముల స్నానమాడి, అలనాఁడంపశయ్య నలంకరించిన బ్రహ్మచర్యదీక్షాజిత

మన్మథుఁడగు భీష్మాచార్యునివలె చితిపై శయనించి యగ్నిహో త్రుని కాఁకల కాహుతుఁడాయెను. బాపూజీపుత్రుఁడు దేవ దాసు గాంధి అంత్యక్రియలు గావించెను.

కరుణాసముద్రుఁడగు లోకపిత హత్యగావింపఁబడిన వార్త, ప్రపంచము నమ్మునో లేదో యను శంకతోనా యను నట్లు ఆకాశవాణి తిరిగి తిరిగి యావృత్త మొనర్చెను. విశ్వపతాక లన్నియు తలలువంచి యశ్రుతర్పణము గావించినవి. ప్రపంచ ప్రముఖులు యుగపురుషుని యస్తమయమునకు తమతమ సంతాపములను వెలిపుచ్చిరి.

ప్రపంచ ప్రముఖులకే కాదు, బాపూజీ మరణవార్త ఆబాలగోపాలమునకు, ఖండఖండాంతరముల, మారుమూల గ్రామములలో నివసించువారికిఁగూడ నెంత వెతను గలిగించినదో పరికింపుఁడు. ప్రఖ్యాత అమెరికన్ రచయిత్రి పెర్లుబక్ కుమారుఁడు బాపూజీ పరమపదించినట్లు విని యతిదుఃఖితుఁడై, "తుపాకులను జేయుట నెవ్వరును కనిపెట్టకున్న నెంత బాగుండె డిది" యని యనెనఁట. ఆహా!! ఎంతవిశిష్టమగు భావన!!

బాపూజీ చితాభస్మము సర్వజగతీ తీర్థముల నిమజ్జన మొనరింపఁబడెను. ఇఁకఁ లేదు, బాపూజీ మనకడ నిఁక లేఁడు!! కాని యా మహాత్ముని యాత్మజ్యోతి మాత్రి మాఱని జీవ

జ్యోతియై ధర్మపథమున ధవళదీప్తుల నెలార్చుచు నేయున్నది. "నా జీవితమే నా జీవితసందేశ" మని బాపూజీ పేర్కొనినట్లు నన మాయన యుపదేశములకు సజీవమూర్తులను కాంగల్గి నపుడు, ఆయన ప్రాదుర్భావ మన్వర్థమని తలంపవచ్చును.

ఓ మహాత్మా!! మేము నీ సంతతివారము. నీ శిష్యులము. నీవు కలలుగన్న భారతదేశ పరిరక్షకులము. భారతదేశవిధి నిర్ణేతలము. మేము నీ యడుగుజాడల నడచుకొనగల శక్తిసామర్థ్యముల మాకు ప్రసాదింపుము.

ఓ తండ్రీ!! నీ కివే మా జోహారులు!

ఓం సహనావవతు!

సహనౌ భునక్తు!!

సహవీర్యం కరవావహై!!!

తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై!!!!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

---

వైశ్య ముద్రాక్షరశాల, నెల్లూరు.